www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గురువారం | 31-10-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 214 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: చతుర్దశి మ. 3.35 తదుపరి అమావాస్య; నక్షత్రం: చిత్ర రా. 12.44 తదుపరి స్వాతి; వర్జ్యం: ఉ. 6.43-8.31; దుర్ముహూర్తం: ఉ. 10.04-10.50, మ. 2.38-3.23; అమృతఘడియలు: సా. 5.31-7.19; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.16; సూర్యాస్తమయం: 5.40 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

తెలంగాణ నుంచే..
మోదీపై యుద్ధం!

రాష్ట్రంలో కులగణన పూర్తిచేసి సన్నద్ధమవుదాం

దేశ వ్యాప్తంగా సామాజిక, ఆర్థిక సర్వే చేపట్టే పరిస్థితిని కల్పిద్దాం

రాహుల్‌గాంధీ ఇచ్చిన మాటను నిలబెట్టాలి.. దేశానికి రోల్ మోడల్‌గా తెలంగాణ

పార్టీకి నష్టం కలిగిస్తే సహించం.. కాంగ్రెస్ పార్టీ విధానం అమలే ప్రభుత్వ విధానం

ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

కేంద్ర జనగణనలో ఓబీసీ గణననూ చేర్చాలి: టీపీసీసీ తీర్మానం

కులగణనపై రాష్ట్ర స్థాయిలో సభ.. రాహుల్ వచ్చే అవకాశం

హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ప్రభుత్వం చేపట్టనున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ కులగణన దేశానికే రోల్ మోడల్ కానుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇది.. దేశానికి రాహుల్‌గాంధీని ప్రధానిని చేసేలా ఉంటుందన్నారు. నవంబరు 31 కల్లా రాష్ట్రంలో కులగణనను పూర్తి చేసుకుని.. దేశవ్యాప్తంగా దీనిని చేపట్టాల్సిన పరిస్థితి కల్పించాలని, ఈ దిశగా ప్రధాని నరేంద్ర మోదీపై తెలంగాణ నుంచే యుద్ధం ప్రకటించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, రాజకీయ కుల సర్వే నిర్వహిస్తున్న నేపథ్యంలో బుధవారం గాంధీభవన్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన అవగాహన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో తెలంగాణ మోడల్‌ను పరిగణనలోకి తీసుకునేలా మోడల్ డాక్యుమెంట్‌ను కేంద్రానికి పంపుతామన్నారు. తెలంగాణలో కులగణన చేపడతామంటూ ఎన్నికల సందర్భంగా రాహుల్‌గాంధీ మాట ఇచ్చారని గుర్తు చేశారు. గాంధీ కుటుంబం ఒక్కసారి మాట ఇచ్చారంటే ఎట్టిపరిస్థితుల్లోనూ నెరవేర్చి తీరతారని అన్నారు. రాహుల్‌గాంధీ మాటను నిలబెట్టడం కాంగ్రెస్ నాయకులందరి బాధ్యత అని స్పష్టం చేశారు. "మనం మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ ఇచ్చిన మాటను నిలబెట్టే వారసులం. రేవంత్ రెడ్డికి ప్రత్యేక గుర్తింపు ఏమీ లేదు. కాంగ్రెస్ పార్టీయే రేవంత్‌రెడ్డికి గుర్తింపు ఇచ్చింది. మీరంతా కష్టపడితేనే నాకు ఈ బాధ్యత వచ్చింది. గాంధీ కుటుంబం మాట ఇచ్చిందంటే మరో చర్చకు తావు లేదు. చర్చకు అవకాశం ఇచ్చారంటే వారు పార్టీ ద్రోహులే" అని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. కాగా, కాంగ్రెస్ పార్టీ ఎజెండాతోనే ప్రజల్లోకి

మిగతా 13వ పేజీలో...



కులగణనపై గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

బీసీల లెక్కల కోసం ప్రత్యేక కమిషన్‌ను నియమించండి

స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల అమలుకు అది తప్పనిసరి: హైకోర్టు

బీసీ కమిషన్‌కు అప్పగించడం చెల్లదంటూ ఆర్.కృష్ణయ్య పిటిషన్ 13

ఉద్యోగులకు దీపావళి కానుక.. ఒక డీఏ విడుదల చేసిన సర్కారు

నవంబరు జీతంతో కలిపి డిసెంబరు నుంచి చెల్లింపు.. జీపీఎఫ్‌లో 28 నెలల బకాయిలు

సీపీఎస్ ఉద్యోగుల 10% బకాయిలు 'ప్రాన్' ఖాతాల్లోకి.. మిగతాది 17 వాయిదాల్లో



పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు 'ఆంధ్రజ్యోతి'

దీపావళి శుభాకాంక్షలు

సెలవు

దీపావళి సందర్భంగా గురువారం మా కార్యాలయాలకు సెలవు. కావున 'ఆంధ్రజ్యోతి' శుక్రవారం (1-11-2024) సంచిక వెలువడదు. పునర్దర్శనం శనివారం.

-మేనేజింగ్ డైరెక్టర్



టీటీడీ చైర్మన్‌గా బీఆర్‌నాయుడు

23 మంది సభ్యులతో బోర్డు ఏర్పాటు


టీడీపీ నేత నర్సిరెడ్డి, 13

యాదాద్రి శిల్పి ఆనంద్ సాయికి చోటు

భారత్ బయోటెక్ సుచిత్రా ఎల్లాకు..

మాజీ సీజేఐ జస్టిస్ హెచ్ఎల్ దత్తుకు చాన్స్

జనసేన కోటాలో ముగ్గురికి అవకాశం



ఫాస్ట్ ఫుడ్స్‌తో పిల్లలకు పెను ముప్పు

పదేళ్ల వయసులోనే ఫ్యాటీ లివర్

5 నుంచి 35%కి గ్యాస్ట్రిక్ కేసులు

పల్లెల్లోనూ మారిన ఆహారపుటలవాట్లు

ఇష్టారాజ్యంగా యాంటాసిడ్స్ వాడొద్దు

మితిమీరిన మద్యపానంతో కాలేయం

దెబ్బతింటున్న కేసులు భారీగా పెరిగాయి

ఏఐజీ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): చిప్స్, ఫ్రెంచ్ ఫ్రైస్, పిజ్జా, బర్గర్ వంటి ఫాస్ట్‌ఫుడ్స్, అల్ట్రా ప్రాసెస్డ్, జంక్ ఫుడ్స్‌తో పిల్లల ఆరోగ్యానికి పెనుప్రమాదం ఉందని.. ఏఐజీ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. బడి ఈడు పిల్లల్లోనూ ఫ్యాటీ లివర్, గ్యాస్ట్రిక్ సమస్యలు నమోదవుతున్నాయని.. పదేళ్ల క్రితం జనాభాలో ఐదు శాతం మేర ఉన్న గ్యాస్ట్రిక్ కేసుల సంఖ్య 35 శాతానికి పెరిగిందని ఆవేదన వెలిబుచ్చారు. "దశాబ్దకాలంలో ఏ జబ్బూ ఈ స్థాయిలో పెరగలేదు. హృద్రోగాలు, మధుమేహం లాంటివి కూడా కేవలం 15 శాతం పెరిగాయే తప్ప...ఈ స్థాయిలో పెరగలేదు. మన ఆహారపుటలవాట్లను మార్చుకోకుండా, జాగ్రత్తలు తీసుకోకుండా ఇలాగే వ్యవహరిస్తే.. మరో పదేళ్ల తర్వాత ఫ్యాటీ లివర్, గ్యాస్ట్రిక్ సమస్యల కేసులు 60 శాతానికి పెరిగే ప్రమాదం లేకపోలేదు. పాశ్చాత్య దేశాల్లో ఈ సమస్య ఈ స్థాయిలో లేదు. ఎందుకంటే వాళ్లు బయట తీసుకునే ఆహారపదార్థాలు హానికలిగించే ప్రిజర్వేటివ్స్ లేకుండా చూసుకుంటున్నారు" అని ఆయన పేర్కొన్నారు.

'ఆంధ్రజ్యోతి'కి డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ పూర్తి పాఠం లోపలి పేజీల్లో.. 14

పచ్చిగుడ్లతో చేసే మయోనైజ్‌పై నిషేధం

తయారీ, నిల్వ, వినియోగంపై బ్యాన్

తక్షణ అమలుకు ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు

ఏడాది పాటు కొనసాగనున్న ఆంక్షలు

'మోమోస్' ఘటనతో సర్కారు అప్రమత్తత 14

కొకైన్ ఎక్కడి నుంచి వచ్చింది?

రాజ్ పాకాలపై పోలీసుల ప్రశ్నల వర్షం.. 8 గంటల్లో 80 నుంచి వంద ప్రశ్నలు

విజయ్ ఫోన్‌పై ఆరా.. ఫామ్‌హౌజ్‌కు తీసుకెళ్లి తనిఖీలు

శంకర్‌పల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కేటీఆర్ బావమరిది రాజ్ పాకాలను మోకిల పోలీసులు 8 గంటలపాటు ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేశారు. దాదాపు 80 నుంచి వంద ప్రశ్నలు అడిగారని తెలుస్తోంది. దావత్‌కు ఎవరెవరు వచ్చారు? నుంచి మొదలుకుని పార్టీలోకి కొకైన్ ఎక్కడి నుంచి వచ్చిందనే అంశం వరకూ ప్రశ్నలు అడిగినట్లు సమాచారం. మరీ ముఖ్యంగా విజయ్ మద్దూరి ఫోన్ గురించి ఆరా తీశారు. ఫామ్‌హౌజ్ పార్టీ కేసులో రాజ్ పాకాలకు హైకోర్టు విధించిన గడువు బుధవారంతో ముగియడంతో ఆయన పోలీసు విచారణకు హాజరయ్యారు. మధ్యాహ్నం 12.16 గంటలకు ఇద్దరు న్యాయవాదులతో వచ్చారు. నార్సింగి ఏసీపీ రమణ గౌడ్ పర్యవేక్షణలో ఆయనను న్యాయవాదుల సమక్షంలో విచారించారు. ఆయన మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. రాజ్ పాకాల ఫామ్‌హౌజ్‌లో పార్టీ రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన

మిగతా 12వ పేజీలో...



విచారణకు మోకిల పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన రాజ్‌పాకాల

కొత్త మార్గదర్శకాల ప్రకారమే..

బెదిరింపులు ఒట్టివని తేల్చారు!

ప్రయాణికులు, వైమానిక సంస్థలు, భద్రతాసిబ్బందిపై తగ్గిన భారం

ఈ నెల 19నే నూతన మార్గదర్శకాల జారీ

పలు కోణాల్లో బెదిరింపుల పరిశీలన

అత్యధికం ఒకే సోషల్ మీడియా హ్యాండిల్ నుంచి వచ్చినట్లు గుర్తింపు 2

విమానాలకు ప్రమాదం లేదని నిర్ధారణ

2 కోట్లు ఇవ్వాలంటూ సల్మాన్‌కు బెదిరింపు

రూ.20 లక్షలు ఇవ్వు!

లేకుంటే మీ పిల్లల్ని అనాథలను చేస్తా..

చొప్పదండి ఎమ్మెల్యేకు లండన్ నుంచి వాట్సాప్ కాల్‌లో బెదిరింపు

నిందితుడు బోడుప్పల్ వాసిగా గుర్తింపు.. లుక్ అవుట్ సర్క్యులర్ జారీ



కరీంనగర్ క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): డబ్బుల కోసం ఓ వ్యక్తి ఏకంగా ఓ ఎమ్మెల్యేనే బెదిరించాడు. తాను అడిగినన్ని డబ్బులు ఇవ్వకుంటే.. మీ పిల్లలను అనాథలను చేస్తానంటూ వార్నింగ్ ఇచ్చాడు! దీంతో ఎమ్మెల్యే పోలీసులకు ఫిర్యాదు చేయగా.. విచారణ చేపట్టి ఆ నిందితుడిని గుర్తించారు. కరీంనగర్ రూరల్ ఏసీపీ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యానికి సెప్టెంబరు 28న మధ్యాహ్నం, అదే రోజు రాత్రి సమయాల్లో +447886696497 నంబర్ నుంచి వాట్సాప్ కాల్ వచ్చింది. తనకు రూ.20 లక్షలు చెల్లించాలని.. లేకుంటే రాజకీయంగా అప్రతిష్ఠపాలు

మిగతా 3వ పేజీలో...

'విద్యుత్తు' నిర్ణయాలన్నీ కేసీఆర్‌వే!

ప్రభుత్వానికి జ్యుడీషియల్ కమిషన్ నివేదిక

కేసీఆర్‌ను విచారణకు పిలవకుండా ఆయన లేఖలోని అంశాలనే అభిప్రాయాలుగా తీసుకున్న కమిషన్.. గడువులోపే నివేదిక సమర్పణ!

ఈ నెల 29తో ముగిసిన జస్టిస్ లోకూర్ కమిషన్ గడువు 14

గ్రూప్-3 అభ్యర్థులకు 10 నుంచి హాల్‌టికెట్లు

ఖలిస్థానీలపై దాడుల్లో

అమిత్ షా హస్తం

వాషింగ్టన్ పోస్ట్‌కు నేనే వివరాలిచ్చా

కెనడా డిప్యూటీ విదేశాంగ మంత్రి

భారత విద్యార్థులకు ఆహారం కొరత!

ఉచిత ఆహారం నిలిపివేతపై 2

వాంకోవర్ ఫుడ్ బ్యాంక్ నిర్ణయం



సరయూ తీరం దేదీప్యమానం

25లక్షల దీపాలతో గిన్నిస్ ప్రపంచ రికార్డు

అయోధ్య, అక్టోబరు 30: దీపావళి పండుగ సందర్భంగా బుధవారం అయోధ్యలోని సరయూ నదీ తీరంలో దీపోత్సవాన్ని అత్యంత అట్టహాసంగా నిర్వహించారు. 25 లక్షల ప్రమిదల వెలుగులతో సరయూ తీరం దేదీప్యమానమైంది. అయోధ్యలో రామమందిరం ప్రారంభమైన తర్వాత తొలి దీపావళి వేడుకలు కావడంతో నిర్వాహకులు సరయూ తీరంలో భారీగా ఏర్పాటు చేశారు. 55 ఘాట్‌లలో వెలిగించిన లక్షలాది ప్రమిదలను గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు డ్రోన్లతో లెక్కించారు. మొత్తంగా 25,12,585 దీపాలను వెలిగించినట్లు వెల్లడించారు. ఇది గిన్నిస్ ప్రపంచ రికార్డు. మరోవైపు, బుధవారమే సరయూ తీరంలో 1,121 మంది వేదాచార్యులు ఒకేసారి హారతి సమర్పించారు. ఇది కూడా గిన్నిస్ ప్రపంచ రికార్డుల్లోకెక్కింది.



దీపావళి వేడుకల్లో
చిందేసిన అమెరికా రాయబారి

ఢిల్లీ, అక్టోబరు 30: ఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయంలో భారత్‌లో అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టీ దీపావళి వేడుకల్లో సందడి చేశారు. భారతీయ వస్త్రధారణలో వేడుకల్లో పాల్గొన్న ఆయన బాలీవుడ్ సినిమాలోని తౌబా-తౌబా పాటపై అదిరిపోయే స్టెప్పులేశారు. మిగతా కళాకారులతో కలిసి బాంగ్రా డ్యాన్స్ చేశారు. భారత్-అమెరికా బంధం కూడా దీపావళి వెలుగుల్లా వెలిగిపోవాలని ఆయన ఆకాంక్షించారు.

లోకం తీరు



బలగాల ఉపసంహరణ పూర్తి

» కొనసాగనున్న 2020 నాటి యథాతథ స్థితి

న్యూఢిల్లీ, అక్టోబరు 30: తూర్పు లద్దాఖ్‌లోని డెప్సంగ్, డెమ్చోక్ ప్రాంతాల నుంచి భారత్-చైనా బలగాల ఉపసంహరణ ప్రక్రియ పూర్తయిందని బుధవారం ఆర్మీ వర్గాలు తెలిపాయి. త్వరలోనే పెట్రోలింగ్‌ను పునరుద్ధరించనున్నట్లు పేర్కొన్నాయి. వాస్తవాధీన రేఖ(ఎల్‌ఏసీ) వెంబడి నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులకు ముగింపు పలుకుతూ ఇరు దేశాల మధ్య ఇటీవల గస్తీ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా అక్టోబరు 29 లోగా బలగాలను ఉపసంహరించుకోవాలని ఉద్రిక్తతలకు ముందున్న స్థానాలకు వెళ్లిపోవాలని నిర్ణయించాయి. ఒప్పందానికి ముందు వివాదస్పద ప్రాంతంలో శాటిలైట్ చిత్రాలలో కనిపించిన బలగాల టెంట్లు, వాహనాలు ప్రస్తుతం తొలగించినట్లు స్పష్టమవుతోంది. కాగా, 2020 జూన్‌లో గల్వాన్ లోయలో భారత్- చైనా సైనికుల మధ్య చోటుచేసుకున్న ఘర్షణ తీవ్ర రూపం దాల్చింది. కల్నల్ సంతోష్‌బాబుతో పాటు 20 మంది భారత సైనికులు మరణించారు.

ఆఫ్‌లైన్ పరీక్షలను తగ్గించి.. ఆన్‌లైన్, హైబ్రిడ్ పద్ధతులను ఎంచుకోండి

» ఎన్టీఏ, పరీక్షల నిర్వహణపై రాధాకృష్ణన్ కమిటీ సిఫారసులు!

న్యూఢిల్లీ, అక్టోబరు 30: జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) కార్యకలాపాలను సమీక్షించేందుకు ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ ప్రవేశ పరీక్షల్లో పలు సంస్కరణలను సూచిస్తూ నివేదిక సిద్ధం చేస్తోంది. ఎన్టీఏ నిర్వహణపై సమీక్ష జరిపేందుకు గాను కేంద్ర ప్రభుత్వం ఇస్రో మాజీ చైర్మన్ ఆర్.రాధాకృష్ణన్ నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ కమిటీ తుది నివేదికను సమర్పించేందుకు రెండు వారాల గడువు కావాలని ఈ నెల 21న కేంద్రం సుప్రీంకోర్టును కోరింది. నివేదిక దాదాపు పూర్తయిందని, ఎన్టీఏ కార్యకలాపాలను క్రమబద్ధీకరించడం, దేశంలో పెద్దపెద్ద ప్రవేశ పరీక్షల నిర్వహణలో చేపట్టాల్సిన సంస్కరణలపై పలు సిఫారసులు చేసిందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. సాధారణ (ఆఫ్‌లైన్) పరీక్షలను తగ్గించడం లేదా పూర్తిగా ఆన్‌లైన్ అవకాశం లేని పరిస్థితుల్లో హైబ్రిడ్ విధానాన్ని ఎంచుకోవడం; నీట్ సహా పలు ప్రధాన పరీక్షలను రాసే సంఖ్యపై పరిమితి విధించడం; ఔట్‌సోర్స్ సిబ్బంది, పరీక్ష కేంద్రాల పాత్రను తగ్గించడం ద్వారా పరీక్షల పవిత్రతను కాపాడడం వంటి సిఫారసులు చేసినట్లు వెల్లడించాయి. భారీ స్థాయిలో నిర్వహించే పరీక్షల్లో ఎదురయ్యే సమస్యలు, సవాళ్లను పరిష్కరించే అంశంపై చర్చించేందుకు కమిటీ 22 సార్లు సమావేశమైంది. కమిటీకి 37 వేలకు పైగా సలహాలు, సూచనలు వచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

విపత్తు నిర్వహణకు 2.37 లక్షల మందితో యువశక్తి

న్యూఢిల్లీ, అక్టోబరు 30: విపత్తు నిర్వహణ సమయంలో సత్వరం స్పందించి.. సహాయక చర్యల కోసం మొట్టమొదటగా ఘటనాస్థలికి చేరుకునేలా 2.37 లక్షల మంది యువకులకు వలంటీర్లుగా శిక్షణ ఇవ్వనున్నట్లు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ వెల్లడించింది. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ(ఎన్‌డీఎంఏ) ఏర్పాటై 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం జరిగిన కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ ఈ విషయాన్ని వెల్లడించారు. నేషనల్ కెడెట్ కార్ప్స్(ఎన్‌సీసీ), నేషనల్ సర్వీస్ స్కీమ్(ఎన్ఎస్ఎస్), భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, నెహ్రూ యువ కేంద్ర సంఘటన్(ఎన్‌వైకేఎస్) ద్వారా 28 రాష్ట్రాల్లోని 315 జిల్లాలకు చెందిన 2.37 లక్షల మంది యువకులకు 'యువ ఆపద మిత్ర' స్కీమ్‌లో భాగంగా ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వీరికి శిక్షణనిచ్చే శిక్షకులకు ట్రైనింగ్ ఇవ్వడానికి 1,300 మందిని ఎంపిక చేశామని పేర్కొన్నారు. ఈ స్కీమ్‌కు రూ.469.53 కోట్లను వెచ్చించనున్నట్లు వివరించారు.

బాణసంచాపై నిషేధంలో మత కోణం లేదు: కేజ్రీవాల్

ఢిల్లీ, అక్టోబరు 30: దీపావళి సందర్భంగా బాణాసంచా కాల్చడంపై నిషేధం విధించడంలో హిందూ-ముస్లిం కోణం లేదని ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ స్పష్టం చేశారు. కాలుష్యాన్ని నివారించేందుకే నిషేధం విధించినట్లు చెప్పారు. దీపావళి పండుగ వెలుగుల పండుగ అని కాలుష్యం వెదజల్లేది కాదన్నారు. చిన్నారులతో సహా అందరినీ కాలుష్యం నుంచి కాపాడేందుకే బాణాసంచాపై నిషేధం విధించామన్నారు. హైకోర్టు, సుప్రీంకోర్టు కూడా నిషేధాన్ని సమర్థించాయని కేజ్రీవాల్ చెప్పారు. 2025 జనవరి 1వరకు బాణసంచా తయారీ, అమ్మకం, కాల్చడం, నిల్వ ఉంచడంపై ఢిల్లీ ప్రభుత్వం ఇటీవలే నిషేధం విధించింది.

మహిళల ప్రార్థనలు ఇతర మహిళలకూ వినపడొద్దు!

» అఫ్ఘాన్ మహిళలపై తాలిబాన్ల కొత్త ఆంక్షలు

కాబూల్, అక్టోబరు 30: తాలిబాన్ల పాలనలో అఫ్ఘానిస్థాన్ మహిళల హక్కులు రోజురోజుకూ హరించుకుపోతున్నాయి. ఇతర మహిళల సమక్షంలో వారికి వినిపించేలా మహిళలు ప్రార్థన కూడా చేయరాదని, ఖురాన్ పఠనం సైతం ఇతరులకు వినిపించేలా చేయకూడదని తాజా నిషేధాన్ని తాలిబన్లు అమల్లోకి తెచ్చారు. ధర్మప్రచార, అధర్మ నివారణశాఖ మంత్రి మొహమ్మద్ ఖాలిద్ హనఫి ఈ మేరకు తాజా డిక్రీ జారీ చేశారు. వర్జీనియాకు చెందిన అఫ్ఘాన్ న్యూస్ చానెల్ అము టీవీ ఈ డిక్రీని ప్రసారం చేసింది. 'మహిళలు అజాన్, తక్బీర్ వినిపించేందుకే అనుమతి లేనప్పుడు.. వారు కచ్చితంగా పాటలు పాడటం, సంగీతాన్ని ఆస్వాదించడం కూడా చేయలేరు' అని ఆ డిక్రీలో మంత్రి మొహమ్మద్ ఖాలిద్ హనఫి పేర్కొన్నారు. 'మహిళల స్వరాన్ని అవ్‌రాహ్(గుప్తమైనది)గా పరిగణిస్తున్నందున బహిరంగంగా ఇతర మహిళలకు సైతం వారి స్వరం వినిపించకూడదు' అని తేల్చిచెప్పారు.

కేంద్ర పింఛనుదారులకు పెంచిన 3% డీఏ మంజూరు

న్యూఢిల్లీ, అక్టోబరు 30: దీపావళి నేపథ్యంలో పెన్షనర్లకు పెంచిన 3 శాతం కరువు భత్యాన్ని (డీఏ) మంజూరు చేస్తూ కేంద్ర ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులకు డీఏను 3 శాతం పెంచుతూ ఈ నెల 16 కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఇది ఈ ఏడాది జూలై 1 నుంచే అమల్లోకి వస్తుంది. ఈ పెంపుతో ఇప్పటి వరకున్న 50 శాతం డీఏ 53 శాతానికి చేరనుంది. క్యాబినెట్ నిర్ణయం మేరకు బుధవారం పెన్షన్, పెన్షనర్స్ సంక్షేమ విభాగం ఉత్తర్వులు జారీ చేసినట్టు కేంద్ర సిబ్బంది మంత్రిత్వ శాఖ పేర్కొంది.

మహాయుతిలో 'మాలిక్' చిచ్చు!

» అజిత్ పార్టీ నేత నవాబ్‌కు మద్దతివ్వడానికి బీజేపీ నో

ముంబై, అక్టోబరు 30: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ.. ఏక్‌నాథ్ శిండే సారథ్యంలోని శివసేన-బీజేపీ-ఎన్‌సీపీ కూటమి 'మహాయుతి'లో చిచ్చు రేగింది. ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీ అభ్యర్థి, మాజీ మంత్రి నవాబ్ మాలిక్‌కు మద్దతివ్వడానికి, మాన్‌ఖుర్ద్ శివాజీ నగర్ స్థానంలో ఆయన తరఫున ప్రచారం చేయడానికి మిత్రపక్షమైన బీజేపీ నిరాకరించింది. మాఫియా డాన్ దావూద్ ఇబ్రహీం, అతడి అనుచరులు చోటా షకీల్, టైగర్ మెమన్‌తో లింకులు, మనీలాండరింగ్ ఆరోపణలపై 2022లో ఎన్ఐఏ మాలిక్‌ను అరెస్టు చేసింది. ఈ ఏడాది జూలైలో అనారోగ్య కారణాలతో ఆయన బెయిల్ పొంది బయటకు వచ్చారు. అనుశక్తినగర్ సిటింగ్ ఎమ్మెల్యేగా ఉన్న మాలిక్‌ను నిరుడు ఎన్‌సీపీని చీల్చినప్పుడు అజిత్ తన పార్టీలోకి తీసుకున్నారు. బీజేపీ అభ్యంతరం చెప్పినా వినిపించుకోలేదు. ఈ దఫా మాన్‌ఖుర్ద్ శివాజీ నగర్ నుంచి అజిత్ ఆయన్ను బరిలోకి దించారు. అయితే మిత్రపక్షాల ఒత్తిడితో తనకు టికెట్ ఇవ్వకపోవచ్చన్న ఉద్దేశంతో మాలిక్ ఇండిపెండెంట్‌గా కూడా నామినేషన్ వేశారు. చివరకు ఆయనకే బీఫాం ఇచ్చారు. అయితే దావూద్‌తో లింకులున్న మాలిక్ తరఫున ప్రచారం చేయబోమని, ఇది తమ విస్పష్ట వైఖరని బీజేపీ ముంబై శాఖ అధ్యక్షుడు ఆశిష్ షేలర్ ప్రకటించారు.

4 నెలల్లో 1,750 కోట్లు

భారతీయుల నుంచి కాజేసిన సైబర్ నేరగాళ్లు..2024 మొదటి నాలుగు నెలల్లో 7.4 లక్షల కేసులు

» దేశంలో శరవేగంగా డిజిటలైజేషన్
» కరువైన పటిష్ఠ సైబర్ రక్షణ వ్యవస్థ
» సైబర్ నేరాలకు అడ్డాగా భారత్?

ముంబయి, అక్టోబరు 30: డిజిటలైజేషన్ దిశగా వేగంగా అడుగులు వేస్తున్న భారత్ సహజంగానే సైబర్ నేరగాళ్లకు అనువైన ప్రాంతంగా మారింది. 2024 సంవత్సరం తొలి నాలుగు నెలల్లోనే రూ.1,750 కోట్లు సైబర్ నేరగాళ్లు దేశ ప్రజల నుంచి కొల్లగొట్టారు. జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో 7.4 లక్షల కేసులు నమోదయ్యాయి. దేశంలో పెరుగుతున్న సైబర్ నేరాలు, వాటిని అడ్డుకోవడానికి పటిష్ఠమైన సైబర్ రక్షణ వ్యవస్థ అవసరాన్ని ప్రస్తావిస్తూ 'ప్రహర్' సంస్థ ఒక నివేదిక 'ది ఇన్‌విజిబుల్ హ్యాండ్'ను ప్రచురించింది. ఆ నివేదికలో భారతదేశం సైబర్ నేరగాళ్లకు ఎంత అనువైన ప్రాంతంగా మారిందో వివరించారు. '2033 నాటికి భారత్ లక్ష కోట్ల సైబర్ దాడులను ఎదుర్కొంటుంది. 2047 నాటికి ఆ సంఖ్య 17 లక్షల కోట్లకు చేరుకుంటుంది. ఎయిమ్స్, ఎయిర్‌లైన్స్‌పై జరిగిన సైబర్ దాడులు మన దేశ బలహీన సైబర్ వ్యవస్థకు తాజా ఉదాహరణలు. 2023లో దేశం 790 లక్షల సైబర్ దాడులను ఎదుర్కొంది. 2022తో పోల్చితే ఈ సంఖ్య 15 శాతం ఎక్కువ. ఈ పెరుగుదల 2024లోనూ కొనసాగింది. మొదటి త్రైమాసికంలో 5,000 లక్షల సైబర్ దాడులు జరిగాయి. 2023, రెండవ త్రైమాసికంతో పోలిస్తే 2024లో అదే కాలంలో ఈ సంఖ్యలో 46 శాతం పెరుగుదల ఉంది. ఈ దాడులను అడ్డుకోవడానికి బలమైన సైబర్ సెక్యూరిటీ అన్ని పరిశ్రమల్లోనూ అవసరం. సైబర్ నేరగాళ్లు లక్ష్యంగా చేసుకొనే సెక్టార్లకు ఇది మరింత అవశ్యం. ప్రపంచవ్యాప్తంగా 2024 మొదటి త్రైమాసికంలో సైబర్ దాడుల్లో 76 శాతం పెరుగుదల కనిపించింది. ఈ దాడులకు బలయిన మొదటి మూడు దేశాల్లో భారత్ కూడా ఉండడం విచారకరం. ఈ నేపథ్యంలో ఐదేళ్ల జాతీయ సైబర్ రక్షణ వ్యూహాన్ని రూపొందించుకోవలసిన అవసరం ఉంది. దేశంలోని అన్ని ఐటీ మౌలిక సదుపాయాలను ఒకే గొడుగు కిందకు తీసుకురావడానికి కృషి చేయాలి. రహస్య ఎజెండాతో రూపొందించే బెట్టింగ్, గేమింగ్ యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలి' అని నివేదిక సూచించింది. 'ప్రహర్' అధ్యక్షుడు అభయ్ మిశ్రా మాట్లాడుతూ, 'సైబర్ దాడులు రెండు రకాలు. మొదటిది.. ఆర్థిక లాభం లేదా అంతరాయం సృష్టించడం కోసం వ్యవస్థలోని లొసుగులను ఉపయోగించుకొని సంప్రదాయ హ్యాకర్లు చేసే దాడి. రెండవది.. పౌరులను లక్ష్యం చేసుకొని మరింత మోసపూరితంగా వ్యవహరిస్తుంది. బెదిరించో, బలవంతం చేసో, మాయమాటలు చెప్పో జాతి వ్యతిరేక కార్యకలాపాలకు ప్రేరేపిస్తుంది' అని వివరించారు. విశ్రాంత ఐపీఎస్ ముక్తేశ్ చందర్ మాట్లాడుతూ, 'వ్యక్తిగత హ్యాకర్లు, అసంతృప్తవాదులే కాదు... రాజ్య ప్రాయోజిత నటులు, కొన్ని సందర్భాల్లో స్వయంగా రాష్ట్రాలే ఆర్థిక వ్యవస్థ మూలాలను దెబ్బతీసే విపత్కర పరిస్థితి తలెత్తింది' అని అన్నారు.



కంబోడియా కేంద్రంగా.. డిజిటల్ అరెస్ట్ దందా

న్యూఢిల్లీ, అక్టోబరు 30 : డిజిటల్ అరెస్ట్... ఇటీవల సైబర్ నేరగాళ్లు ఎంచుకున్న కొత్త తరహా మోసం. ఫోన్లు చేసి కేసులు పేరుతో భయపెట్టి డిజిటల్‌గా అరెస్టు చేస్తున్నామని హడలెత్తించి సైబర్ కేటుగాళ్లు పెద్ద మొత్తంలో డబ్బు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ తరహా మోసాలపై దేశ వ్యాప్తంగా ఇప్పటిదాకా 6,000కు పైగా కేసులు నమోదయ్యాయి. అయితే, కంబోడియా, మయన్మార్ కేంద్రంగా సైబర్ నేరగాళ్లు ఈ మోసాలకు పాల్పడుతున్నట్టు తెలిసింది. కంబోడియా, మయన్మార్‌లో మూతబడిన చైనాకు చెందిన క్యాసినోల్లో కాల్ సెంటర్లు ఏర్పాటు చేసుకుని ఈ మోసాలకు పాల్పడుతున్నారు. ఈ ముఠాలు విదేశీ ఉద్యోగం పేరిట భారత్‌కు చెందిన నిరుద్యోగులకు ఎరవేసి ఉద్యోగాల్లో చేర్చుకుని వారితో బలవంతంగా మోసాలు చేస్తున్నాయి. ఈ ముఠాల్లోని వారు పోలీసు దుస్తులు ధరించి వీడియో కాల్స్ మాట్లాడుతూ డిజిటల్ అరెస్టులంటూ అమాయకుల నుంచి అందిన కాడికి దోచుకుంటారు. పైన ఖాకీ చొక్కా, కింద సాధారణ పైజమా ధరించిన ఓ సైబర్ మోసగాడి ఫొటోను ఓ జాతీయ మీడియా చానల్ తన వెబ్‌సైట్‌లో ప్రచురించింది. కాగా, ఈ డిజిటల్ అరెస్ట్ మోసాలు రోజురోజుకి అధికమవ్వడంతో అప్రమత్తమైన కేంద్ర హోం శాఖ ఆయా కేసుల దర్యాప్తునకు ఓ ఉన్నతస్థాయి కమిటీని నియమించింది.

కార్మిక శక్తిపై
ఉష్ణోగ్రతల ప్రభావం

» పెరిగిన వేడి వల్ల పని సామర్థ్యం తగ్గుదల
» గతేడాది భారత్‌కు 12 లక్షల కోట్ల నష్టం

న్యూఢిల్లీ, అక్టోబరు 30: వాతావరణ మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు ప్రమాదకర స్థాయిలో పెరిగిపోతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు కార్మిక శక్తిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. 2023లో అధిక వేడి కారణంగా భారత్‌లో కార్మిక సామర్థ్యం బాగా తగ్గిపోయిందని, దీనివల్ల రూ.11.85 లక్షల కోట్ల ఆదాయాన్ని భారత్ నష్టపోవాల్సి వచ్చిందని 'లాన్సెట్ కౌంట్‌డౌన్ ఫర్ ఇండియా-2024' నివేదిక వెల్లడించింది. వ్యవసాయ రంగానికి అత్యధికంగా రూ.6.04 లక్షల కోట్లకుపైగా నష్టం వాటిల్లిందని పేర్కొంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో), ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంవో) సహా ప్రపంచవ్యాప్తంగా 57 విద్యాసంస్థలు, ఐక్యరాజ్య సమితి సంస్థలకు చెందిన 122 మంది నిపుణులతో రూపొందించిన వార్షిక నివేదికను లాన్సెట్ బుధవారం వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం బహిరంగ వేడి కారణంగా గతేడాది భారత్‌లోని ప్రజలు సగటున 2,400 పనిగంటలు లేదా 100 రోజుల పనిదినాలను కోల్పోయారు. ఇది 1990-1999 సగటుతో పోలిస్తే 50 శాతం అధికం. ఐక్యరాజ్యసమితి 29వ కాన్ఫరెన్స్ (సీవోపీ29)కు ముందు ప్రచురించిన ఈ నివేదిక.. వాతావరణ మార్పులు ప్రజల ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తున్నాయో దేశాల వారీగా అంచనా వేసింది. 2014-2023 మధ్య కాలంలో శిశువులు, 65 ఏళ్ల పైబడివారు ఏడాదికి సగటున 7.7 నుంచి 8.4 రోజులపాటు వడగాడ్పులకు గురవుతున్నారని ఈ నివేదిక స్పష్టం చేసింది. అలాగే 2000వ సంవత్సరం తర్వాత భారత్‌లో పునరుత్పాదక విద్యుత్‌శక్తి వినియోగం పెరిగిందని, 2022లో దేశంలోని విద్యుత్‌లో దీని వాటా 11% అని తెలిపింది. దేశంలో 71% విద్యుత్ ఇప్పటికీ బొగ్గు నుంచే వస్తోందని పేర్కొంది.

పోలీస్ స్టేషన్‌నే స్టూడియోగా వాడుకున్న లారెన్స్ బిష్ణోయ్

పోలీసులపై పంజాబ్ హరియాణా కోర్టు ఫైర్

చండీగఢ్, అక్టోబరు 30: పోలీస్ స్టేషన్‌లో సీనియర్ అధికారి కార్యాలయాన్ని ఓ టీవీ ఇంటర్వ్యూ కోసం గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ స్టూడియోగా వాడుకోవడంపై పంజాబ్ హరియాణా హైకోర్టు తీవ్ర స్థాయిలో మండిపడింది. ఈ విషయంలో పోలీసు అధికారులు, లారెన్స్ బిష్ణోయ్ మధ్య కుమ్మక్కు, కుట్రపై విచారణ జరిపేందుకు ప్రత్యేక సిట్‌ను ఏర్పాటు చేయాలని జస్టిస్ అనుపిందర్ సింగ్ గ్రేవాల్, జస్టిస్ లాపితా బెనర్జీలతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. జైల్లో ఖైదీలు సెల్‌ఫోన్లు వాడుతున్నారనే కేసులో కోర్టు విచారణ సందర్భంగా బిష్ణోయ్ ఇంటర్వ్యూ విషయాన్ని కోర్టు గుర్తించింది. సెల్‌ఫోన్లు వినియోగించుకునే అవకాశం ఇవ్వడమే కాకుండా, పోలీసు అధికారి కార్యాలయాన్నే స్టూడియోగా వాడుకునేలా అనుమతించడం వల్ల నేరాలు మరింత పెరిగే అవకాశం ఉందని కోర్టు హెచ్చరించింది. కాగా, పంజాబ్‌లోని ఖరార్‌లో ఉన్న సీఐఏ ఆఫీస్ ప్రాంగణంలో సింగర్ సిద్ధూ మూసేవాలా హత్యకేసు నిందితుడైన బిష్ణోయ్ ఓ టీవీకి ఇంటర్వ్యూ ఇచ్చినట్లు ప్రబోద్ కుమార్ నేతృత్వంలోని సిట్ తన రిపోర్టులో స్పష్టం చేసింది. అలాగే ఈ సంఘటనలో పోలీసు అధికారుల నిర్లక్ష్యాన్ని దుష్ప్రవర్తనను గుర్తించింది. ఇక్కడి వైఫైను కూడా వాడుకున్నట్లు పేర్కొంది.

కొత్త మార్గదర్శకాల ప్రకారమే.. బెదిరింపులు ఒట్టివని తేల్చారు!

» బెదిరింపులపై పలు కోణాల్లో పరిశీలన
» అత్యధికం ఒకే సోషల్ మీడియా హ్యాండిల్ నుంచి వచ్చినట్లు గుర్తింపు
» ప్రమాదం లేదని నిర్ధారణ

న్యూఢిల్లీ, అక్టోబరు 30: గత కొన్ని రోజులుగా వందలాది విమానాలకు బాంబు బెదిరింపులు వస్తున్న నేపథ్యంలో 'బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్' (బీసీఏఎస్) కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. వీటి ఆధారంగానే బాంబు బెదిరింపులను ఒట్టివేనని తేల్చి, సదరు విమానాల ప్రయాణానికి అనుమతిస్తోంది. ఫలితంగా, ప్రయాణికులు, విమానయానసంస్థలు, ఎయిర్‌పోర్టులు, భద్రతాసిబ్బంది తదితరులకు అనవసరమైన ఇబ్బందులు, శ్రమ తప్పుతున్నాయి. ఈ మార్గదర్శకాలను బీసీఏఎస్ ఈ నెల 19నే విడుదల చేసినప్పటికీ.. వాటి వివరాలు బుధవారం వెల్లడయ్యాయి. సాధారణంగా బాంబు బెదిరింపులు వచ్చినప్పుడు.. బీసీఏఎస్, సీఐఎస్ఎఫ్, స్థానిక పోలీసులు, ఎయిర్‌పోర్టు నిర్వహణ సంస్థ, విమానయాన సంస్థ సిబ్బందితో కూడిన ఓ కమిటీ (బీటీఏసీ) దానిపై నిర్ణయం తీసుకుంటుంది. కొత్త మార్గదర్శకాల ప్రకారం.. ఈ కమిటీ సదరు బెదిరింపులు నిజమైనవేనా? నకిలీవా? వాటిలో ఉన్న విశ్వసనీయత ఎంత? అన్నది పరిశీలిస్తోంది. దీంట్లో భాగంగా, బెదిరింపులు చేసిన వ్యక్తి లేదా సంస్థ నేపథ్యం ఏమిటి? ఉగ్రవాదంతోగానీ ఏదైనా నిషేధిత సంస్థతోగానీ సంబంధం ఉన్నవాళ్లా? దుండగుల పేర్లు, వివరాలు నిజమైనవేనా? మారుపేర్లు పెట్టుకున్నవారుగానీ, అజ్ఞాతవ్యక్తులుగానీ వీటిని పంపించారా? ఒకే సోషల్ మీడియా హ్యాండిల్ నుంచి పలుసార్లు బెదిరింపులు వస్తున్నాయా? వంటి పలు కోణాల్లో ఈ కమిటీ పరిశీలన జరుపుతోంది. బెదిరింపులు వచ్చిన విమానంలో ప్రయాణిస్తున్న వారిలో వీఐపీలు ఉన్నారా అన్నది కూడా పరిగణలోకి తీసుకుంటోంది. వీటి ఆధారంగానే.. వచ్చిన బాంబు బెదిరింపుల తీవ్రతను కమిటీ అంచనా వేసి విమానాన్ని దారి మళ్లించటం, జనసమ్మర్థం లేని ప్రాంతంలో దించటం, తాజాగా మళ్లీ ప్రయాణికుల లగేజీతోపాటు విమానంలో తనిఖీలు జరపటం మొదలైన చర్యలపై నిర్ణయాలు తీసుకుంటుంది. అయితే, గత కొన్ని వారాలుగా వస్తున్న బెదిరింపులన్నీ కూడా ఒట్టివేనని ఈ కొత్త మార్గదర్శకాల ప్రకారమే బీటీఏసీ నిర్ణయించిందని వైమానిక రంగానికి చెందిన ఓ సీనియర్ సెక్యూరిటీ అధికారి తెలిపారు. గతంలో బాంబు బెదిరింపులు వచ్చినప్పుడు వాటిని తీవ్రమైనవిగా పరిగణించి పలు జాగ్రత్త చర్యలు చేపట్టేవారమని పేర్కొన్నారు. ప్రస్తుత బెదిరింపుల్లో అత్యధికం ఒకే సోషల్ మీడియా హ్యాండిల్ నుంచి వస్తున్నట్లు దర్యాప్తులో తేలిందన్నారు.

సల్మాన్ ఖాన్‌కు మళ్లీ బెదిరింపు

బాలీవుడ్ హీరో సల్మాన్ ఖాన్‌కు మళ్లీ బెదిరింపు వచ్చింది. రూ. 2 కోట్లు చెల్లించకపోతే చంపుతామని గుర్తుతెలియని వ్యక్తి ముంబయి ట్రాఫిక్ పోలీసులకు మెసేజ్ పంపాడు. ముంబయి పోలీసుల ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నెంబరుకు గుర్తుతెలియని వ్యక్తి ఈ మెసేజ్ పంపాడు. దీనిపై వర్లి పోలీసులు కేసు నమోదు చేసి ఆ వ్యక్తిని గుర్తించే పనిలో పడ్డారు. సల్మాన్‌ఖాన్, ఎన్‌సీపీ లీడర్ జీషన్ సిద్దిఖీలను చంపుతామని బెదిరించిన యూపీలోని నోయిడాకు చెందిన 20 ఏళ్ల యువకుడిని ముంబయి పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. తర్వాత రెండు రోజులకు ఈ ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. అంతకుముందు లారెన్స్ బిష్ణోయ్ పేరు చెప్పి రూ.5 కోట్లు చెల్లించాలని సల్మాన్‌ఖాన్‌ను డిమాండ్ చేసిన జమ్‌షెడ్‌పూర్‌కు చెందిన ఓ వ్యక్తిని కూడా పోలీసులు అరెస్టు చేశారు.

నియోమ్‌లో రక్త చరిత్ర!

» సౌదీ అధునాతన పట్టణ నిర్మాణంలో 21 వేల మంది కార్మికుల దుర్మరణం
» మృతులలో భారతీయులు కూడా



న్యూఢిల్లీ, అక్టోబరు 30: నియోమ్. ఎర్ర సముద్రం ఉత్తర ప్రాంతంలో సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ నిర్మిస్తున్న కలల ప్రాజెక్టు. 'సౌదీ విజన్-2030' పేరుతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు 2017 నుంచి నిర్మాణంలో ఉంది. అయితే.. ఈ నిర్మాణానికి సంబంధించి అనేక విషయాలు కథలుకథలుగా ప్రపంచం ముందుకు వస్తున్నాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములు ఇచ్చిన సుమారు లక్ష మంది ప్రజల ఆచూకీ ఇప్పటికీ తెలియకపోవడం ఒక ఎత్తయితే.. తాజాగా మరో దిగ్భ్రాంతికర విషయం వెలుగు చూసింది. ఐటీవీ డాక్యుమెంటరీ ప్రకారం.. నియోమ్ నిర్మాణంలో పాలు పంచుకుంటున్న కార్మికుల్లో గత ఎనిమిదేళ్లుగా 21 వేల మంది మృతి చెందారు. సౌదీలోని అత్యంత దుర్భర వాతావరణ పరిస్థితుల్లోవారు పనిచేయడం కారణంగా మృతి చెందినట్టు డాక్యుమెంటరీ స్పష్టం చేసింది. అంతేకాదు, కార్మికుల విషయంలో మానవ హక్కులను కూడా తుంగలో తొక్కుతున్నారని తెలిపింది. కార్మికులను బానిసలుగా, అడుక్కుతినేవారిగా(బెగ్గర్స్) పరిగణిస్తున్నారన్నది డాక్యుమెంటరీ సారాంశం. మానవ హక్కుల హరణంతో పాటు రోజుకు 16 గంటలకుపైగా పనిచేయిస్తుండం, వేతనాలు చెల్లించకపోవడం వంటివి తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని డాక్యుమెంటరీ పేర్కొంది. గడిచిన ఎనిమిదేళ్ల కాలంలో నియోమ్ ప్రాజెక్టు కోసం పనిచేస్తున్న కార్మికులు, వారి కుటుంబాలకు సంబంధించిన విశేషాలతో ఐటీవీ తాజాగా డాక్యుమెంటరీని ప్రసారం చేసింది. వాస్తవానికి సౌదీ చట్టాల ప్రకారం వారానికి 60 గంటలు మాత్రమే పనిచేయాల్సి ఉన్నా.. నియోమ్ విషయంలో ఈ చట్టాలను కూడా పాటించకుండా 84 గంటలపాటు పనిచేయిస్తున్నట్టు కార్మికులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 10 నెలలుగా రూపాయి వేతనం కూడా ఇవ్వలేదని చాలా మంది కార్మికులు తెలిపారు. నియోమ్ నిర్మాణ సమయంలో మృతి చెందిన కార్మికుల్లో భారత్ సహా బంగ్లాదేశ్, నేపాల్‌కు చెందిన వారు ఉన్నారని ఐటీవీ డాక్యుమెంటరీ వెల్లడించింది. ఇక, నేపాల్ విదేశాంగ శాఖ ఈ విషయంపై ఇప్పటికే ఓ ప్రకటన చేసింది. తమ దేశానికి చెందిన 650 మందికి పైగా కార్మికులు మృతి చెందారని, దీనికి రెండింతల మంది కనిపించకుండా పోయారని పేర్కొంది.

సల్మాన్ కలల ప్రాజెక్టు

మహమ్మద్ బిన్ సల్మాన్.. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ప్రాజెక్టు టుబక్ ప్రావిన్స్‌లోని నియోమ్. సౌదీని ప్రపంచ పర్యాటక కేంద్రంగా మార్చాలన్న కుతూహలంతో ఆయన 'సౌదీ విజన్-2030' పేరుతో ఈ ప్రాజెక్టును 2017లో చేపట్టారు. సృజనాత్మకతకు పెద్దపీట వేస్తూ నిర్మిస్తున్న నియోమ్.. ప్రపంచానికే తలమానికంగా మారనుందని సౌదీ ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అయితే, ఈ నిర్మాణంలో అనుసరిస్తున్న విధానాలపై మానవ హక్కుల సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. వలస కార్మికులు దోపిడీకి గురవుతున్నారని, స్థానికులు లక్షల సంఖ్యలో కనిపించకుండా పోయారని హక్కుల సంఘాలు చెబుతున్నాయి.

ఖలిస్థానీలపై దాడుల్లో అమిత్ షా హస్తం

» కేంద్ర హోంమంత్రిపై కెనడా తాజా ఆరోపణలు

న్యూఢిల్లీ, అక్టోబరు 30: కెనడాలో ఖలిస్థానీలపై దాడుల వెనుక కేంద్ర హోంమంత్రి అమిత్ షా హస్తం ఉందని ట్రూడో ప్రభుత్వం తాజాగా ఆరోపించింది. జైలులో ఉన్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ కెనడాలో మరిన్ని కార్యకలాపాలు నిర్వహించకుండా నిరోధించాలని భారత్‌ను కోరింది. ఈ కుట్రల వెనుక అమిత్ షా పాత్ర ఉందని అమెరికాకు చెందిన ఒక వార్తాపత్రికకు తానే సమాచారం ఇచ్చినట్లు కెనడా డిప్యూటీ విదేశాంగ మంత్రి డేవిడ్ మోరిసన్ అంగీకరించారు. మంగళవారం కెనడా స్టాండింగ్ కమిటీ ముందు ఆయన విచారణకు హాజరయ్యారు. 'ఆ జర్నలిస్టు నాకు కాల్ చేసి... అది ఆయనేనా (అమిత్ షా) అని అడిగారు. ఆయనేనని నేను ధ్రువీకరించాను' అని పబ్లిక్ సేఫ్టీ అండ్ నేషనల్ సెక్యూరిటీ స్టాండింగ్ కమిటీకి మోరిసన్ వెల్లడించారు. దీనిపై అట్టావాలోని భారత హైకమిషనర్, భారత విదేశాంగ శాఖ ఇంకా స్పందించలేదు. కాగా, కెనడాలో భారత కార్యకలాపాలపై దర్యాప్తు చేస్తున్న రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీస్ (ఆర్‌సీఎంపీ) కూడా ఇప్పటి వరకూ అమిత్ షాపై బహిరంగంగా ఆరోపణలు చేయలేదు. ఇదిలా ఉండగా, భారత్‌తో దౌత్యపరమైన ఉద్రిక్తతల నేపథ్యంలో పార్లమెంట్ హిల్‌లో ఓవర్సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ ఇండియా కెనడా(ఓఎఫ్ఐసీ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న దీపావళి వేడుకలకు హాజరు కాబోనని కెనడా ప్రతిపక్ష నేత పియరీ పొయిలీవ్రే ప్రకటించడం విమర్శలకు దారితీసింది.

కెనడాలో భారత విద్యార్థులకు ఆహారం కొరత?

న్యూఢిల్లీ, అక్టోబరు 30: కెనడాలో అంతర్జాతీయ విద్యార్థులకు ఉచిత ఆహార సదుపాయాన్ని నిరాకరించాలని గ్రేటర్ వాంకోవర్ ఫుడ్ బ్యాంక్ తీసుకున్న నిర్ణయంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దేశవ్యాప్తంగా ఆహారం ధరలు, నిరుద్యోగం పెరుగుతున్న నేపథ్యంలో ఫుడ్ బ్యాంకులపై ఆధారపడేవారి సంఖ్య గణనీయంగా పెరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. ఈ నిర్ణయం భారతీయ విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపనుంది. కెనడాలో జీవన వ్యయం భారీగా పెరగడంతో అంతర్జాతీయ విద్యార్థులు ఎక్కువగా ఫుడ్ బ్యాంకులపైనే ఆధారపడుతున్నారు. ఈ ఏడాది మార్చిలో దాదాపు 20 లక్షల మందికి పైగా విద్యార్థులు ఫుడ్ బ్యాంక్‌లను ఆశ్రయించారు.

ఉద్యోగులకు దీపావళి కానుక

ఒక కరువు భత్యం విడుదల చేసిన సర్కారు.. 1.7.2022 నాటి డీఏ/డీఆర్ 3.64% మంజూరు

- 22.75% నుంచి 26.39%కు పెరిగిన డీఏ
- నవంబరు వేతనంతో కలిపి డిసెంబరు నుంచి చెల్లింపు
- 28 నెలల డీఏ బకాయిలు జీపీఎఫ్ ఖాతాల్లో జమ
- ఉద్యోగులకు పెండింగ్‌లోనే మరో నాలుగు డీఏలు



హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. దీపావళి కానుకగా.. ఒక కరువు భత్యాన్ని/కరువు సహాయాన్ని (డీఏ/డీఆర్) ప్రకటించింది. మూల వేతనం, పింఛనుపై 3.64 శాతం డీఏ/డీఆర్‌ను చెల్లించనున్నట్లు వెల్లడించింది. ప్రస్తుతం ఉద్యోగులు, పెన్షనర్లకు 22.75 శాతం డీఏ/డీఆర్ అమలవుతోంది. దీనికి 3.64 శాతాన్ని కలిపి 26.39 శాతాన్ని అమలు చేయనుంది. దీనిని నవంబరు వేతనంతో అంటే డిసెంబరు 1 నుంచి చెల్లించనుంది. 28 నెలల బకాయిలను ఉద్యోగులకు ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) ఖాతాల్లో జమ చేస్తారు. జీపీఎఫ్ ఖాతాలు లేని ఫుల్ టైమ్ కంటింజెంట్ ఉద్యోగులు; పెన్షనర్లకు 2025 జనవరి వేతనం/ పింఛను అంటే ఫిబ్రవరి 1 నుంచి 17 సమాన వాయిదాల్లో చెల్లిస్తారు. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు బుధవారం వేర్వేరుగా 120, 121 జీవోలను జారీ చేశారు. వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 1.7.2022, 1.1.2023, 1.7.2023, 1.1.2024, 1.7.2024లకు సంబంధించి ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మూడు; కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మరో రెండు డీఏలు పెండింగ్ పడ్డాయి. వీటిని ఎప్పటికప్పుడు విడుదల చేయాల్సిందిగా ఉద్యోగులు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జరిపిన చర్చల మేరకు ఒక డీఏను ఇప్పుడు విడుదల చేసింది. ఈనెల 26న జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో కూడా దీనికి ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే.


వీరికి కరువు భత్యం వర్తింపు

ప్రభుత్వ ఉద్యోగులతోపాటు 2020నాటి పీఆర్సీ ప్రకారం వేతనాలు పొందుతున్న జిల్లా, మండల పరిషత్, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, జిల్లా గ్రంథాలయ సంస్థలు, వర్క్‌చార్జ్‌డ్ సిబ్బంది అందరికీ పెరిగిన 3.64% డీఏ వర్తిస్తుంది.

- 2020 నాటి రివైజ్డ్ పే స్కేళ్లు పొందుతున్న ఎయిడెడ్ సంస్థలు, ఎయిడెడ్ పాలిటెక్నిక్‌లలోని బోధన, బోధనేతర సిబ్బందికి పెరిగిన డీఏ వర్తిస్తుంది.
- యూనివర్సిటీల్లో 2020 నాటి పే స్కేళ్లు పొందుతున్న బోధన, బోధనేతర ఉద్యోగులకు వర్తిస్తుంది.
- 2015 నాటి పీఆర్సీ ప్రకారం వేతనాలు పొందుతున్న ఉద్యోగులకు కూడా 4.716 శాతం డీఏను విడుదల చేసింది. వీరి డీఏ 59.196 శాతం నుంచి 63.912 శాతానికి పెరిగింది. ఇలాంటి ఉద్యోగులు చాలా తక్కువ శాతం ఉంటారు. వీరికి కూడా 1.7.2022 నుంచి డీఏ అమల్లోకి వస్తుంది.
- రాష్ట్రంలో 2016 నాటి కేంద్ర పీఆర్సీ ప్రకారం యూజీసీ/ఏఐసీటీఈ వేతనాలు పొందుతున్న ఉద్యోగులకు 34 శాతం నుంచి 38 శాతానికి అంటే.. 4 శాతం డీఏను పెంచింది. ఇది కూడా 1.7.2022 నుంచే అమల్లోకి వస్తుంది. యూనివర్సిటీల్లో బోధన, బోధనేతర సిబ్బంది, ప్రభుత్వ ఎయిడెడ్, అనుబంధ డిగ్రీ కాలేజీలు, మెడికల్ కాలేజీలు, పాలిటెక్నిక్ సిబ్బంది అందరికీ పెరిగిన డీఏ వర్తిస్తుంది.
- 2006 నాటి కేంద్ర పీఆర్సీ ప్రకారం యూజీసీ/ఏఐసీటీఈ వేతనాలు పొందుతున్న ఉద్యోగులకు 203 శాతం నుంచి 212 శాతానికి పెంచింది. ఇది కూడా 1.7.2022 నుంచి అమల్లోకి వస్తుంది.
- 2025 మార్చి 31లోపు లేదా అదే తేదీన రిటైర్ అయ్యే ఉద్యోగులకు డీఏ బకాయిలను 17 సమాన వాయిదాల్లో చెల్లిస్తారు.
- సీపీఎస్ ఉద్యోగులకు మాత్రం 28 నెలల బకాయిల్లో 10 శాతాన్ని వారి 'పర్మనెంట్ రిటైర్మెంట్ అకౌంట్ నెంబర్ (ప్రాన్)' ఖాతాల్లో జమ చేస్తారు. మిగతా 90 శాతం బకాయిల సొమ్మును 2025 జనవరి వేతనంతో కలిపి, ఫిబ్రవరి 1 నుంచి 17 నెలల సమాన వాయిదాల్లో చెల్లిస్తారు.
- ఈ ఉత్తర్వులు వెలువడడానికి ముందే ఏ ఉద్యోగి అయినా చనిపోతే.. వారి వారసులకు బకాయిలను ఏకమొత్తంగా ఒకేసారి చెల్లిస్తారు.
- వ్యవసాయ మార్కెట్ కమిటీలు, జీహెచ్ఎంసీ సిబ్బందికి సంబంధించిన డీఏ చెల్లింపుల మొత్తం వ్యయాన్ని ఆ కమిటీలు, జీహెచ్ఎంసీయే భరించాల్సి ఉంటుంది.

పెన్షనర్లకు డీఆర్ చెల్లింపు ఇలా..

- 1.7.2018 తర్వాత రిటైరై 2020 నాటి పీఆర్సీ వేతనాలు పొందుతున్న పెన్షనర్లకు 3.64 శాతం డీఆర్ వర్తిస్తుంది.
- 1.7.2018కు ముందు రిటైరై 2021 జూన్ 11న జారీ అయిన జీవో నంబర్ 55 ప్రకారం పెన్షన్ మొత్తం కన్సాలిడేట్ అయినవారికి కూడా డీఆర్ వర్తిస్తుంది.
- 2015 నాటి పీఆర్సీ ప్రకారం పెన్షన్లు పొందుతున్న పింఛనర్లకు డీఆర్ 59.196 శాతం నుంచి 63.912 శాతానికి అంటే.. 4.716 పెరిగింది. యూజీసీ/ఏఐసీటీఈ ప్రకారం పెన్షన్లు పొందుతున్న వారికి 34 నుంచి 38 శాతానికి డీఆర్ పెరిగింది.
- మున్సిపాలిటీలు, పంచాయతీరాజ్ సంస్థలు, ఎయిడెడ్ విద్యా సంస్థల్లో బోధన, బోధనేతర రిటైర్డ్ సిబ్బందికి పెరిగిన 3.64 శాతం డీఆర్ వర్తిస్తుంది.



అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

తొర్రూరు రూరల్, అక్టోబరు 30: అప్పుల బాధ తాళలేక ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం పోలేపల్లిలో బుధవారం జరిగింది. పందుల వెంకటేశ్వర్లు (50) వ్యవసాయానికి చేసిన అప్పులు రూ.9.6 లక్షలకు పెరిగిపోవడంతో మనోవేదనకు గురై మంగళవారం రాత్రి పురుగుమందు తాగాడు. ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు.

పిడుగుపాటుకు ఇద్దరి మృతి

- రాష్ట్రంలో అక్కడక్కడ వానలు
- తడిసిన ధాన్యం, పత్తి బస్తాలు
- నల్లగొండ జిల్లా కట్టంగూరులో 10.5 సెం.మీ.


నల్లగొండలోని ఓ ధాన్యం కొనుగోలు కేంద్రంలో వరదలో కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఎత్తిపోస్తున్న రైతు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): రాష్ట్రంలో అక్కడక్కడ ఆకస్మిక వానలు పడ్డాయి. పిడుగుపాటుకు ఇద్దరు మృతి చెందారు. పలుచోట్ల కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం, పత్తి తడిసిపోయింది. కొన్నిచోట్ల ఆయా పంటలకు కూడా నష్టం వాటిల్లింది. బుధవారం ఉమ్మడి కరీంనగర్, మెదక్, ఖమ్మం, నల్లగొండ, వికారాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ వానలు కురిశాయి. మెదక్ జిల్లా టేక్మాల్ మండలం దున్నర గ్రామంలో గొర్రెలను మేపేందుకు వెళ్లిన కాపరులు బండారు బేతయ్య (41), డాకూరి భరత్ (17) పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందారు. నల్లగొండ జిల్లాలో రాత్రి భారీ వర్షం పడింది. వరదలకు నల్లగొండలోని పలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొట్టుకుపోయింది. ఆ జిల్లాలోని కట్టంగూరులో 10.5 సెంటీమీటర్లు, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో 5.2 సెం.మీ. ఖమ్మం జిల్లాలో పెనుబల్లిలో 5 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లోని సుమారు 2 వేల వరకు పత్తి బస్తాలు తడిసిపోయాయి. కరీంనగర్ జిల్లా గంగాధర, పెద్దపల్లి జిల్లా రామగుండం, పాలకుర్తి మండలాల్లో కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసింది. ఆసిఫాబాద్ జిల్లా దహెగాం, పెంచికలపేట, చింతలమానేపల్లి మండలాల్లో పొట్ట దశలో ఉన్న వరి నేలకొరగ్గా.. పత్తి పంట తడిసి ముద్దయింది. వికారాబాద్‌లో సాయంత్రం గంటన్నర పాటు ఏకధాటిగా కురిసిన వాన అలజడి సృష్టించింది. రహదారులన్నీ జలమయమవ్వగా.. డ్రైనేజీలు పొంగిపొర్లాయి. ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

20 లక్షలు ఇవ్వు!

(మొదటి పేజీ తరువాయి)

చేయడంతోపాటు మీ ఇద్దరు పిల్లలను అనాథలను చేస్తానని నిందితుడు ఆ కాల్‌లో బెదిరించాడు. దీంతో ఎమ్మెల్యే సెప్టెంబరు 29న కొత్తపల్లి పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసులు భారతీయ న్యాయ సంహిత 308, 351(3), (4) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. సైబర్ టెక్నాలజీ ఆధారంగా ఆ బెదిరింపు కాల్ విదేశాల నుంచి వచ్చినట్లు నిర్ధారణకు వచ్చారు. పోలీసుల విచారణలో నిందితుడు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్‌లోని భవానీనగర్‌కు చెందిన యాస అఖిలేష్‌రెడ్డి(33)గా గుర్తించారు. నిందితుడు ప్రస్తుతం లండన్‌లో ఉన్నాడని, అక్కడి నుంచే వాట్సాప్ కాల్ ద్వారా బెదిరింపులకు పాల్పడినట్లు నిర్ధారణ అయింది. దీంతో అతనిపై బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ ద్వారా లుక్ అవుట్ సర్క్యులర్ జారీ చేసినట్లు ఏసీపీ వెంకటరమణ ఓ ప్రకటనలో తెలిపారు. ఆ ఫోన్ నంబర్ ద్వారా జరిపిన ఆర్థిక లావాదేవీలను పరిశీలించామన్నారు.

పేదలకు అన్యాయం జరిగితే ఊరుకోం

నందనవనం ఆక్రమణల తొలగింపునకు పొంగులేటి ఆదేశం

హైదరాబాద్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు అన్యాయం జరుగుతుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ పరిధిలో ఉన్న నందనవనంలో ప్రభుత్వం నిర్మించిన ఇళ్లను ఆక్రమించుకుని నివాసం ఉంటున్న వారిని తక్షణమే ఖాళీ చేయించి, అర్హులైన వారికి అందించాలని అధికారులను ఆదేశించారు. మహేశ్వరం నియోజకవర్గంలోని మంకాల్, ఎల్బీనగర్ నియోజకవర్గంలోని నందనవనంలో ఇళ్ల సమస్యపై బుధవారం సచివాలయంలో మంత్రి సమీక్ష చేశారు.

గిరిజన విద్యార్థినికి మంత్రి కోమటిరెడ్డి చేయూత


- ఎంబీబీఎస్ పూర్తయ్యే వరకు ఆర్థిక సాయానికి హామీ

కౌడిపల్లి, హైదరాబాద్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 30: ఎంబీబీఎస్ సీటు సాధించినా ఆర్థిక ఇబ్బందులతో చదువు కొనసాగించలేకపోతున్న ఓ గిరిజన విద్యార్థినికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేయూతనందించారు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం సలాబత్‌పూర్ భద్యతండాకు చెందిన కాట్రోత్ శివరాం, గంసీలకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు. రెండో కూతురు కాట్రోత్ సుమలత సిద్దిపేటలోని ఓ ప్రైవేటు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. కానీ డబ్బులేక కూలీ పనులకు వెళ్తోంది. ఈ విషయం సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో మంత్రి కోమటిరెడ్డి స్పందించారు. బుధవారం సుమలత కుటుంబసభ్యులకు ఫోన్ చేసి మంత్రి కార్యాలయానికి పిలిపించి ఆమెకు రూ. 2 లక్షల ఆర్థిక సహాయం చేశారు. తండ్రి శివరాంతో కలిసి కోమటిరెడ్డి ఇంటికి వచ్చిన సుమలతకు ఏ ఇబ్బంది ఉన్నా తాను అండగా ఉంటానని మంత్రి భరోసా ఇచ్చారు. వైద్య విద్య పూర్తి అయ్యే వరకు తనదే బాధ్యత అని మంత్రి తెలిపారు. వెంటనే కళాశాల యాజమాన్యంతోనూ మాట్లాడారు. మంత్రి ఆదరణచూసిన విద్యార్థిని తండ్రి భావోద్వేగానికి గురయ్యారు.

నా పంచాయితీ అంతా సీఎం రేవంత్‌తోనే!

- మీ ప్రజాప్రతినిధులతో డ్రగ్స్ టెస్ట్‌కు రండి
- ముఖ్యమంత్రికి కౌశిక్ రెడ్డి సవాల్
- సీఎం కాలిగోటికి కూడా కౌశిక్ రెడ్డి సరిపోడు: బల్మూరి

హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌కు సంబంధించి కాంగ్రెస్-బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. రాష్ట్రంలో కక్షపూరిత రాజకీయాలకు తెరతీశారని.. తనను డ్రగ్స్‌కేసులో ఇరికించేందుకు ప్రయత్నించిన సీఎం రేవంత్‌రెడ్డితోనే తనకు పంచాయితీ అని, కాంగ్రెస్ నేతలతోకాదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తాము డబ్బా పట్టుకొని సిద్ధంగా ఉన్నామని.. తనపార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో కలిసి డ్రగ్స్ టెస్ట్‌కు రావాలని సీఎంకు సవాల్ విసిరారు. కౌశిక్‌రెడ్డిని తాము ట్రాప్ చేయలేదని ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రెస్‌మీట్ పెట్టి చెప్పాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్‌నేత దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ వీధిరౌడీ కన్నా.. అధ్వాన్నంగా రేవంత్‌రెడ్డి భాష ఉందని, దావుద్ ఇబ్రహీం తరహాలో మాట్లాడుతున్న ఆయన గురించి కాంగ్రెస్ నాయకులు ఆలోచించి గడ్డి పెట్టాలన్నారు. హైడ్రా, మూసీ సుందరీకరణ, జీవో 46, జీఓ29, తెలంగాణ స్పెషల్ పోలిసింగ్ ఇలా అన్నింట్లోనూ సీఎంది నెగిటివ్ మైండ్‌సెట్ అని ఆరోపించారు.. రేవంత్‌ది ప్రజాపాలన కాదు.. మూర్ఖపు హిట్లర్ పాలన అని విమర్శించారు. కాగా తాము అపోలో ఆస్పత్రిలో డ్రగ్స్ టెస్ట్ కోసం శాంపిల్స్ ఇచ్చామని.. బీఆర్ఎస్ నేతలు కూడా వచ్చి పరీక్షల తాలూకు నివేదికలను ప్రజల ముందు పెట్టాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ పేర్కొన్నారు. కేటీఆర్ దగ్గరి మిత్రులు డ్రగ్స్ తీసుకున్నారని, ఫలితంగా కేటీఆర్ కూడా తీసుకొని ఉంటారనే అనుమానం కలుగుతోందని, ఆయన టెస్టులు చేయించుకోవాలన్నారు. బుధవారం గాంధీ భవన్‌లో బల్మూరి వెంకట్ మాట్లాడారు. సీఎం కాలిగోటికి కూడా కౌశిక్ రెడ్డి సరిపోరని.. నోటిని అదుపులో పెట్టుకోకుంటే ఆయన్ను బయట తిరగనివ్వబోమని హెచ్చరించారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మన బంగారం మంచిదే...

ధనత్రయోదశి నాడు వందటన్నులకుపైగా బంగారం మనదేశంలోకి అడుగుపెట్టిందట. మనలో చాలామందికి బంగారం అంటే సాక్షాత్తూ లక్ష్మీదేవే. వెలుగులీనే దీపావళికి బంగారు వన్నెలద్దాలని రిజర్వ్‌బ్యాంక్ కూడా అనుకొని ఉంటుంది. లండన్‌లోని 'బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్'నుంచి ఈ బంగారం రప్పించి, మనదేశంలో సురక్షితమైన నిల్వకేంద్రాల్లో రిజర్వుబ్యాంక్ భద్రపరిచింది. బంగారంతో వెలకట్టలేనంత అనుబంధం ఉన్న సమాజంలో, బంగారానికి సంబంధించిన ఏ వార్త అయినా, మిగతారోజులకంటే ఈ ధనత్రయోదశి, దీపావళి సందర్భాల్లో మరింత మెరిసిపోతుంది. బంగారంలాంటి వార్తలతో, ప్రత్యేక కథనాలతో దంతేరాస్‌కు బాగా ముందునుంచే మీడియా మనలను ముంచెత్తుతోంది. తులం బంగారానికి సైతం సామాన్యుడు తూగలేని పరిస్థితులున్నా, దీపావళి తారాజువ్వల్లాగా నిముషానికోరేటుతో అది అందనంత ఎత్తుకు ఎగిరిపోతున్నా, అందివస్తుందన్న ఆశ, అందుకోవాలన్న తపన ఎన్నటికీ ఉంటాయి.

ఇప్పుడు రిజర్వ్‌బ్యాంక్ దగ్గర 855టన్నుల బంగారం నిల్వలున్నాయని, అందులో ఓ ఐదువందల టన్నులు ఇక్కడ, మిగతాది ఇంకా లండన్‌లోని రెండు బ్యాంకుల్లోనూ ఉన్నాయని విన్నప్పుడు చాలామందికి 1990లనాటి పరిస్థితి గుర్తుకువస్తున్నది. ఆ రోజులు తలుచుకుంటే కాస్తంత బాధగా ఉంటుంది కానీ, ఆ కష్టాలన్నీ అధిగమించి ఇప్పుడు ఇంత బంగారాన్ని పోగేసుకున్నందుకు గర్వంగా కూడా ఉంటుంది. రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడే అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థనుంచి అప్పుతెచ్చి దేశాన్ని ఆర్థికసమస్యలనుంచి కాపాడాలని ఆర్థిక నిపుణులు సలహాచెప్పారు. ఆయన సరే అన్నప్పటికీ, విధాన నిర్ణయంలో జాప్యం జరిగిందని, ఇంతలో ఎన్నికలు రావడంతో ఆయన వెనుకడుగువేశారని అంటారు. ఆ తరువాత ప్రధానిగా వచ్చిన వీపీ సింగ్ 'ఖజానా ఖాళీ' అని ప్రకటించారు కానీ, ఏడాదిన్నరలోనే దిగిపోవాల్సివచ్చింది. చంద్రశేఖర్ ఏలుబడిలో ప్రధానమంత్రికి ఆర్థికసలహాదారుగా ఉన్న మన్మోహన్ సింగ్, ఆర్థిక మంత్రి యశ్వంత్ సిన్హా చొరవచూపడంతో ఐదుబిలియన్ డాలర్ల స్వల్పకాలిక రుణం తీర్చడానికి తొలిసారిగా స్మగ్లర్లనుంచి స్వాధీనం చేసుకున్న కొద్దిపాటి బంగారాన్ని స్విట్జర్లాండ్ బ్యాంక్‌లో తాకట్టుపెట్టి, అప్పు ఎగవేతదారుడిగా చెడ్డపేరు రాకుండా ప్రభుత్వం ప్రయత్నించింది. కానీ, ఆర్థికసంక్షోభం తీవ్రమై, అతి తక్కువ విదేశీమారక నిల్వలతో, నెలరోజులు కూడా దేశాన్ని నడపలేని ఆ గడ్డు పరిస్థితులనుంచి బయటపడటానికి ఆ తరువాత రిజర్వ్‌బ్యాంక్ దగ్గరున్న బంగారాన్ని రహస్యంగా దేశం దాటించి రెండు విదేశీబ్యాంకుల్లో తనఖాపెట్టిన సందర్భం ఎన్నటికీ మరిచిపోలేనిది. మనదేశంలో వ్యవసాయ, వ్యాపార కుటుంబాలవారికి బంగారం ఓ అలంకరణగా, హోదాగా కంటే ఆపదలో తమను ఆదుకొనే ఓ ఆపన్నహస్తం. కరగని, తరగని ఆస్తి. ఆర్థికంగా బాగున్నప్పుడు కూడబెట్టుకోవడానికీ, అవసరమైనప్పుడు తాకట్టుపెట్టుకొని, కష్టాల కడలిని ధైర్యంగా ఈది ఆవలి ఒడ్డుకు చేరడానికి సహకరించే ఓ శక్తి. ఆభరణాలను ఇలా వాడుకోవడం మనకు కొత్తేమీ కాదు కానీ, ప్రభుత్వం బంగారాన్ని తనఖాపెట్టడం మాత్రం మనకు అప్పట్లో చాలా అవమానంగా తోచింది. ఆ తరువాత అమెరికా యుద్ధ విమానాలకు చమురుపోసి, అంతర్జాతీయ ద్రవ్యనిధినుంచి భారీగా రుణం పొంది, కష్టాలనుంచి గట్టెక్కిన విషయం తెలిసిందే. ఆ అప్పుతో పాటుగా వచ్చిన ఆంక్షలకు అనుగుణంగా, దేశ ఆర్థికాన్ని పీవీ–మన్మోహన్ ద్వయం సంస్కరణలబాట పట్టించడం, ఒకప్పుడు బంగారాన్ని తనఖాపెట్టిన దేశం ఇప్పుడు అంతర్జాతీయ విపణిలో దానిని భారీగా కొనుగోలుచేయగలస్థాయికి చేరుకోవడం ఒక గొప్ప పరిణామం.

ప్రాంతీయ ఉద్రిక్తతలు, యుద్ధాలు హెచ్చుస్థాయిలో ఉన్నకాలం కనుక, డాలర్ బలహీనపడినా, కరెన్సీ విలువలు కాస్తంత కదిలినా బంగారాన్ని మించిన భద్రత మరేమీ ఉండదు. అది దేశమైనా, కుటుంబమైనా కల్లోలాలనుంచి కాపాడేశక్తి ఆ లోహానికే ఉంది. కాకపోతే ఇటీవలికాలంలో ఆభరణాలమీద ప్రేమ తగ్గిందని, దానిని ఇతరత్రారూపాల్లో కొనిదాచుకోవడం మాత్రం అలాగే ఉందని వార్తలు వింటున్నాం. ప్రపంచంలో అత్యధికబంగారం భారతీయుల దగ్గరే ఉందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ ఎప్పటినుంచో అంటోంది. ఎవరేమనుకున్నప్పటికీ, ప్రాచీనకాలంనుంచి మన దేహాన్ని, సాహిత్యాన్ని, భాషని, ఆలోచనలని మెరిపించి, మురిపిస్తున్న మన బంగారం మంచిదే.

సుస్థిర ప్రణాళికతోనే హైదరాబాద్‌కు విశ్వహోదా!

ఒకప్పుడు నగరాలను జనాభాపరంగా లేదా విస్తీర్ణం పరంగా పెద్ద నగరాలుగా చెప్పేవారు. ఇప్పుడు ఈ రెండు కొలమానాలకు పెద్దగా ప్రాముఖ్యం లేకుండా పోయింది. గత యాభై ఏళ్లుగా రకరకాల కొత్త కొలమానాలు ప్రాచుర్యంలోకి వచ్చాయి. వాటిని బట్టి ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లోని నగరాలకు ఏటా వివిధ ర్యాంకులు ఇస్తుంటారు. పచ్చదనం, పార్కులు, మైదానాలు, పునరుత్పాదక ఇంధన వనరులు, సుస్థిరదాయక రవాణా, ప్రజా రవాణా, గ్రీన్ బిల్డింగ్స్, వృత్తాకార ఆర్థిక వ్యవస్థ, సోషల్ ప్లానింగ్, బాధ్యతాయుత వినియోగం, వ్యర్థాల నిర్వహణ, నీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, వరద నీటి నిర్వహణ వ్యవస్థ, వాన నీటి సంరక్షణ, సంస్కృతి – వారసత్వ పరిరక్షణ, జలాశయాల సంరక్షణ, కాలుష్య నివారణ, సుస్థిరదాయకత లాంటి అంశాలు ఈ ర్యాంకులలో కీలకపాత్ర వహిస్తాయి.

ప్రతీ నగరానికి మాస్టర్ ప్లాన్ అవసరం. మాస్టర్ ప్లాన్ ప్రకారమే ల్యాండ్ యూజ్ ఉండాలి. రెసిడెన్షియల్, కమర్షియల్, ఇనిస్టిట్యూషన్స్, కన్జర్వేషన్... ఇలా వివిధ అంశాలను పరిగణిస్తారు. అంతే కాదు, కనీసం 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుంటారు. ప్లానింగ్‌లో సమగ్రత ఉంటుంది. రీజనల్ మాస్టర్ ప్లాన్ రూపొందించిన తరువాతనే నగరం ప్లానింగ్ చేయాలి. అయితే చాలా సందర్భాల్లో అందుకు భిన్నంగా జరుగుతుంటుంది. హైదరాబాద్ విషయంలోనూ అదే జరిగింది. రీజనల్ స్టడీ చేయకుండానే 1981లో హైదరాబాద్ మాస్టర్ ప్లాన్ తయారు చేశారు. సాధారణంగా మాస్టర్ ప్లాన్‌ను పదేళ్లకోసారి రివైజ్ చేయాలి. రహదారుల వెడల్పు లాంటి అంశాల్లో వచ్చిన మార్పులను పరిగణనలోకి తీసుకోవాలి. ఏం ప్లాన్ చేశామో, ఏం సాధించామో చూసుకోవాలి. అలాంటిదేమీ జరగలేదు. 1981 నుంచి ఒకదాని తరువాత ఒకటిగా ఎన్నో మాస్టర్ ప్లాన్స్ వచ్చాయి. HUDA (హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ), BPA (బుద్ధ పూర్ణిమ అథారిటీ), QQSUDA (ఖులీ ఖుతుబ్ షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ), CDA (సైబరాబాద్ డెవలప్‌మెంట్ అథారిటీ), HADA (హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ).... ఇలా ఒక్కోదానికి ఒక్కో మాస్టర్ ప్లాన్ వచ్చింది. ఇవి గాకుండా GHMC, HMDA, ORR Growth Corridorలకి వేరే మాస్టర్ ప్లాన్, తయారు చేసింది. MCH, కంటోన్మెంట్ తీరు మరో రకం. ఇలా హైదరాబాద్ నగరానికి ఎనిమిది మాస్టర్ ప్లాన్స్ వచ్చాయి. అవి కాకుండా అవుటర్ రింగ్ రోడ్ కారిడార్‌కు వేరే మాస్టర్ ప్లాన్. వీటిని ఒక దానికి మరో దానితో సంబంధం లేకుండా తయారు చేశారు. దాంతో మొత్తం నగర మాస్టర్ ప్లాన్‌లో సమగ్రత లోపించినట్లయింది. నగరానికి ఒక డిజైన్ అంటూ లేకుండా పోయింది. సైబరాబాద్‌లో డ్రైనేజీ వ్యవస్థ కూడా లేకుండా అభివృద్ధి జరిగింది. వరద నీటి కాల్వలు కూడా లేవు. హైదరాబాద్‌కు చేరువలో రాబోయే ఫోర్త్ సిటీ విషయంలో ఇలాంటి తప్పిదాలు జరగకుండా చూసుకోవాలి.



ఆసియా, ఆఫ్రికా నగరాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. స్మార్ట్ సిటీస్‌కు సంబంధించి పాలన, శక్తి– పర్యావరణం, ఐటీ – కమ్యూనికేషన్స్, మొబిలిటీ, సొసైటీ– ఎడ్యుకేషన్ అనే అంశాల ఆధారంగా ఇచ్చిన ర్యాంకింగ్స్‌లో జర్మన్ నగరాలే ప్రథమ, ద్వితీయ స్థానంలో ఉన్నాయి. మరో జాబితాలో టోక్యో, సింగపూర్, సిడ్నీ, కేప్‌టౌన్, వియన్నా మొదటి ఐదు స్థానాల్లో నిలిచాయి. ఇలాంటి జాబితాలు ఏవైనా సరే వాటిలో భారతీయ నగరాలు ఉండితీరాలి. మరీ ముఖ్యంగా మన హైదరాబాద్ నగరానికి అందులో స్థానం దక్కాలి.

అసఫ్ జాహీల కాలంలో ప్రపంచంలోని అత్యుత్తమ నగరాల్లో ఒకటిగా పేరొందిన హైదరాబాద్, ఆ తరువాతి కాలంలో తాత్కాలిక చర్యలతోనే ముందుకు సాగింది. సరైన డిజైన్ అంటూ లేకుండా పోయింది. మాస్టర్ ప్లాన్ ఉన్నా అమలులో కానరాకుండా పోయింది. ఏదైతే జరగకూడదో అదే జరిగింది. ప్రభుత్వాలు మారినప్పుడల్లా విధానాలు మారాయి. నిజానికి ప్రభుత్వాలు మారినా అవే ప్రాజెక్టులను, పథకాలను కొనసాగించాల్సి ఉంటుంది. నగరాల్లో ఉండే సహజవనరులను చక్కగా వినియోగించుకోవాలి. ఓపెన్ స్పేస్‌లు అధికంగా నెలకొల్పాలి. ప్రజలకు రిక్రియేషన్ ఏరియాలు ఉండాలి. నగరాలు అభివృద్ధి చెందాలంటే.. చుట్టుపక్కల గ్రామాలూ అభివృద్ధి చెందాలి. పట్నంలో పల్లె కనిపించాలి. పల్లెలో పట్నం కనిపించాలి. పట్నమైనా, పల్లె అయినా ప్రకృతితో మమేకమవ్వాలి.

అంతే కాదు, నగరాలు అభివృద్ధి చెందడంలోనూ కొన్ని పరిమితులు ఉండాలి. వలసలను నిరుత్సాహపరచాలి. వాటిని అడ్డుకునేందుకు కౌంటర్ మాగ్నెట్స్‌ను అభివృద్ధి చేయాలి. ఒక పరిమితి అంటూ లేకుండా నిరవధిక వలసలు భారీగా కొనసాగితే నగరాల్లోని మౌలిక వసతులపై భారం అధికమవుతుంది. నగరాలు మురికికూపాలుగా మారుతాయి. నరకానికి నకళ్లుగా మారుతాయి. నేడు దేశంలోని ఎన్నో నగరాలు ఇదే దుస్థితిలో ఉన్నాయి. అలాంటి దుస్థితి హైదరాబాద్‌కు రాకుండా జాగ్రత్త పడాలి. ట్రాఫిక్ నాణ్యతకు సంబంధించిన ర్యాంకింగ్స్‌లో భారతీయ నగరాలు బాగా ఇరుకైన నగరాలుగా ర్యాంకింగ్స్ పొందాయి. బెంగళూరు, ముంబై, ఢిల్లీ, హైదరాబాద్, పుణె ఇరుకైన నగరాలుగా పేరొందాయి.

ఎకనామిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఈఐయూ) తన గ్లోబల్ లివబిలిటీ ఇండెక్స్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా 173 నగరాల జాబితా రూపొందించింది. ఈ విధమైన మదింపు వేసేందుకు వివిధ విభాగాల్లో 30 సూచికలను పరిగణనలోకి తీసుకుంది. సుస్థిరత్వం, ఆరోగ్య సంరక్షణ, సంస్కృతి, పర్యావరణం, విద్య, మౌలిక వసతులు లాంటివి వీటిలో ఉన్నాయి. ఈ జాబితాలో వియన్నా (ఆస్ట్రియా), కోపెన్ హేగన్ (డెన్మార్క్), జ్యూరిచ్ (స్విట్జర్లాండ్), మెల్‌బోర్న్ (ఆస్ట్రేలియా), కాల్గరీ (కెనడా), జెనీవా (స్విట్జర్లాండ్), సిడ్నీ (ఆస్ట్రేలియా), వాంకోవర్ (కెనడా), ఒసాకా (జపాన్), అకులాండ్ (న్యూజీలాండ్) ఉన్నాయి. ఇక ఈ జాబితాలో కింది పది స్థానాల్లో ఉన్న నగరాలను చూస్తే.... వరుసగా... డమాస్కస్ (సిరియా), ట్రిపోలి (లిబియా), అల్జీర్స్ (అల్జీరియా), లాగోస్ (నైజీరియా), కరాచీ (పాకిస్థాన్), ఢాకా (బంగ్లాదేశ్), హరారే (జింబాబ్వే) ఉన్నాయి.

ఇటీవల ఒక సంస్థ జరిపిన అధ్యయనంలో 2033 నాటికి ప్రపంచంలో వేగంగా వృద్ధిచెందే పది నగరాలలో బెంగళూరు మొదటి స్థానంలో నిలిచింది. మూడో స్థానంలో ఢిల్లీ నిలిచింది. హైదరాబాద్‌కు నాలుగో స్థానం దక్కింది. ముంబై ఐదో స్థానం పొందింది. ఆసియా, ఆఫ్రికా దేశాల నగరాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. కాకపోతే.. వాటి అభివృద్ధి తీరులో ఒక క్రమం ఉన్నదా లేదా అనే అంశమే ముఖ్యమైంది.

స్మార్ట్ సిటీస్‌కు సంబంధించిన మరో జాబితాలో 88.3 పాయింట్లతో మ్యూనిచ్ మొదటి స్థానంలో నిలిచింది. హంబర్గ్ 86.2 పాయింట్లతో రెండో స్థానం పొందింది. పాలన, శక్తి– పర్యావరణం, ఐటీ – కమ్యూనికేషన్స్, మొబిలిటీ, సొసైటీ– ఎడ్యుకేషన్ అనే అంశాల ఆధారంగా ఈ ర్యాంకింగ్స్‌ను ప్రకటించారు. మరో జాబితాలో టోక్యో, సింగపూర్, సిడ్నీ, కేప్‌టౌన్, వియన్నా మొదటి ఐదు స్థానాల్లో నిలిచాయి. అందమైన నగరాల జాబితాలో పారిస్, న్యూయార్క్ సిటీ, లండన్, వెనిస్ వంటివి ఉన్నాయి. ఇలాంటి జాబితాలు ఏవైనా సరే... వాటిలో భారతీయ నగరాలు ఉండాలని, అందుకు అనుగుణంగా ఆయా నగరాలు అభివృద్ధి చెందాలని మరీ ముఖ్యంగా హైదరాబాద్ నగరానికి అందులో స్థానం దక్కాలని కోరుకుందాం.

■ వేదకుమార్ మణికొండ
ఇంజనీర్, అర్బన్ & రీజనల్ ప్లానర్, హైదరాబాద్

(నేడు వరల్డ్ సిటీస్ డే)

అంధకార ప్రపంచంలో 'అప్పో దీపో భవ'!



అసత్యం నుంచి సత్యంలోకి, చీకటి నుంచి వెలుగులోకి మృత్యువు నుంచి అమృతత్వంలోకి నడిపించమని వేదకవి కోరుతున్నాడు. బృహదారణ్యక ఉపనిషత్తులోని ఈ సందేశంలోని 'తమసోమా జ్యోతిర్గమయ' అన్న పంక్తి ఆంధ్రజ్యోతికి తొలినాటి నుంచి కరదీపికగా ఉంది. ఎరుకను మించిన వెలుగు లేదు. చీకటిని వెలిగించడంలో అక్షరానికి మించిన జ్యోతి లేదు. ఈ అక్షర కాంతి నిరంతరంగా 'ఆంధ్రజ్యోతి' పాఠకులపై వర్షిస్తూనే ఉండాలి!.

పద్నాలుగేళ్లు అరణ్యవాసం చేసిన రాముడు, సీతాలక్ష్మణులతో తిరిగి వస్తున్నాడంటే అయోధ్య ప్రజలు తమ ఆనందాన్నంతా ప్రమిదల్లోకి ఒంపి దీపాలు వెలిగించారట. అయోధ్య దేదీప్యమానమైందట. వియోగం ఎప్పుడూ చీకటే. కలయిక ఎప్పుడూ వేడుకే.

రాముడి కథకూ, చారిత్రక బుద్ధుడి కథకూ ఎందుకో ఎన్నో పోలికలు! కుటుంబాన్ని, రాజ్యాన్ని, దేశాన్ని వదిలి సత్యాన్వేషణకై వెళ్లిన సిద్ధార్థ గౌతముడు, మానవ దుఃఖాలకు కారణాలను, నివారణలను తెలుసుకుని బుద్ధుడయ్యాక, తల్లిదండ్రులు, పుట్టిన నేల పిలిచిందని సందర్శనకు వస్తుంటే, కళ్లల్లో వత్తులు వేసుకుని చూస్తున్న కపిలవస్తు, వీధులన్నిటిలోనూ వెలుతురు ముగ్గులేసి స్వాగతించిందట! ఆ శాక్యప్రజలకు తెలుసు బుద్ధుడు ఉండిపోవడానికి రావడం లేదు, రాజ్యం ఏలడానికీ రావడం లేదు, తన మీద బెంగనే కాదు, బెంగలన్నిటినీ తీర్చడానికి వస్తున్నాడు!

ఆశ్వయుజ, కార్తీకమాసాలలో వచ్చే పండుగలకు అనేక కథనాలున్నాయి. రావణవధ జరిగింది దసరా అంటారు. కురుక్షేత్ర యుద్ధంలో పాండవులకు విజయం లభించిన సందర్భం అంటారు. అశోకుడు బౌద్ధంలోకి పరివర్తన చెందిన రోజు విజయదశమి అంటారు. పెద్దలను స్మరించుకోవడం, పూలపండుగ చేసుకోవడం, జమ్మి ఆకులు పంచుకోవడం, ఉపవాసనిష్ఠలు, వన భోజనాలు, అనేక సందర్భాలతో ఈ రెండు నెలల కాలం కిక్కిరిసిపోతుంది.

పండగల వెనుక ఉన్న కథలేమైనా, ఈ రెండు మాసాల శరదృతువు, ఎంతో ఆహ్లాదకరమైన కాలం. "శారదరాత్రులుజ్జ్వల లసత్తర తారక హారపంక్తుల"తో అలంకృతమయ్యాయని నన్నయ రాశాడు. వెదజల్లిన కర్పూరపు పుప్పొడిలాగా ఉంటుందట వెన్నెల. వర్ష రుతువు ముగిసి, జలాశయాలు నిండి, పూలవెల్లువతో నేల నేల అంతా ఉప్పొంగిపోతుంది. మబ్బులు లేని ఆకాశాలు, మెరిసే నక్షత్రాలు, కాటుకపొగల కృష్ణపక్షాలు, తుళ్లింతల తేరు మీద రాత్రింబవళ్లు సవారీ చేస్తాయి. మనకు అమావాస్యతో నెలముగుస్తుంది కదా, నేటి దీపావళి తరువాత కార్తీకం కదా? దేశంలో చాలా మందికి, ముఖ్యం ఉత్తరాదికి, పున్నమి నుంచి పున్నమికి నెల. వాళ్లకు కార్తీకం ఇప్పటికే మొదలై పక్షం గడిచింది! కాలపు లెక్కలకేమి గానీ, ఈ రెండు మాసాల మీద కమ్మినదొక జన, వన జాతరల జమిలి రుతువు!

పర్వదినం అంటే, ఒకే సంతోషం అందరి కళ్లలోనూ వెలగడం కదా! లోకకంటకుడు ఎవరో హతుడయ్యాడని, ఎంతో జననష్టం జరిగే యుద్ధంలో విజయం దక్కిందని పండగ చేసుకోవడంలో ఏదో అసౌకర్యం ఉన్నది. శాంతి, కరుణలు నిండిన ఉల్లాసంలో ఉత్సాహంలో కదా సంబరమున్నది! చెడు మీద మంచి విజయంగా ఆ పురాణకథలను చూడాలి అంటారు. ఆ విజయం హింస ద్వారానో, శిక్షించడం ద్వారా, బలవంతంగా నిర్మూలించడం ద్వారానో జరిగినప్పుడు, అక్కడ ఏదో అపజయం కూడా స్ఫురించడం లేదా? మూలకారణాన్ని కాక, వ్యక్తీకరణను మాత్రమే తొలగించే పని ఎవరు చేసినా అది అసంపూర్ణమే. అటువంటప్పుడే, ధర్మసంస్థాపనకు పదే పదే సంభవామి తప్పదని హామీలు పూచీలు ఇచ్చుకో వలసి వస్తుంది. ఒక్క దుష్ట శిక్షణ కూడా చేయకుండానే గౌతమబుద్ధుడు కొత్త ధర్మాన్ని స్థాపించాడే, అనేక ఆదర్శాలను వ్యాపింపజేశాడే? అది ఎట్లా సాధ్యపడింది?

కానీ, ఏది ధర్మం? ఏది మంచి? ఏది చెడుగు? ఓ మహాత్మా ఓ మహర్షీ? ఎవరు ఎవరికి కంటకుడో ఏమో? యుద్ధంలో ఏ పక్షానిది న్యాయమో ఎవరు తేల్చాలి? రాసిన పురాణాలైనా, చరిత్రలైనా విజేతల కథనాలే కదా! ఐదు దశాబ్దాల కిందట శ్రీకాకుళం ఆదివాసులకు అత్యంత ఆప్తులైన ఉద్యమకారులను పోలీసులు కాల్చిచంపినప్పుడు, ఒక పత్రిక 'నరకాసుర వధ' అన్నపేరుతో సంపాదకీయం రాసింది. భూమిపుత్రుడు కదా నరకుడు, ఏ ప్రయోజనాల యుద్ధంలో అతను దేనికి చని పోయాడో? ఆగ్రహాలను, ప్రతీకారాలను కాక, లోలోపల ప్రేమదీపాలను వెలిగించగల రోజులే హర్షరుతువులై, జీవనోత్సవాలైతే ఎంత బాగుండును! పండుగలు కేవలం భక్ష్యభోజ్యాలకు, పూజాతతంగాలకు పరిమితం కాక, ఆయా సందర్భాలలో దాగిన విలువలను తరచి చూడగలిగితే ఎంత సార్థకంగా ఉండును? లేదా, మనిషి తను కాలక్రమంలో సమకూర్చుకుని, దృఢపరచుకున్న కొత్త ఆశయాలకు, లక్ష్యాలకు, నీతికి అనుగుణమైన కొత్త పండుగలను కనిపెడితే, కరకుదనమూ రోషకషాయిత రౌద్రమూ కాక, మానవ ఆదిమ అమాయకత్వాన్ని పులుముకున్న దైవరూపాలనూ ఆవిష్కరిస్తే, వేడుకలు ఎంత దయగా ఉండేవి?

ద్వేషంతో ఎవరినైనా, దేన్నైనా గెలవాలని ప్రయత్నించినప్పుడల్లా, ద్వేషమే గెలుస్తుంది. అట్లాగే, ద్వేషాన్ని ద్వేషంతో ఎప్పుడూ తొలగించలేము. న్యాయమైన ఆగ్రహాన్ని, పదిమంది మీద ప్రేమతో పుట్టే ప్రతి ఘటనను కూడా బలప్రయోగంతో అణగార్చలేరు. వ్యక్తి స్వార్థమో, వర్గ, జాతి స్వార్థాలో, ఆక్రమణలో అపహరణలో కొందరిని ఆధిక్యంలోకి అనేకులను అధీనతలోకి నెట్టవచ్చు. దుర్మదంతో ఒకరు దౌర్జన్యం చేయవచ్చు. మరొకరు బక్కకోపం చూపవచ్చు. పరస్పరత కలిగిన సోదరత్వం మిగిలితే, మనుషులకీ తామసాలే అక్కరలేదు! గౌరవప్రదమైన మనుగడ కోసం, కాళ్ల కింద చారెడు నేల కోసం మనిషి పడే తపన, అందుకు అడ్డుపడే అత్యాశలు, వీటి మధ్యే అరిషడ్వర్గాలు! పోరాటాలు యుద్ధాలు సంగ్రామాలు! అప్పుడప్పుడు ఎవరో ఒకరు, ఏదో ఒక సమూహం సంచారిణీ దీపశిఖల్లాగా, లోకం మీదకు లిప్తకాలపు వెలుగులు విసిరి వెళ్లిపోతారు! సృష్టిలో చీకటి సర్వవ్యాపితం, గాఢం, అనంతం అని, వెలుగు మాత్రం స్వల్పం, స్థానికం అంటాడు కార్ల్ సాగన్! ..."లోన జ్వలియించుచున్న మహానలమునకొక విస్ఫులింగమె కాద యీ యుత్సవాగ్ని" అంటూ దీపావళిని అంతర్ బహిర్ యుద్ధారావం చేశారు కవి వేదుల.

మనిషి భయాలన్నీ చీకటితోటల్లోనే సంచరిస్తుంటాయి. చీకటంటే భయమున్నవారే చావుకు భయపడతారని స్టీఫెన్ హాకింగ్ అన్న మాట మరింత భయపెడుతుంది. దేవుడనేవాడు పోతన ఊహించినట్టు పెంజీకటికి ఆవల ఉంటాడేమో, మన అపరిచితత్వపు భయాలను పారదోలడానికి ఏదో ఒక శక్తి లేకపోతే ఎట్లా? ఈ మహా సృష్టిలో, అన్ని జీవులకంటె అధికులమనుకునే మనుషులకే దేవుడు! తక్కిన అన్ని చరాచరాలూ అటానమస్! అబద్ధం, అజ్ఞానం, అధికారం, ఆధిక్యం, అహంకారం... చీకటికి ఎన్నో పర్యాయపదాలు, అర్థం మాత్రం ఒకటే! కార్తీకరాత్రులు దీపాలంకరణకు బాగుంటాయి కానీ, కాలంలోను, స్థలంలోను, మానవహృదయంలోను ప్రమిదలు చీల్చలేని కటికచీకటి రాత్రులు పరచుకుని ఉన్నాయి. పసిపాపల నిదురకనులపై క్షిపణులు, స్ఫటికాకాశాల నిండా ఘాటెక్కిన గంధక ధూమాలు, అడవిసిరుల కోసం కడుపు కోతలు, రుతువులన్నీ చెరిగిపోయే విషవాయు విన్యాసాలు, బుసకొట్టే గోడలు, మృత్యుక్రీడలు... మానవ నిశీథిని నిండా నీలి నీడలు! తానే దీపం కావడం సరే, కనీసం తాను మనిషి కాగలడా? కాగలదా? తానే చీకటి కాకుండా కాపాడుకోగలడా? వెలుగులను ప్రేమించడం వడ్డించిన విస్తరి లాంటి విలాసం కాకుండా కాపాడుకుంటుందా? చీకటి వీక్షణలను గుప్పించి, చీకటినే నిశ్వసించి, వెలుతురు పొరలకు తూట్లు పొడవకుండా ఉండగలదా?



■ కె. శ్రీనివాస్

సందర్భం

"అప్పో దీపో భవ" అన్నాడు తథాగతుడు. తనతోనే తనను అంటిపెట్టుకుని గడిపిన ఆనందుడికి మరణశయ్య మీద ఇచ్చిన సందేశం అది. అదే ఆయన చివరిమాట కూడా.

హృదయాలను కొలిమిలను చేసుకుని, ముస్తాబు చేసుకోవాలి. ఎవరో జ్ఞాని నడచివస్తాడని కాదు. కరిమబ్బు లేని కార్తీక ఆకాశం లాగా మనసును నిర్మలం చేసుకుని మనలోకి మనమే నడిచి రావడం కోసం. శాంతి పూసే వేళన ఆ మాత్రం దీపాలంకరణ చేసుకోవాలి!


నీకు నువ్వే దీపం! 'జ్ఞాన సంబుద్ధికి వేరే మార్గం లేదు, పరాధీనత కుదరదు. నీలోపలి దీపాన్ని నువ్వే కనుగొనాలి!' ఈ మాటలకు కోటానుకోట్ల పుటల వ్యాఖ్యానాలు వచ్చాయి. మనిషి చేతన మీద అపారమైన భారం మోపుతున్నట్టు కనిపించే ఈ సందేశం, మనుషుల మధ్య అత్యంత సహజ కరుణను పునరుద్ధరించడం... అనాయాసపు, అవలీల లక్ష్యం కాదని గుర్తు చేస్తుంది. కోట్ల కాగడాలు వెలిగించినా చెదిరిపోనంత చీకటి లోకాన ఉన్నదంటాడు గుడిపాటి వెంకట చలం.

హృదయాలను కొలిమిలను చేసుకుని, ముస్తాబు చేసుకోవాలి. ఎవరో జ్ఞాని నడచివస్తాడని కాదు. కరిమబ్బు లేని కార్తీక ఆకాశం లాగా మనసును నిర్మలం చేసుకుని మనలోకి మనమే నడిచి రావడం కోసం. శాంతి పూసే వేళన ఆ మాత్రం దీపాలంకరణ చేసుకోవాలి!

అసత్యం నుంచి సత్యంలోకి, చీకటి నుంచి వెలుగులోకి మృత్యువు నుంచి అమృతత్వంలోకి నడిపించమని వేదకవి కోరుతున్నాడు. బృహదారణ్యక ఉపనిషత్తులోని ఈ సందేశంలోని 'తమసోమా జ్యోతిర్గమయ' అన్న పంక్తి ఆంధ్రజ్యోతికి తొలినాటి నుంచి కరదీపికగా ఉంది. ఎరుకను మించిన వెలుగు లేదు. చీకటిని వెలిగించడంలో అక్షరానికి మించిన జ్యోతి లేదు. ఈ అక్షర కాంతి నిరంతరంగా "ఆంధ్రజ్యోతి" పాఠకులపై వర్షిస్తూనే ఉండాలి!

బారక్‌పూర్‌లో రగిలిన స్వాతంత్ర్యాగ్ని

ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామానికి ముందే అంటే 1824 లోనే మన దేశంలో సిపాయిల తిరుగుబాటుకు బీజం పడింది. బ్రిటిష్ అధికారులకు వ్యతిరేకంగా భారతీయ సైనికులు చేసిన తిరుగుబాటు ఇది. ఈస్టిండియా కంపెనీ సైన్యం మొదటి ఆంగ్లో బర్మా యుద్ధంలో పోరాడుతున్నప్పుడు ఇది జరిగింది. ఈ తిరుగుబాటులో 180 మంది సిపాయిలు వీరమరణం పొందారు. 12 మందిని బ్రిటిష్ అధికారులు ఉరి తీశారు. ఆంగ్లేయులకు ఎదురు తిరిగి అసువులు బాసిన వారి త్యాగం నిరుపమానమైనది. రెండు శతాబ్దాల తర్వాత కూడ నాటి వీరులను స్మరించుకొని అంజలి ఘటించాల్సి ఉంది. వారి రుణం మనం తీర్చుకోలేనిది.



మొదటి ఆంగ్లో–బర్మా యుద్ధ సమయంలో 1824 అక్టోబరులో బర్మా భూభాగంలోకి ప్రవేశించడం కోసం బెంగాల్ స్థానిక పదాతిదళానికి చెందిన మూడు రెజిమెంట్ల సైనికులను 800 కి.మీ. దూరం కవాతు చేయాలని బ్రిటిష్ అధికారులు ఆదేశించారు. ఈ రెజిమెంట్లు అప్పటికే దాదాపు 1600 కి.మీ. కవాతు చేసుకొంటూ మధుర నుండి కోల్‌కత సమీపంలోని మిలటరీ కంటోన్మెంట్ అయిన బారక్‌పూర్ వరకు వచ్చాయి. అక్కడి నుండి తిరిగి మరల చిట్టగాంగ్ వరకు కవాతు చేయాలని ఆదేశించడంతో సిపాయిలు ఎదురు తిరిగారు. (పైగా ఈ రెజిమెంట్లలో ఎక్కువగా హిందూ సైనికులు ఉన్నారు.) సముద్ర ప్రయాణం పట్ల కూడ వారికి అభ్యంతరాలు ఉన్నాయి. అప్పటికే అలసిపోయిన సైనికులు, బళ్ళు కూడ లేకపోవడం వల్ల తమ సామానును తామే మోసుకొని తిరిగి బయలుదేరడానికి నిరాకరించారు. వీరి అభ్యంతరాలను పట్టించుకోకుండా కంపెనీ వారు తమ సంచులను వీపు మీద మోసుకెళ్ళాలని ఆదేశించడంతో వారిలో అసహనం పెరిగిపోయింది.

1824 నవంబర్ 1న కవాతు మొదలు పెట్టాలని అధికారులు ఆదేశించారు. తమకు బళ్ళను సమకూర్చాలని లేదా రెట్టింపు బత్తా చెల్లించాలని సిపాయిలు డిమాండ్ చేశారు. దానికి నిరాకరించిన బ్రిటిష్ అధికారి ఎడ్వర్డ్ పాగెట్ సైనికులు తమ ఆయుధాలను వదిలేయాలని కోరారు. అందుకు సైనికులు ఒప్పుకోకపోవడంతో ఆయన యూరోపియన్ దళాలకు చెందిన రెజిమెంట్లను, ఫిరంగులను రప్పించాడు. నవంబరు 2వ తేదీన వెనుక నుండి తిరుగుబాటుదారులపై కాల్పులకు తెగబడ్డారు. ఆంగ్లేయ అధికారులు ఆకస్మికంగా జరిపిన కాల్పులలో సిపాయిలు, పౌరులు... మొత్తం 180 మంది అసువులు బాసారు. తదనంతర పరిణామాలలో తిరుగుబాటు నాయకులైన అనేకమందిని ఉరి తీశారు. ఈ విధంగా ఈస్టిండియా కంపెనీ ప్రభుత్వం దమన నీతిని ప్రదర్శించింది.

బింది తివారీ నాయకత్వంలో జరిగిన ఈ 'బారక్‌పూర్ తిరుగుబాటు' చరిత్రాత్మకమయినది. నవంబర్ 9న బింది తివారీని అరెస్ట్ చేసి, మరుసటి రోజు ఉరితీసి ఆయన శరీరాన్ని బహిరంగంగా గొలుసులతో వేలాడదీశారు. ఈ విషయం బయటికి పొక్కకుండా మీడియాలో వార్తలు రాకుండ వలసప్రభుత్వం జాగ్రత్తలు తీసుకొంది. కానీ ఇది జరిగిన 6 నెలల తర్వాత లండన్‌లోని 'ఓరియంటల్ హెరాల్డ్' ఒక కథనం ప్రచురించి, బ్రిటిష్ అధికారుల దమననీతిని తీవ్రంగా ఖండించింది. బింది తివారీ భారతీయ సైనికులకు ఒక ఆరాధ్య దైవం అయ్యాడు. ఆరు నెలల తర్వాత ఆయన్ను, ఉరితీసిన ప్రాంతంలో సైనికులు, స్థానికులు కలిసి ఒక ఆలయాన్ని నిర్మించారు. అది 'బిందిబాబా దేవాలయం'గా ప్రసిద్ధి పొందింది.

ఈ బారక్‌పూర్ తిరుగుబాటు జరిగిన 33 సంవత్సరాల తర్వాత 1857 మార్చి 29న ఇదే బారక్‌పూర్ కంటోన్మెంట్‌లో సిపాయి మంగళ్‌పాండే నాయకత్వంలో మరో తిరుగుబాటు మొదలైంది. అదే ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామంగా ఖ్యాతికెక్కింది. 1857లో బ్రిటిష్ అధికారులను భారతీయ సిపాయిలు హతమార్చడానికి బారక్‌పూర్ తిరుగుబాటే వారికి ప్రేరణ ఇచ్చింది.

• డా. పి.సి.సాయిబాబు

(నవంబరు 2: బారక్‌పూర్ తిరుగుబాటుకు రెండు శతాబ్దాలు)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com

'స్వర్ణకాంతులు – దివ్యదీపాలు!'

'స్వర్ణభారత' మంటప ద్వారాలకు చక్కగా –
జాతీయతా దీపాల తోరణాలు కట్టండి!
హరితకాంతులొలుకు సౌభాగ్య దీపాలను –
ఇంటింటా – పసిడిగుమ్మాలపై తీర్చండి!

ఆసేతుహిమాచలం దివ్యంగా ప్రజల –
గుండెల్లో వెలిగే దీపాలు – సమతామమతగీతాలు!
దేశమాత ముంగిట ధీరంగా వెలిగే దీపాలు –
భారత వీరజవానుని శౌర్యవిజయ ధ్వజాలు

పంట పొలాల్లో తలలూపే – సస్యశ్యామల దీపాలు –
అన్నదాతల – కష్టజీవుల – స్వర్ణశుభోదయరేఖలు
పల్లెపల్లెల్లో తళతళలాడే – సంస్కృతీదీపాలు –
ఆత్మీయడా – సౌహార్ద్రతా క్షీరతరంగాలు

యువజనుల హృదయాల్లో వెలిగేదీపాలు –
భావిభారత భాగ్యోదయ విజయాశీస్సులు
పసిడి బాలల లేతమనస్సుల్లో వెలిగే దీపాలు –
పూలతోటలో తిరుగాడే – బాలబాపూజీలు

స్వాతంత్ర్యవజ్రభారతి – ముంగిట వెలిగే దీపాలు –
సువర్ణ సుప్రభాత – జనగణమన విజయకిరణాలు
దేవాలయ ప్రాంగణాల్లో వెలిగే – సువర్ణ దీపాలు –
"సర్వేజనాః సుఖినోభవంతి" – అనే దివ్యాశీస్సుమాలు

– కళ్యాణశ్రీ



వెలుగులు విరజిమ్ముతూ...

నిజమే
లక్ష్మీబాంబులా
పేలుతుందనుకున్నపుడల్లా
తుస్సుమంటూ ఆరిపోతుంది

సీమటపాకాయల్లా
చిటపటలాడుతూ గొలుసుకట్టుగా
పేలుతుందనుకున్నపుడు
తుస్సు తుస్సుమంటూ
టప్ టప్ మంటూ
చిట్లిపోయి మధ్యలోనే తెగిపోతుంది

మతాబులా వెలగాలనో
పెన్సిల్లా మెరవాలనో
తలపోసినపుడల్లా
వెలిగినట్టే వెలిగి
ఆరిపోయిన కాకరపువ్వొత్తిలా
పడివుండటమూ సర్వసాధారణమే
అస్తిత్వం భూచక్రంలా
తన చుట్టూ తాను తిరిగి తిరిగి
ఉన్నచోటే ఆరిపోయి ఆగిపోవటమూ
మామూలే

బతికుండే క్షణాలన్నీ
పాంబిళ్లలా బుసకొట్టి బుసకొట్టి
బూడిదవటమూ తప్పని పరిస్థితే

సమస్యలు చిచ్చుబుడ్లయి
చిరచిరలాడినా
జీవించే క్షణాలతోనే
లోపలి ముఖాల్ని వెలిగించుకోవాలి

జీవితమెప్పుడూ
లక్ష్మీబాంబులానే పేలదు
చాలాసార్లు
తుస్సు తుస్సుమంటూనే
ఆరిపోవచ్చు



అయినా
తారాజువ్వలా
వెలుగులు విరజిమ్ముతూ
చీకటి నింగికెగరాల్సిందే
అనేక అమావాస్యల తరువాత
ఒక దీపావళి తప్పక వస్తుందని
నమ్మి తీరాల్సిందే

– చిత్తలూరి

నిత్యదీపావళి

సీ. శాంతికి నెలవౌచు సర్వంసహాస్థలి
అలరారుచుండు గదా మతాబు
ఉప్పరమంటెడు ఊహలకిరవౌచు
తనియుచుండును గదా తారజువ్వ
అల్లరిపిల్లలకద్దంబు తానౌచు
తనరారుచుండు గదా సిసింద్రి
గమ్యము చేరని కాంక్షలకుద్దియై
చిందులాడును గదా చిచ్చుబుడ్డి
గీ. వెలయు కాకరపువ్వులు వెన్నముద్ద
ప్రిదిలి ప్రేలుటపాసులు ముదమొసంగు
నట్టి భూచక్రములు వీథులందునిండ
యందు దీపావళిని కనువిందుచేయు
గీ. చెడునశించి ధర్మము విలసిల్లుకతన
వసుధ దీపావళినిలిచె పర్వముగను
జాగృతికిది మూలంబగు జాతికెపుడు
కాలమేదైన ధర్మంబు కాచు కడకు
గీ. హృదయమొకటి ప్రమిదకాగ ఎలమి ఆశ
యమ్ము వత్తికాగ ధృతి తైలమ్ము కాగ
లక్ష్యమాపైని దీపమై రమ్యకాంతి
తోడ రాజిల్లు జీవనోద్యోగమందు
గీ. అబల ఆ–సత్యభామయి అలరుచుండ
పురుషుడా కృష్ణుడై పెనుపొందుచుండ
నరకులుందురే? ధరయెల్ల నాకమగును
సత్య నిత్యదీపావళి సందడించు

– మంకు శ్రీను

ఇరులబాధల పోద్రోలి..

సీ. దీపకాంత వెల్గు దేదీప్యమానమై
చీకట్ల వెతలను చెరిగివేయ!
వరలక్ష్మి వ్రతదీక్ష వరమిచ్చెనోయిన
సతిపతిసఖ్యత్ సందడింప!
నరకంపు భయదంపు నరకుడు వెడలగా
జననాడి దెబ్బెడి శబ్దతతులు!
వడగళ్ళు–వరదల్లు వ్యథలెన్నొ సల్పినా
ధీజనధీరతొ తేజసదులు!

తే. నేటి దీపావళీదెచ్చెనిట్టిసిరులు
తెలుగుసీమకు కొంగ్రొత్త భాగ్యమీయ
ఇరులబాధల పోద్రోలి తరగనట్టి
సౌఖ్యవెలుగులు నింపగనాఖ్యపఠితి!

– మోదుకూరు రాధాకృష్ణశర్మ

రాకెట్లమంటల సాక్షిగా

నీ అపజయాల/ జ్ఞాపకతీరాల నిశీధిని
అలుపెరగని నీ ప్రయత్నాల
క్రాకర్స్ వెలుగులో మాయం చెయ్..!
అంతరిక్ష హద్దులను చెరిపేస్తూ
దీపావళి రాకెట్లమంటల సాక్షిగా
నీ కలలకు జ్ఞాన శిఖరంపై ప్రాణం పోయ్..!
నిరాశ, నిస్పృహల శూన్యాన్ని
లక్ష్మి బాంబుల ధ్వని వర్షంతో తడిపేసేయ్..!
చిచ్చుబుడ్ల కిరణాలతో అంతులేని
మానవత్వపు ఆనందాన్ని అందరికీ పంచెయ్..!
ఈ పండుగ దినం నుండైనా..
పర్యావరణ పరిరక్షణపై అడుగువేయ్..!
చెట్లే సంరక్షణే మానవజాతి చరిత్రకు
సాక్ష్యమనే పాఠాన్ని అమలుచేయ్..!!

– ఫిజిక్స్ అరుణ్ కుమార్

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA
గురువారం 31 అక్టోబరు 2024

హనుమకొండ డీఎంహెచ్‌వోగా అప్పయ్య

వరంగల్ డీఎంహెచ్‌వోగా సాంబశివరావు

వరంగల్ మెడికల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారుల అయోమయానికి డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఎట్టకేలకు తెరదించింది. వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ సాంబశివరావును, హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ అప్పయ్యను నియమిస్తూ ప్రజారోగ్య కుటుంబ సంక్షేమశాఖ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు. రెండు నెలల కాలం నుంచి వరంగల్, హనుమకొండ జిల్లాల ఆరోగ్యశాఖలో అయోమయం నెలకొంది. తాజా ఉత్తర్వులతో స్పష్టత వచ్చింది. ఇంతకాలం వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా పనిచేసిన డాక్టర్ వెంకటరమణ కరీంనగర్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిగా కొనసాగనున్నారు.


డాక్టర్ అప్పయ్య


సాంబశివరావు

ధాన్యం కొనుగోలుకు రైస్‌మిల్లర్లు సహకరించాలి

నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

7

జనావాసాల్లో బాణసంచా దుకాణాలు

వరంగల్ పాతబీటు బజార్‌లో విచ్చలవిడిగా అమ్మకాలు

భారీఎత్తున టపాసుల నిల్వలు.. పట్టించుకోని పోలీసులు

వివరాలు 8లో..

సంక్షేమ పథకాల అమలు

కాంగ్రెస్‌కే సాధ్యం

ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు

వివరాలు 7లో..

కళ్లు చెదిరేలా..

(Iవ పేజీ తరువాయి)

ధ్యాన, సమాధి వీటిని అనుసరిస్తే మనలోని బద్ధకాన్ని త్యజిస్తే లోకకల్యాణం సిద్ధిస్తుందన్నారు. అనంతరం మేయర్ గుండు సుధారాణి రిమోట్‌తో నరకాసుర వధను ప్రారంభించారు.అంతకు ముందు వేడుకల్లో భాగంగా సాయంత్రం 6 గంటలకు శ్రీ కృష్ణ సత్యభామ వేషధారణ లో కళాకారులను ఉరేగింపుగా వేదికకు తీసుకొచ్చారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. వేలాదిగా తరలివచ్చిన ప్రజలతో ఉర్సు గుట్ట మైదానం కిక్కిరిసిపోయింది. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. నరకాసుర వధ ఘట్టం, ప్రత్యేక బాణసంచా వెలుగులు ప్రజలను విపరీతంగా ఆకట్టుకున్నాయి. వేడుకల నిర్వహణకు సహకరించిన దాతలను ముఖ్య అతిథులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లం పద్మ, నరకాసుర వధ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి


ఉర్సు గుట్ట మైదానంలో జరిగిన ఉత్సవాలకు హాజరైన ప్రజలు



చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

మెట్టుగుట్టపై ఘనంగా రుద్రహోమం


మెట్టుగుటపై రుద్రహోమం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

మడికొండ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మాస శివరాత్రి సందర్భంగా మడికొండలోని మెట్టుగుట్టపై గల మెట్టురామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవా రం స్వామి వారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులు పంచామృతాలతో అభిషేకం జరిపి సీతారామచంద్రస్వామి వారికి ప్రత్యేక అర్చ నలు చేశారు. అనంతరం యాగశాలలో రుద్రహో మం నిర్వహించారు. దేవస్థాన ఈవో శేషుభారతి, చైర్మ న్ పైడిపాల రఘుచందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజలలో అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపెల్లి సత్యనారాయణశర్మ, ధర్మకర్తలు బైరి రాజు, వస్కుల ఉమ, దండిగం శ్రీనివాస్, రొడ్డ దయాకర్, బోగి కేదారి, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలుకు రైస్ మిల్లర్లు సహకరించాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో హనుమకొండ జిల్లాలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలుకు రైస్‌మిల్లర్లు సహకరించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య కోరారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, డీఆర్‌డీఏ అధికారులతో పాటు రైస్‌మిల్లర్లతో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై బుధవారం కలెక్టర్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జీవో 27 ప్రకారం 10శాతం బ్యాంకు గ్యారంటీ, లేదంటే సెక్యూరిటీ డిపాజిట్‌ను సమర్పిస్తే ధాన్యాన్ని కేటాయిస్తామన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఒక్కో రైస్‌మిల్లుకు ఒక్కో వ్యవసాయ విస్తరణ అధికారిని నియమిస్తామన్నారు. వారం లోపు బ్యాంకు లేదా సెక్యూరిటీ డిపాజిట్‌ను రైస్‌మిల్లర్లు సమర్పించాలన్నారు. సన్న, దొడ్డు రకం ధాన్యాల లోడ్‌లను వేరువేరుగా రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఏవైనా సమస్యలు ఎదురైతే 24గంటల్లోగా అధికారులు పరిష్కరించాలన్నారు. నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు ప్రక్రియను చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈసమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీఓ నాగపద్మజ, జిల్లా మార్కెటింగ్ అధికారులు, సివిల్‌సప్లయ్ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

బీసీ కమిషన్ బృందం పర్యటనకు ఏర్పాట్లు చేయాలి

నవంబర్ 2వ తేదీన బీసీ కమిషన్ బృందం జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు సిద్ధం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టరేట్‌లోని ఎన్‌ఐసీ హాల్‌లో బుధవారం ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మీ హాజరవుతున్నారన్నారు. స్థానిక సంస్థల రిజర్వేషన్ల ధామాషాపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం నవంబర్ 2న హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌కు బీసీ కమిషన్ వస్తుందని తెలిపారు. ఇందకు ఉమ్మడి జిల్లాకు సంబంధించిన అధికారులు సమన్వయంతో సమావేశం సాగేందుకు కృషి చేయాలన్నారు. ఉమ్మడి జిల్లా నుండి ప్రజాప్రతినిధులు, అన్ని కుల సంఘాల ప్రతినిధులు రానున్నారని, అందుకు కలెక్టరేట్‌లో ఏర్పాట్లు సిద్ధం చేయాలన్నారు. దరఖాస్తుల స్వీకరణ అనంతరం సాయంత్రం బీసీ కమిషన్ బృందం ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ డీడీ జి.రాంరెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేసినప్పుడే గుర్తింపు

డీఎంహెచ్‌వో లలితాదేవి

హసన్‌పర్తి, అక్టోబర్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సేవలు అందించనప్పుడే సమాజంలో ఉద్యోగులకు మంచి గుర్తింపు ఉంటుందని డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి అన్నారు. మండలంలోని ఎర్రగట్టుగుట్ట విశ్వక్‌సేనా సేవా సమితి కల్యాణ మండపంలో బుధవారం అసిస్టెంట్ పారామెడికల్ ఆఫీసర్ రౌతు బుచ్చినర్సయ్య ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో మదన్ మోహన్, హసన్‌పర్తి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహేంద్ర, సైక్రియాట్రిస్ట్ ప్రహదిత్, ఫార్మసిస్టు అజిత, సూపర్‌వైజర్ రూతమ్మ, లచ్చులు, హెల్త్ అసిస్టెంట్ కందుకూరి సంతోష్, నగేష్, లచ్చులు, ఇంద్రారెడ్డి, రేనుక, డీబీఎఫ్ రాష్ట్ర నాయకులు రౌతు రమేష్‌కుమార్, పారామెడికల్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ లలితాదేవి

హక్కుల కోసం పోరాటం

కాజీపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రైల్వే కార్మికుల హక్కుల కోసం పోరాడేది రైల్వే మజ్దూర్ యూనియన్ మాత్రమేనని, రాబోయే ఎన్నికల్లో కార్మికులంతా మజ్దూర్ యూనియన్ గెలుపు కోసం కృషి చేయాలని ఆ సంఘం డివిజనల్ సెక్రటరీ పిల్లలమర్రి రవీందర్ అన్నారు. కాజీపేట ఎలక్ట్రికల్ షెడ్‌లో బ్రాంచ్ సెక్రటరీ నాయిని సదానందం అధ్వర్యంలో బుధవారం రైల్వే కార్మికులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమావేశంలో పిల్లల మర్రి రవీందర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డిసెంబర్ 4,5,6 తేదీల్లో రైల్వే గుర్తింపు సంఘాల ఎన్నికల్లో రైల్వే కార్మికులంతా మజ్దూర్‌ను బలపర్చాలన్నారు. 8వ పే కమిషన్, ఓపీఎస్ సాధన, డీఏలు, రిస్క్ అలవెన్స్‌లు, ప్రమాదంలో మృతి చెందిన కార్మికులకు ఎక్స్‌గ్రేషియా, లాంటివి సాధించాలంటే మజ్దూర్‌కే సాధ్యమన్నారు. సీసీఎస్ డైరెక్టర్ డా. డి. శ్రీనివాస్ యాదవ్, బ్రాంచ్ చైర్మన్ ఇబ్రహీం, ఆఫీస్ బేరర్స్, రైల్వే కార్మికులు పాల్గొన్నారు.

సర్వేపై ఎన్యుమరేటర్లకు శిక్షణ


హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) మార్గదర్శకాలపై జిల్లాలోని అన్ని మండలాల్లో ఎన్యుమరేటర్లకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాల ప్రకారం గ్రామాల్లో ఈసర్వే చేపట్టడంపై ఎన్యుమరేటర్లకు సంబంధిత అధికారులు వివరించారు. జిల్లాలో నిర్వహించే సర్వేలో 1,917 మంది ఎన్యుమరేటర్లు, 257 మంది సర్వేయర్లు పాల్గొననున్నారని అధికారులు తెలిపారు. జిల్లాలో సుమారుగా 3లక్షల కుటుంబాలు ఉన్నాయని వారు తెలియజేశారు.

వీడియో జర్నలిస్టు రాజ్‌కుమార్‌కు అంతిమ వీడ్కోలు

వడ్డెపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణంతో మంగళవారం హైదరాబాద్‌లోని ఒకప్రైవేటు ఆస్పత్రిలో తుది శ్వాస విడిచిన హనుమకొండ రాయపుర ప్రాంతానికి చెందిన వీడియో జర్నలిస్టు కాగితోజు రాజ్‌కుమార్ అంత్యక్రియలు బుధవారం సాయంత్రం నిర్వహించారు. అంతకు ముందు హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌కు ఆయన భౌతిక కాయం తీసుకురాగా పాత్రికేయులు, వీడియో జర్నలిస్టులు కడసారి సందర్శించి ఆయన చేసిన సేవలను స్మరిస్తూ ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన భౌతిక కాయాన్ని కుటుంబసభ్యులు, పాత్రికేయులు వెంట రాగా హనుమకొం డలోని పద్మాక్షి శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.


రాజ్‌కుమార్ భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న జర్నలిస్టులు






సంక్షేమ పథకాల అమలు కాంగ్రెస్‌కే సాధ్యం

ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు

వడ్డెపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల అమలు కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమని వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్, కేఆర్.నాగరాజు అన్నారు. బుధవారం హనుమకొండ వడ్డెపల్లి చర్చి జంక్షన్‌లో రూ. 6.80 కోట్లతో వడ్డెపల్లి చర్చి జంక్షన్ నుంచి ఉనికిచర్ల రోడ్డు వరకు ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌తోపాటు బీటీ రోడ్డు, లోలెవల్ బ్రిడ్జి అభివృద్ధి పనులను వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 56వ డివిజన్ కార్పొరేటర్ సిరంగి సునీల్ కుమార్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కొంగ హరిబాబు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు చింత రమేశ్‌గౌడ్, టి.సుధాకర్, ఎండి.ఆరీఫ్, పూర్ణచందర్, గడ్డం శివరాం, మండల సమ్మయ్య మోహన్, అనిత తదితరులు పాల్గొన్నారు.






ఘనంగా జాతీయ సమైక్యతా దినోత్సవం


ర్యాలీగా వెళుతున్న కళాశాల ఎన్సీసీ క్యాడెట్స్

న్యూశాయంపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ములు గురోడ్‌లోని ఎల్బీ కళాశాలలో ఎన్సీసీ 10వ బెటాలియన్ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్రీయ ఏక్తా దివాస్(జాతీయ సమైకృత దినోత్సవం) ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్‌రావు తెలిపారు. ఉక్కు మనిషి సర్దార్ వల్లబాయ్ పటేల్ జన్మది నోత్సవం పురస్కరించుకుని గురువారం ఎన్సీసీ కాడెట్స్ కవాతు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అనంతరం ఎన్సీసీ క్యాడెట్స్ ఎల్బీ కళాశాల నుంచి ములు గురోడ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సి పాల్ డాక్టర్ కె.రాజేం దర్‌రెడ్డి, ఎన్సీసీ ఆఫీసర్ కెప్టెన్ సదానందం, అధ్యాపకులు, ఎన్సీసీ క్యాడెట్స్ తెలిపారు.



రామస్వామి అంతిమయాత్రలో ప్రజా సంఘాల నేతలు

మడికొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కాజీపేట మండలం తరాలపల్లికి చెందిన మావోయిస్టు నేతలు ముప్పిడి సాంబయ్య, నాగేశ్వర్‌రావుల తండ్రి రామస్వామి మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. బుధవారం జరిగిన ఆయన అంత్యక్రియల్లో మాజీ మావోయిస్టు నేత, ప్రస్తుత పీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, ప్రజా సంఘాల నేతలు భారతక్క, శాంతక్క, విరసం నేత రవన్న, కాజీపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సారంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, రిటైర్డ్ సీఐ కె. ఆర్. క్రిష్ణమూర్తి, రాజుయాదవ్, బంధుమిత్రుల కమిటీ సభ్యులు పాల్గొని నివాళులు అర్పించారు.


రామస్వామి భౌతిక కాయం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రజా సంఘాల నేతలు





తెలంగాణ ఉద్యమకారుల హామీలను నెరవేర్చాలి

ఖానాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమకారుల హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ అంబటి శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఐక్య కార్యాచరణ కమిటీ ఏర్పాటు కోసం బుధవారం బుధరావుపేట శివారులోని విజేత ఐటీఐ కళాశాలలో జేఏసీ డివిజన్ కన్వీనర్ గుంటి రాంచందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యమకారుల హామీలను నెరవేర్చడంలో, నెరవేర్పించుకోవడంలో ప్రధాన భూమిక పోషించడం కోసం అన్ని వర్గాలను కలుపుకొని పార్టీలకతీతంగా ఉద్యమకారుల జేఏసీలను పునర్నిర్మించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలోని ఉద్యమకారుల గళాన్ని మరోసారి జేఏసీ రూపంలో పార్టీలకతీతంగా వినిపించాలన్నారు. అనంతరం జేఏసీ మండల అడహక్ కమిటీ కన్వీనర్లుగా కోడి మల్లేష్‌యాదవ్, కందికట్ల జయ, చీఫ్ అడ్వయిజర్‌గా వెంకట్‌నారాయణలను ఎన్నుకున్నారు.

సంక్షిప్త వార్తలు



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఐనవోలు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు మండలంలోని పంథిని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైయ్యారు. ఈ నెల 29న ఎస్జీఎఫ్ ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు వరంగల్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో జరిగాయి. 17 సం. విభాగంలో 9వ తరగతి విద్యార్థి లకావత్ కార్తిక్, 14సం విభాగంలో 7, 8వ తరగతుల విద్యార్థులు కొలిపాక ఆర్యవీర్, మేకల కార్తీక్, బాలికలు 14సం విభాగంలో 6,7 తరగతుల విద్యార్థినులు సట్ల భవ్యశ్రీ, బుల్లె ప్రసనలు ఎంపికయ్యారు. వీరిని బుధవారం ఎంఈవో ఆనందం, పీడీ కిరణ్, ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు అభినందించారు.

మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం



మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్కతుర్తి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని 250 పడకల ఆసుపత్రిగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయాన్ని హర్షిస్తూ బుధవారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గొర్రె మహేందర్, నాయకులు సంతాజీ, బత్తిని రవిందర్, డాక్టర్ రమేష్, వెంకటేష్, స్వామి, ప్రకాష్, వినయ్, సాహెరా, జగన్, స్వరూప పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహం కోసం సాయం



విద్యార్థులకు నగదును అందజేస్తున్న ఎస్సై పస్తం శ్రీనివాస్

ఐనవోలు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కళాఉత్సవ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఎస్సై పస్తం శ్రీనివాస్ బుధవారం రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. సింగారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 5గురు విద్యార్థులు ఇటీవల జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీల(థియేటర్ విభాగం మైమ్)లో ప్రతిభను చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైయ్యారు.

నవంబర్ 1,2 తేదీలలో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో వీరు పాల్గొననున్నారు. వారి ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా రవాణా చార్జీలు, ఖర్చుల కోసం విద్యార్థులకు తనవంతుగా రూ.5వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు రాష్ట్ర స్థాయిపోటీలలో రాణించి జాతీయస్థాయి పోటీలలో ఎంపిక కావాలని అకాంక్షించారు.

పొగాకు ఉత్పత్తుల నిషేధంపై ప్రతిజ్ఞ



వంగర పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

భీమదేవరపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భీమదేవరపల్లి మండలం వంగర బాలికల గురుకుల పాఠశాలలో పొగాకు ఉత్పత్తులను నిషేధించినట్లు విద్యార్థినులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వంగర మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రుబీనా, డాక్టర్ రహ్మాన్‌లు మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులతో ప్రజలు క్యాన్సర్ బారిన పడుతారని హెచ్చరించారు. భవిష్యత్తులో పొగాకు ఉత్పత్తులను ఎవరూ వాడొద్దని విద్యార్థినులచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పాఠశాలను టూబాకో ఫ్రీ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్‌గా ప్రకటించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆఫ్రీన్, వైస్ ప్రిన్సిపాల్ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

ముల్కనూర్ మహిళా డెయిరీలో లక్ష్మిపూజ

భీమదేవరపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముల్కనూర్ మహిళా డెయిరీలో బుధవారం డెయిరీ అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ, జనరల్ మేనేజర్ మార్పాటి భాస్కర్‌రెడ్డిలు లక్ష్మిపూజ నిర్వహించారు. ప్రతీ సంవత్సరం దీపావళి పండుగ సందర్భంగా మహిళా డెయిరీలో లక్ష్మిపూజ నిర్వహిస్తారు. డెయిరీలో ఆర్థిక లావాదేవీలు బాగా జరిగి, అధిక లాభాలు రావాలని ఈ పూజ నిర్వహిస్తామని, తిరిగి ఆ లాభాలను రైతులకు పంచి పెడతామని డెయిరీ జనరల్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

వరిధాన్యంపై పరదాలు



కొప్పూర్‌లో వరిధాన్యంపై పరదాలు కప్పి ఉన్న దృశ్యం

భీమదేవరపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భీమదేవరపల్లి మండలంలో పలు గ్రామాల్లో వరిధాన్యంపై రైతులు బుధవారం పరదాలు కప్పారు. గత రెండ్రోజులుగా వాతావరణం పొడిగా, వేడిగా ఉండడంతో రైతన్నలు హార్వెస్టర్‌తో పొలాలు కోశారు. కానీ బుధవారం మధ్యాహ్నం నుంచి వాతావరణం మేఘావృతమై చిరుజల్లులు కురుస్తుండడంతో పలు గ్రామాల్లోని రైతులు కోసిన వరిధాన్యంపై పరదాలు కప్పారు.

కుటుంబ సర్వే పక్కాగా నిర్వహించాలి

జడ్పీ సీఈవో విద్యాలత



ఎల్కతుర్తిలో మాట్లాడుతున్న జడ్పీసీఈవో విద్యాలత

ఎల్కతుర్తి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను విజయ వంతం చేయాలని హనుమకొండ జడ్పీసీఈవో విద్యాలత అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో సమగ్ర కుటుంబ సర్వేపై పంచాయతీ కార్యదర్శులకు, అంగన్‌వాడీ టీచర్లకు, ఐకేపీ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యాలత హాజరై పలు సూచనలు చేశారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా సర్వేను చేపట్టడం జరిగిందన్నారు. నవంబర్ 6 నుంచి సర్వేను ప్రారంభించాలన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి విజయ వంతం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసులు, ఎంపీడీవో నందనం విజయ్‌కుమార్, ఎంపీవో రవి, ఏపీఎం రవిందర్, వెటర్నరీ డాక్టర్ ధీపిక, ఆర్‌ఐలు సదానందం, భరత్‌చంద్ర, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీలు, ఐకేపీ సీసీలు తదితరులు పాల్గొన్నారు.

భీమదేవరపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కుటుంబ సర్వేను పక్కాగా నిర్వహించాలని జడ్పీ సీఈవో విద్యాలత అన్నారు. బుధవారం మండలంలోని గట్లనర్సింగాపూర్‌లోని రైతు వేదికలో ఎనుమరేటర్లు, సూపర్‌వైజర్లతో కుటుంబ సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన విద్యాలత మాట్లాడారు. కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ శ్రీనివాస్‌కుమార్, ఎంపీడీవో వీరేశం, ఎంపీవో నాగరాజు, ఏపీఎం దేవానంద్, ఎంపీఎస్‌వో రాజ్‌కుమార్, వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ, ఐకేపీ సీసీలు పాల్గొన్నారు.

● ఐనవోలు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సర్వేను బాధ్యతగా నిర్వహించాలని ఎంపీడీవో పులి వెంకటేశ్వర్లు సూచించారు. సర్వేపై బుధవారం ఐనవోలు రైతు వేదికలో ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి సర్వేను పూర్తిచేయాలన్నారు. ఈ సదస్సులో ఎంపీవో రఘుపతిరెడ్డి, ఎఎస్‌వో జగన్, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

● దామెర: సమగ్ర కుటుంబ సర్వేలో సమగ్రత పాటించాలని మండల ప్రత్యేక అధికారి రాపెల్లి బాలరాజు తెలిపారు. బుధవారం మండల కేంద్రం లోని రైతు వేదిక ఆవరణలో సమగ్ర కుటుంబ సర్వేపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో కేవీ. రంగాచారి, ఏఎస్‌వో భారతి, గ్రామ పంచాయతీ సెక్రటరీలు, అంగన్‌వాడీ టీచర్లు, డ్వాక్రా మహిళా సంఘాల గ్రూపుల సభ్యులు, ఏఈలు పాల్గొన్నారు.

● వేలేరు : కుటుంబ సర్వేలో పేర్కొన్న అంశాలకు సంబంధించిన వివరాలను సమగ్రంగా సేకరించాలని ఎంపీడీవో లక్ష్మిప్రసన్న అన్నారు. బుధవారం వేలేరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈకార్యక్రమంలో ఎంపీవో, స్పెషల్ ఆఫీ సర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కుల వివక్ష నిర్మూలనకు కృషి చేయాలి

పరకాల ఆర్డీవో నారాయణ



పౌరహక్కుల దినోత్సవంలో మాట్లాడుతున్న ఆర్డీవో నారాయణ

శాయంపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సమాజంలో కుల వివక్ష రూపుమాపుటకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పరకాల ఆర్డీవో నారాయణ అన్నారు. మండల కేంద్రంలోని దళిత కాలనీలో బుధవారం స్థానిక తహసీల్దార్ కల్వల సత్యనారాయణ ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ దళితులు అన్ని రంగాలలో ఎదగాలని, అన్ని కులాలు, వర్గాల వారు సోదరభావంతో మెలగాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ హక్కులపై అవగాహన కలిగిఉండాలని అన్నారు. అనంతరం తమ కమ్యూనిటీ భవనం నిర్మాణ దశలోనే ఆగిపోయిందని, కాలనీలో విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతున్నాయని, డ్రైనేజీ సమస్య ఉందని కాలనీవాసులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పరిష్కరిస్తామని అధికారులు వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ సీహెచ్. ప్రమోద్ కుమార్, పరకాల మార్కెట్ కమిటీ చైర్మన్ మారపెల్లి రవీందర్(బుజ్జన్న), ఆర్‌ఐలు, దళితకాలనీ వాసులు పాల్గొన్నారు.

కులగణన సమగ్రంగా నిర్వహించాలి

కులగణన సమగ్రంగా నిర్వహించాలని పరకాల ఆర్డీవో నారాయణ ఎన్యూమరేటర్‌లకు సూచించారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎన్యూమరేటర్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఫణిచంద్ర, ఎంపీవో రంజిత్ కుమార్, పంచాయి కార్యదర్శులు, ఎన్యూమరేటర్‌లు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వాహనం బోల్తా.. పలువురికి గాయాలు



పల్టీ కొట్టిన వాహనం, రోడ్డుపైన ఉన్న క్షతగాత్రులు

ఆత్మకూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు శివారు జాతీయ రహదారిలోని దర్గా వద్ద బుధవారం సాయంత్రం వాహనం బోల్తా పడి అందులో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్ర గాయాలు కాగా, మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రయాణికులను తీసుకుని టాటా మ్యాజిక్ వాహనం హనుమకొండ నుంచి ములుగు జిల్లా కమలాపురానికి వెళ్తోంది. ఆత్మకూరు శివారులోకి రాగానే వాహనానికి లారీ ఎదురుగా వచ్చింది. ఇదే సమయంలో లారీని ఓవర్‌టెక్ చేసుకుంటూ అంబాల గ్రామానికి చెందిన రాజకొమురయ్య ద్విచక్రవాహనంపై వచ్చాడు. ఎదురుగా వస్తున్న టాటా మ్యాజిక్ వాహనం, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీ కొనడంతో రాజకొమురయ్య కాలు విరిగింది. టాటా మ్యాజిక్ వాహనం పల్టీలు కొట్టింది. దాంట్లో ప్రయాణిస్తున్న కమలాపురానికి చెందిన డ్రైవర్ అనుగు లక్ష్మణ్, మిర్యాల లావణ్య, బండారి మౌనిక, స్వామిలకు తీవ్ర గాయాలు కాగా, మరో నలుగురు ప్రశాంత్, క్రాంతి, నాగమల్లు రాధ, సారంగంలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు అంబులెన్స్‌లో ఎంజీఎంకు తరలించారు. ఘటన స్థలానికి చేరుకున్న సీఐ సంతోష్ కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

భూ వివాదంలో ఇద్దరి బైండోవర్

ఐనవోలు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పంథిని నల్లమారెమ్మ వాగు(ప్రభుత్వ భూమి) వివాదంలో ఇద్దరిని పోలీసులు బుధవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ప్రభుత్వ వాగు భూమి కబ్జాపై రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సర్వే చేసి అక్రమణకు గురైన వాగును బుధవారం చదును చేయించారు. వాగుకు ఇరువైపుల ఉన్న భూ యాజమానులు కరిమిళ్ల పూర్ణచందర్‌రావు, మేరుగు రమేష్‌లు ఒకరిపై ఒకరు గొడవకు దిగారు. దీంతో ఇద్దరిని తహసీల్దార్ కె. విక్రమ్‌కుమార్ ఎదుట రూ.5లక్షల పూచికత్తుపై బైండోవర్ చేశారు. కబ్జాకు గురైన వాగుస్థలాన్ని వెలికి తీసేసి హద్దులు పెట్టేవరకు ఇరువురు సహకరించాలని, గొడవపడి పనులకు ఆటంకం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై పస్తం శ్రీనివాస్ హెచ్చరించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం



వెంకటేశ్వర్లపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి

ఎల్కతుర్తి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేశవపూర్, బావుపేట, తిమ్మాపూర్, చింతలపల్లి, దామెర, కోతులనడుమ గ్రామాల్లో ఎల్కతుర్తి సహకార సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంఘం చైర్మన్, కేడీసీసీ డైరెక్టర్ శ్రీపతి రవిందర్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, ఏవో రాజ్‌కుమార్, సింగిల్‌విండో డైరెక్టర్లు ముప్పు మహేందర్, మండ పోచయ్య, మాజీ వైస్ ఎంపీపీ తంగెడ నగేష్, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పిట్టల మహేందర్, మాజీ సర్పంచ్ ఎలిగేటి రాజిరెడ్డి, నాయకులు సంతాజీ తదితరులు పాల్గొన్నారు.

● నడికూడ: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని పరకాల ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి అన్నారు. మండలంలోని వెంకటేశ్వర్లపల్లిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, కమలాపూర్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే సన్నరకాలకు రూ. 500రూపాయల బోనస్ రైతులు పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ దాసరి భిక్షపతి, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీలత, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

స్కూల్స్ ర్యాంకింగ్స్‌లో డీపీఎల్‌కు ప్రథమ స్థానం



అవార్డు అందుకుంటున్న చైర్మన్ రవికిరణ్‌రెడ్డి

ధర్మసాగర్, అక్టోబర్ 30 (ఆంధ్రజ్యోతి) : ఎడ్యుకేషనల్ వరల్డ్ సంస్థ ఢిల్లీ ఆధ్వర్యంలో 2024- 2025 విద్యా సంవత్సరానికి ప్రకటించిన ఇండియాన్ స్కూల్స్ ర్యాంకింగ్‌లో పెద్దపెండ్యాల ఢిల్లీ పబ్లిక్ స్కూల్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్టు ప్రిన్సిపాల్ రవికిరణ్‌రెడ్డి బుధవారం తెలిపారు. ప్రతీ సంవత్సరం అక్టోబరులో ప్రకటించే ర్యాకింగ్‌లో ముందు సంవత్సరం ఆయా పాఠశాలల మౌలిక సదు పాయాలు, పరిపాలన విధానాలు తదితర అంశలను పరిగణంలోకి తీసుకొని ర్యాంక్‌లను ప్రకటిస్తారు. ఈ ర్యాకింగ్‌లో వరంగల్ డీపీఎస్ పాఠశాల దేశంలో 47.వ ర్యాంక్‌లో, తెలంగాణలో నాలుగో ర్యాంక్, వరంగల్ ఉమ్మడి జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు కైవసం చేసుకున్నట్టు చైర్మన్ తెలిపారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ర్యాంకింగ్ అవార్డు అందజేసినట్టు తెలిపారు.

చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాదాసి సురేష్

కమలాపూర్, అక్టోబర్ 30 (ఆంధ్రజ్యోతి) ప్రజలు చట్టాలు, హక్కులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ అన్నారు. మండలంలోని నేరెళ్లలో బుధవారం పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా ప్రజలకు హక్కులపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ సురేష్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాదాసి సురేష్ మాట్లాడుతూ దళితులు సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం కల్పించిన హక్కులపై దళితులు, మహిళ రక్షణ కోసం ఏర్పడిన చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు.

తహసీల్దార్ సురేష్ కుమార్ మాట్లా డుతూ దళితులు సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సమ్మయ్య, పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ నరసయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ ఆకుల శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు గోల్కొండ సదానందం, డిబిఫ్ జిల్లా కార్యదర్శి మోరే ఐలయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జల సంరక్షణ సామాజిక బాధ్యత

గీసుగొండ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాల పరిరక్షణ ప్రజలందరి బాధ్యత అని జిల్లా భూగర్భజల శాఖాధికారి అశోక్ అన్నారు. భూగర్భ జలరక్షణ-నీటివాడకంపై కొనాయిమాకుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడుకోవటం, బిందు సేద్యం, ఇంకుడు గుంతల ఉపయోగాల గురించి వివరించారు. ఎస్ఐ కుమార్ మాట్లాడుతూ తరగని ఆస్తులుగా భావితరాలకు భూగర్భ జలాలను అందించాలన్నారు. మొక్కలకు, జీవజాతికి, నీటికి గల సంబం ధాన్ని ఉదహరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రమణాకర్, భూగర్భ జల శాస్త్రవేత్త రవి, అధ్యాపకులు మహేందర్, రమేష్, పీస్ ఫర్ ఆల్ నేషన్స్ డైరెక్టర్ సునిల్, సాల్మన్‌రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారంలో అన్యాయం



అంబేద్కర్ సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు

నెక్కొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సాగే ప్రధానంగా కుటుంబాలను పోషించుకుంటున్న రైతులకు చెందిన భూముల నుంచి ఎన్‌హెచ్-163-గ్రీన్‌ఫీల్డ్ హైవే పోతుండగా ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వడంలో అన్యాయం చేస్తోందంటూ మండలంలోని తోపనపల్లి, వెంకటాపురం గ్రామాల రైతులు బుధవారం అంబేద్కర్ సెంటర్‌లో రాస్తారోకో చేపట్టారు. హైవే నిర్మాణం కారణంగా ఏకరాల కొద్దీ భూములు పోతుండగా ఈ ప్రాంతంలో ఎకరా భూమికి రూ.60లక్షల నుంచి రూ.70 లక్షల వరకూ మార్కెట్‌లో ధర ఉందన్నారు. కానీ, ప్రభుత్వం కేవలం రూ.ఆరు లక్షల నుంచి ఏడు లక్షల మేర ఇస్తామనడం పట్ల విచారం వ్యక్తం చేశారు. నష్ట పరిహారం చెల్లింపులో రైతులకు అన్యాయం జరుగుతుందని, తమ ప్రాణాలు పోయినా ప్రభుత్వానికి తమ భూములు ఇచ్చే ప్రసక్తే లేదన్నారు. రైతులు కృష్ణారావు, వెంకటయ్య, వెంకటమ్మ, రాజు, యాకయ పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ బాధ్యతల స్వీకరణ



వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌కు పూల కుండీని అందిస్తున్న నర్సింగ్ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్

నర్సంపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నర్సంపేట నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సువత్సల, వైస్ ప్రిన్సిపాల్‌గా చంద్రకళ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. వారిని నర్సంపేట నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌గా ప్రభుత్వం నియమించడంతో, నర్సింగ్ కళాశాలకు చెందిన ఉన్నతాధికారుల నియామకం జరుగకపోవడంతో, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ దాస్‌కు జైనింగ్ పత్రాన్ని అందజేసి విధుల్లో చేరారు. త్వరలో నర్సింగ్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభించ నున్నట్లు తెలిసింది.

గీత కార్మికుడికి గాయాలు

నెక్కొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దీక్షకుంటకు చెందిన గీత కార్మికుడు మేరుగు శివ మంగళవారం రాత్రి ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి తీవ్రగాయా లకు గురయ్యాడని గ్రామస్తులు తెలిపారు. శివను చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో కుడి చేయి విరగడంతో పాటు పలు చోట్ల గాయాలు తగిలాయి.

కాంగ్రెస్ నుంచి ఒకరి సస్పెన్షన్

నల్లబెల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నందిగామ గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మర్రి నాగ రాజును పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం తిరుపతిరెడ్డి నల్లబెల్లి మండల కేంద్రంలో మాట్లాడుతూ నాగ రాజు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతు న్నదున ఈ చర్య తీసుకున్నట్లు తెలిపారు. పార్టీకి వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

ఎన్నికల హామీల అమలు కోసం పోరాటాలే శరణ్యం

సీపీఎం జిల్లా కార్యదర్శి చింతమల్ల రంగయ్య



సభలో మాట్లాడుతున్న చింతమల్ల రంగయ్య

నర్సంపేట టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు కోసం పోరాటాలే శరణ్యమని సీపీఎం జిల్లా కార్యదర్శి చింతమల్ల రంగయ్య అన్నారు. పట్టణంలో ఐఎంఏ హాల్‌లో పట్టణ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్ అధ్యక్షతన బుధవారం ఆహ్వాన సంఘం సన్నాహాక సభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రంగయ్య మాట్లాడుతూ ప్రజా పోరాటా లకు ఎర్రజెండా దిక్సూచిగా పనిచేస్తుందన్నారు. మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య కుల, మతాల పేరిట విద్వేషాలను రెచ్చగొట్టి పాలన కొనసాగిస్తు న్నదన్నారు. దేశంలో ప్రజాస్వామ్య హక్కులను కేంద్రం కాలరాస్తున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధా నాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని పిలుపు నిచ్చారు. నవంబరు 29, 30 తేదీల్లో నర్సంపేట పట్టణంలో జరగనున్న సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మహాసభల నిర్వహణ కోసం ఆహ్వాన సంఘం కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బెంబేరి మల్లార్‌రావు, కత్తి కట్టయ్య, పెండ్యాల సారయ్య, అన్వర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం • 31 అక్టోబరు 2024

భూమి భారాన్నంతా మోసే భూదేవి దీపం వేడిని భరించలేదట! అందుకే నేల మీద దీపాన్ని నేరుగా పెట్టకూడదు. వేడి నేలకు తగలకూడదు. ప్రమిదను మరో ప్రమిదలో పెట్టి దీపాన్ని వెలిగించడంలో ఆంతర్యం అదే.



మానవుడి జీవితం చీకటి వెలుగుల సమాహారం. చీకటి- దుఖానికి, అజ్ఞానానికి.. వెలుగు ఉత్సాహానికి, జ్ఞానానికి ప్రతీకలుగా భావిస్తారు. చీకటిని పారద్రోలి వెలుగు వైపు పయనించే పండుగ కాబట్టే దీపావళికి భారతీయ సంస్కృతీ సంప్రదాయాల్లో అంతటి ప్రాముఖ్యం ఏర్పడింది. దీపావళి వేడుకలు వేదకాలం నుంచీ ఉన్నాయి. వీటి గురించి రామాయణ, భారత, భాగవతాలలో ప్రస్తావన ఉంది.

జీవితమే దీపావళి

జగద్గురువైన ఆదిశంకరులు షణ్మత స్థాపన చేసి, పంచాయత పూజా విధానాన్ని ఏర్పాటు చేసినప్పుడు... స్కంధుడికి ప్రతీకగా దీపారాధనను ఏర్పాటు చేశారు. అందుకే ఏ శుభకార్యం ప్రారంభించినా... ముందుగా దీపారాధన చేస్తారు. దీపం అగ్నికి సంకేతం. కార్యాలను నిరోధించడానికి ప్రయత్నించే ప్రతికూల శక్తులను పారద్రోలాలనేది దీపారాధనలోని ఆంతర్యం. అంతే కాదు. సృష్టి, స్థితి, లయలకు దీపంతో సంబంధం ఉంది. దీపంలో కనిపించే నీలం, తెలుపు, ఎరుపు రంగులు త్రిమూర్తులకు ప్రతీకలనీ, అదే విధంగా విద్య, శక్తి, ఐశ్వర్యాలను ప్రసాదించే సరస్వతి, దుర్గ, మహాలక్ష్మి... దీపకాంతిలో కొలువై ఉన్నారనేది నమ్మకం. అందుకే దీప దర్శనం సకల పాపాలనూ పోగొడుతుందని అనేక మంది భావిస్తారు. ఆ దీపానికి పూజలు చేస్తారు.



రాత్రి దీపాల ప్రాముఖ్యం

ప్రతి రోజుకూ రెండు సంధ్యలు ఉంటాయి. చంద్రుడు వెళ్లిపోయి.. సూర్యుడు ఉదయించటానికి మధ్య ఉండే సంధ్యను- 'ప్రాతఃసంధ్య' లేదా 'ఉదయ సంధ్య' అంటారు. సూర్యుడు అస్తవించి.. చంద్రోదయం నడుమ ఉండే సంధ్యను 'సాయం సంధ్య' అంటారు. ఉదయ సంధ్యా సమయంలో ఇంట్లో ఉన్న భగవంతుడి ముందు దీపాన్ని వెలిగించి ఆరాధిస్తారు. సాయంత్రం వేళల్లో సూర్యుడు అస్తమిస్తూ తన శక్తిని దీపంలో నిక్షేపించి వెళ్తాడు కాబట్టి ఆ దీపానికి నమస్కరిస్తారు. మన శాస్త్రాల ప్రకారం ఈ రెండింటివల్ల కలిగే పుణ్యం ఒకటే!

మహాలక్ష్మీ స్వరూపం

దీపం ఐశ్వర్యం అయితే అంధకారం దారిద్ర్యం. దీపం ఉన్న చోట సంపద ఉంటుంది. అందుకే దీపాన్ని మహాలక్ష్మీ స్వరూపంగా కొలుస్తారు. లక్ష్మీ దేవి సకలైశ్వర్యప్రదాయని కాబట్టి- 'దీప లక్ష్మీ నమోస్తుతే' అంటూ దీపాన్ని మహాలక్ష్మీ స్వరూపంగా భావించి పూజలు చేస్తారు. దీపంలో కనిపించే ఎర్రని కాంతి సృష్టికర్త అయిన బ్రహ్మకూ, నీలి కాంతి విష్ణుమూర్తికీ, తెల్లని కాంతి పరమ శివుడికీ ప్రతీకలుగా భావిస్తారు.

కర్టెన్లతో కనువిందుగా...

స్మార్ట్ హోమ్

ఇంటి అందాన్ని ద్విగుణీకృతం చేయడంలో డోర్ కర్టెన్లు ముందుంటాయి. ఎండ, దుమ్ము, ధూళి నుంచి ఇంటిని కాపాడతాయి. ప్రతి ఒక్కరూ వారి అభిరుచి ప్రకారం గుమ్మానికి, కిటికీలకు రంగు రంగుల కర్టెన్లు వేస్తుంటారు. కర్టెన్ రంగుల ఎంపికలో కూడా వాస్తు నియమాలు ఉన్నాయని చాలామందికి



తెలియదు. ఇంటి సభ్యులు ధన ధాన్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలంటే ఏ దిశలో ఏ రంగు కర్టెన్ వేయాలో తెలుసుకుందాం!

- కుటుంబ సభ్యుల మధ్య ప్రేమాభిమానాలు పెరగాలంటే దక్షిణం వైపున్న గదులకు ఎరుపు రంగు కర్టెన్లు వేయాలి.
- పడమర, వాయువ్యం దిశల వైపున్న గదులకు, కిటికీలకు తెల్లని చిన్న ప్రింట్లు ఉన్న కర్టెన్లు వేస్తే ఆ ఇంట్లో ఉండేవారి శ్రమకు తగ్గ ఫలితం దక్కుతుంది. ఇల్లు ప్రకాశవంతంగా కూడా ఉంటుంది.
- పడకగదికి నారింజ, గులాబీ, నీలం, క్రీమ్ కలర్ కర్టెన్లు లేదంటే ఏవైనా లేత రంగులవి వేస్తే మనసు ప్రశాంతంగా ఉంటుంది. బంధం బలపడుతుంది.
- వాస్తు ప్రకారం ఆకుపచ్చ రంగు అత్యంత శుభప్రదమైంది. ఇంటి గుమ్మానికి, తూర్పువైపున్న గదులకు, స్టడీ రూమ్‌కు ఆకుపచ్చని కర్టెన్లు వేస్తే చేపట్టిన ప్రతి పనిలో విజయం లభిస్తుంది. ఇంట్లో పాజిటివ్ ఎనర్జీ, చదువుకునే పిల్లలకు ఏకాగ్రత పెరుగుతాయి.
- ఉత్తరం దిశలో ఉన్న గుమ్మానికి, లివింగ్ రూమ్‌కు నీలి రంగు కర్టెన్లు వేస్తే ఇంటి సభ్యుల కలలు నెరవేరుతాయి. అప్పుల బాధ తొలగిపోతుంది.
- పూజగదికి పసుపు రంగు కర్టెన్ వేయాలి. ఈ రంగు ఇంటి సభ్యుల్లో సహనం, జ్ఞానం, ఆధ్యాత్మిక భావనలను కలిగిస్తుంది.

అంతర్గతంగా ప్రకాశించాలి

మన ప్రాచీన సంప్రదాయాలు, సంస్కృతి ఎంతో జ్ఞానాన్ని, వివేకాన్ని ప్రతిబింబిస్తాయి. దీపావళి పండుగ అనంతరం ప్రారంభమయ్యే కార్తీక మాసమంతా... ప్రజలు తమ ఇళ్లను దీపాలతో అలంకరిస్తారు. అంతర్గతంగా మనలోని చీకటిని తొలగించుకోవడానికి జ్ఞానమనే దీపం కావాలని ఇది సూచిస్తుంది.



విశేషం

ప్రపంచంలోని చీకటిని ఒక్కరే తొలగించలేరు. ఈ చీకటిని పారద్రోలేందుకు, ప్రతి ఒక్కరూ తమ లోపలి నుంచి ప్రకాశించాలి. తమలోని అంతర్గత కాంతిని ఇతరులతో పంచుకోవాలి.

రావణ వధ అనంతరం శ్రీరాముడు అయోధ్యకు, స్వదేశానికి తిరిగివచ్చినందుకు గుర్తుగా దీపావళి జరుపుకుంటారు. అంతేకాదు, మరొక రాక్షస రాజు నరకాసురుని మరణాన్ని కూడా దీపావళి పండుగ సూచిస్తుంది. అతనితో ముడిపడిన అందమైన కథ ఒక ఒకటి ఉంది.

శ్రీ కృష్ణుని చేతిలో ఓడిపోయి చనిపోబోతుండగా, జీవితాంతమూ తాను చేసిన పాపాలు గుర్తుకువచ్చి నరకాసురునికి పశ్చాత్తాపం కలిగింది. అప్పుడతడు, తాను జీవించినంత కాలమూ అష్టకష్టాలూ అనుభవించిన ప్రజలు, తాను చనిపోతున్నందుకు గుర్తుగా దీపాలు వెలిగించి ఆనందంగా గడపాలని శ్రీకృష్ణుడిని కోరుకున్నాడు. కృష్ణుడు అనుగ్రహించాడు. ఆ విధంగా శ్రీకృష్ణుని వరం వలన నరక చతుర్దశి పండుగరోజు అయింది.

నరకాసురుడు పదహారు వేలమంది స్త్రీలను తన వద్ద బందీలుగా ఉంచుకున్నాడు. అతని మరణానంతరం వారందరికీ దిక్కు తోచక ప్రాణత్యాగానికి నిశ్చయించుకున్నారు. తమ ఇంటిపేరు ఇప్పుడు నరకాసురుడితో ముడిపడి ఉన్నందున, తాము పుట్టినింటికి తిరిగివెళ్లినా ప్రజలు ఆదరించరని, తమపై రాళ్లు రువ్వుతారని, కాబట్టి చనిపోవడమే మేలని వారు రోదించారు. అపుడు శ్రీకృష్ణుడు వారిని ఓదార్చి, 'ఆనాటి నుంచి మిమ్మల్ని నా భార్యలుగా స్వీకరిస్తున్నాను. మీరు నన్ను మీ భర్తగా చెప్పుకోండి. ఆ విధంగా నా ఇంటి పేరు మీకు వస్తుంది. మీరు సురక్షితంగా ఉంటారు' అని చెప్పాడు. అలా నరకాసురుడి రాణులంతా గోపికలుగా మారి శ్రీకృష్ణుని మహిమలను గానం చేస్తూ జీవించారు.

దీపావళి అంటే కేవలం దీపాలు వెలిగించడం మాత్రమే కాదు, దానిలో అంతకు మించిన అర్థం ఉంది. బుద్ధ భగవానుడు చెప్పినట్లుగా, 'మీకు మీరే వెలుగుగా ఉండండి. మనలో ప్రతి ఒక్కరమూ ఒక దీపం మాత్రమే వెలిగిస్తే సరిపోదు. ప్రపంచంలోని చీకటిని ఒక్కరే తొలగించలేరు. ఈ చీకటిని పారద్రోలేందుకు, ప్రతి ఒక్కరూ తమ లోపలి నుంచి ప్రకాశించాలి. తమలోని అంతర్గత కాంతిని ఇతరులతో పంచుకోవాలి. మీరే ప్రకాశం, వెలుగు అని గుర్తించడమే దీపావళి యొక్క సారాంశం. అందుకే బుద్ధుడు సంఘాన్ని సృజించాడు. దాని ద్వారా అనేక మనస్సులు జ్ఞానంతో వెలిగిపోతాయి. ఎక్కువమంది ప్రజలు జ్ఞానంలోకి మేల్కొన్నప్పుడు, మనం సంతోషకరమైన, దివ్యమైన సమాజాన్ని సృష్టించగలుగుతాము. దాని కోసం మనం ప్రపంచంలోని నలుమూలలకూ జ్ఞానాన్ని వ్యాపింపజేయాలి.

జీవితంలో మనం వివిధ రకాల వ్యక్తులతో సంభాషిస్తాము. కొందరితో మనం కలిసిపోతాం, మరికొందరితో కలవము. కొందరు మీకు వ్యతిరేకంగా మారవచ్చు. లేదా మీరే వారికి వ్యతిరేకంగా మారవచ్చు. ఏదేమైనా, చివరికి మీరు వారిని ఇష్టపడకపోవచ్చు. ఈ విధంగా మనస్సు రాగద్వేషాలలో చిక్కుకుపోతుంది. అందుకే ఈనాటికీ చాలా గ్రామాల్లో, అందరికీ, బద్ధ శత్రువులకు కూడా ఈ రోజున మిఠాయిలు పంచే సంప్రదాయం ఉండటం మీరు చూడవచ్చు. కాబట్టి మీరు ఎవరినైనా మీ శత్రువుగా, లేదా మీకు నచ్చని వ్యక్తి అని భావిస్తే, వారితో మీరు మిఠాయిలు పంచుకున్నప్పుడు, మీరు వారిని కలిసినప్పుడు, ఆ చేదు భావన కరిగిపోతుంది. హృదయం మృదువుగా మారుతుంది. మనస్సు.. ప్రేమ, సానుకూలత, వేడుకలతో నిండిపోతుంది. దీపావళి అంటే మనకు గతంలో ఇతరులపై కలిగిన బాధను, కోపాన్ని, ద్వేషాన్ని సమష్టిగా విడిచిపెట్టి, చీకటి నుంచి వెలుగులోకి వెళ్లడం.

జ్ఞానంలో లేని వారికి సంవత్సరానికి ఒక్కరోజే దీపావళి. కానీ జ్ఞానులకు ప్రతి క్షణమూ, ప్రతి రోజూ దీపావళి. ఏ వేడుకైనా సేవా స్ఫూర్తి లేకుంటే అసంపూర్ణంగా ఉంటుంది. భగవంతుడి నుంచి మనకు లభించిన వాటన్నిటినీ ఇతరులతో పంచుకోవాలి. అదే నిజమైన వేడుక. వేడుక అంటే అన్ని భేదాలను తొలగించుకుని, ఆత్మానందంలో మునిగి తేలడం. ఈ జ్ఞానాన్ని దృష్టిలో ఉంచుకుని, మానవాళికి సేవ చేయడానికి సంకల్పాన్ని తీసుకుంటూ ఈ దీపావళిని జరుపుకోండి.

మీ హృదయంలో ప్రేమ దీపాన్ని, మీ ఇంటిలో సమృద్ధి అనే దీపాన్ని, ఇతరులకు సేవ చేసేందుకు కరుణ అనే దీపాన్ని, అజ్ఞానపు చీకటిని పారద్రోలడానికి జ్ఞాన దీపాన్ని వెలిగించండి.



- గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్


నవ్య | చిత్రజ్యోతి

నందమూరి వంశం నుంచి నాలుగో తరం



నందమూరి వంశం నుంచి నాలుగో తరం నటుడు వెండి తెరపైకి రాబోతున్నాడు. లెజండరీ నటుడు ఎన్టీఆర్ ముని మనవడు, హరికృష్ణ మనవడు, జానకీరామ్ తనయుడు నందమూరి తారక రామారావు హీరోగా ఎంట్రీ ఇవ్వనున్నాడు. వైవీఎస్ చౌదరి దర్శకత్వం వహిస్తున్నారు. న్యూ టాలెంట్ రోర్స్ పతాకంపై యలమంచిలి గీత ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు రాఘవేంద్రరావు, నిర్మాత అశ్వనిదత్ చేతుల మీదుగా 'ఎన్టీఆర్ తొలి దర్శనం' పేరుతో హీరో ఫస్ట్ లుక్ గ్లింప్స్ బుధవారం జరిగిన కార్యక్రమంలో రిలీజ్ చేశారు. పొడవాటి జుట్టు, ధృఢమైన శరీరాకృతితో అందంగా కనిపించారు చిన్న ఎన్టీఆర్. అర్థవంతమైన పాత్రలను ఎన్నుకుని ప్రేక్షకులను అలరిస్తాననీ, పరిశ్రమకు విధేయుడిగా ఉంటాననీ పెద్ద ఎన్టీఆర్‌పై ప్రమాణం చేశారు ఈ చిన్న ఎన్టీఆర్. 18 నెలల పాటు దర్శకుడు వైవీఎస్ చౌదరి ఆధ్వర్యంలో వివిధ విభాగాల్లో శిక్షణ పొందానని తెలిపారు. ఈ సినిమాలో చిన్న ఎన్టీఆర్ సరసన వీణా రావు కథానాయికగా నటిస్తున్నారు. ఈ సందర్భంగా వైవీఎస్ చౌదరి మాట్లాడుతూ 'పెద్దాయన ఎన్టీఆర్‌తో జగత్ విఖ్యాతమైన సినిమాలు తీసి.. ఆయన కీర్తి ప్రతిష్ఠలను ఎంతో ఇనుమడింపజేసే ప్రయాణంలో మా గురువుగారైన రాఘవేంద్రరావు ఎంతో కృషి చేశారు. అలాగే అన్నగారి చేతుల మీదుగా అశ్వనీదత్‌గారి వైజయంతీ మూవీస్ సంస్థ ప్రతిష్ఠాపించగా ఎంతో ఎత్తుకు ఎదిగింది. ఎన్టీఆర్ చేతి చలవ అలాంటిది. అలాంటి ఇద్దరి ఆశీస్సులతో మరొక ఎన్టీఆర్ అద్భుతమైన ఇన్నింగ్స్ ప్రారంభించబోతున్నాడు. ఈ మహానుభావులిద్దరికీ రామారావు గారితో అనుబంధం ఉంది. పండితుల వేద మంత్రాల సాక్షిగా ఈ పెద్దలిద్దరితో ఈ నందమూరి తారక రామారావు షో రీల్‌ని పరిచయం చేయించడం నా అదృష్టంగా భావిస్తున్నా' అని అన్నారు.

డిసెంబర్ నాలుగున వివాహం



అక్కినేని నాగచైతన్య, శోభిత ధూళిపాళ్ల వివాహ ముహూర్తం ఖరారైంది. డిసెంబర్ నాలుగున వీరిద్దరూ వివాహం చేసుకోనున్నట్లు అక్కినేని కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఈ ఏడాది ఆగస్టు 8న నాగచైతన్య, శోభితల నిశ్చితార్థం జరిగింది. అప్పట్లో పెళ్లి తేదీని ప్రకటించకపోయినప్పటికీ డిసెంబర్‌లో వివాహం ఉంటుందని సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. సరిగ్గా వారం రోజుల క్రితం శోభిత పెళ్లి పనులు మొదలయ్యాయని సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. దాంతో త్వరలోనే వీరి వివాహం ఉంటుందని అందరూ అనుకుంటున్న తరుణంలో చిత్రజ్యోతి ఈ విషయమై అక్కినేని కుటుంబ సభ్యులను సంప్రదించగా వారు ఈ వార్తను ధ్రువీకరించారు.

ఎంతో సంతృప్తిని ఇచ్చింది



వెంకీ అట్లూరి దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్, మీనాక్షి చౌదరి జంటగా నటించిన చిత్రం 'లక్కీ భాస్కర్'. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలు. ఈ గురువారం గ్రాండ్ రిలీజ్ అవుతున్న సందర్భంగా నాగవంశీ మీడియాతో ముచ్చటించారు. 'విడుదలకు ముందే సినిమాపై భారీ స్థాయిలో అంచనాలు ఏర్పడినందుకు సంతోషంగా ఉంది. మంచి సినిమా చేశామనే సంతృప్తి అరుదుగా కలుగుతుంది. అలాంటి సంతృప్తిని 'లక్కీ భాస్కర్' కలిగించింది. మనిషి డబ్బు సంపాదించాలనుకున్నప్పుడు ఎంత దూరమైనా వెళ్తాడు అనే కథాంశంతో ఈ చిత్రం రూపొందింది. బాక్సింగ్ నేపథ్యంలో థ్రిల్లర్ జానర్‌లో ఉండే ఫ్యామిలీ సినిమా ఇది. సినిమా చూస్తున్న ప్రతి ప్రేక్షకుడూ భాస్కర్ గెలవాలని కోరుకుంటాడు. భాస్కర్ పాత్రలో తమని చూసుకుంటారు. కథానాయకుడు ఈ సినిమాలో ఎవరినీ మోసం చేయడు. తన తెలివి తేటలతోనే ఎదుగుతాడు. ఇది సందేశాత్మక చిత్రం కాదు. తెలుగులో వస్తున్న ఒక విభిన్న చిత్రం' అని నాగవంశీ తెలిపారు.

కిరణ్ సక్సెస్ స్టోరీ నాకు ఇన్‌స్పిరేషన్

నాగచైతన్య

హీరో కిరణ్ అబ్బవరం నటించిన భారీ పీరియాడిక్ థ్రిల్లర్ సినిమా 'క. ఈ గురువారం థియేటర్లలో విడుదలవుతున్న సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హీరో నాగచైతన్య పాల్గొన్నారు. 'నేను ఇంట్రోవర్ట్ పర్సన్‌ను. కొత్త వాళ్లతో పెద్దగా కలవను. రీసెంట్‌గా కిరణ్ చెన్నైలో కలిశాడు. ఆయనతో మాట్లాడిన కొద్దిసేపటికే చాలా దగ్గరి ఫ్రెండ్‌లా అనిపించాడు. కిరణ్ ఇన్‌స్పైరింగ్ జర్నీకి నేను నంబర్ వన్ ఫ్యాన్‌ను. ఎందుకంటే నేను ఇండస్ట్రీలో ఫ్యామిలీ బ్యాగ్రౌండ్‌తో మంచి ప్రొటెక్షన్‌తో వచ్చాను. తనకు ఎవరి సపోర్ట్ లేదు. స్వతహాగా ఎదిగాడు. కిరణ్ సక్సెస్ స్టోరీ నాకు ఇన్‌స్పిరేషన్‌గా నిలుస్తుంది. ఇండస్ట్రీకి వచ్చే ఎంతో మందికి కిరణ్ స్ఫూర్తిగా నిలుస్తారు. ఇలాంటి హీరోలు సక్సెస్ కావాలి. 'క' సినిమా ట్రైలర్ చూశాను. తప్పకుండా బ్లాక్ బస్టర్ అవుతుంది' అని నాగ చైతన్య అన్నారు. హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ 'మూవీ ప్రీ రిలీజ్‌కి నాగ చైతన్య వంటి వారు రావడం ఆనందంగా ఉంది. ఆయన పాజిటివిటీతో మాకు మంచి జరుగుతుందని కోరుకుంటున్నాం. నాకు సినిమానే ప్రాణం. అందుకే ఏ ఉద్యోగం చేసినా మనసు సినిమావైపే లాగేది. అలా ఇండస్ట్రీకి వచ్చాను. సక్సెస్ వచ్చింది' అని అన్నారు. ఈ కార్యక్రమంలో సుజిత్, సందీప్, నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డి, హీరోయిన్లు నయన్ సారిక, తన్వీరామ్ పాల్గొన్నారు.




SITHARA ENTERTAINMENTS
SRIKARA STUDIOS
FORTUNE FOUR CINEMAS
నేడే విడుదల
31
10
24
DULQUER SALMAAN
లక్కీ భాస్కర్
TELUGU · MALAYALAM · TAMIL · HINDI · KANNADA
VENKY ATLURI
NAGA VAMSI.S · SAI SOUJANYA
GV PRAKASH KUMAR
NIMISH RAVI
NAVIN NOOLI
BANGLAN


SRICHAKRAAS ENTERTAINMENTS
SMT. CHINTA VARALAXMI PRESENTS
KA PRODUCTIONS
నేడే
విడుదల
KIRAN ABBAVARAM
క క క క


Hombale FILMS
నేడే
విడుదల
SRIIMURALI
బఘీర
PRODUCER VIJAY KIRAGANDUR
SCREENPLAY DIALOGUE DIRECTION DR. SURI
STORY PRASHANTH NEEL


GALLA MANJUNATH PRESENTS
RADHAKRISHNAA PRODUCTION COMPANY
NOV 8TH
GRAND REALESE
WORLDWIDE
SATHISH BABU IN
జాతర
PRODUCED BY DWARAMPUDI RADHAKRISHNA REDDY
A FILM BY SATHISH BABU RATAKONDA


FROM
TODAY
RELEASING
WORLDWIDE
KAMAL HAASAN
SONY PICTURES INTERNATIONAL PRODUCTIONS
SIVAKARTHIKEYAN
అమరన్
WRITTEN & DIRECTED BY RAJKUMAR PERIASAMY
GV PRAKASH KUMAR
PRODUCED BY KAMAL HAASAN · SONY PICTURES INTERNATIONAL PRODUCTIONS · R. MAHENDRAN


PAKKAA ENTERTAINER
FRIDAY FRAMEWORKS
CHETAN MADDINENI
GOPI SUNDAR
దీపావళి శుభాకాంక్షలు
ధూం ధాం
WORLDWIDE RELEASING
NOV 8TH
IN THEATRES
PRODUCER M.S. RAMKUMAR
DIRECTOR MACHA SAIKISHOR
WRITER GOPI MOHAN
RELEASE BY MYTHRI
SPECIAL THANKS TO OUR DISTRIBUTORS
NIZAM : SHASHI (MYTHRI MOVIE DISTRIBUTORS)
WEST : LVR (ADITHYA FILMS)
VIZAG AND KRISHNA : SAI BABU (ANNAPURNA STUDIOS)
EAST : SIVARAM (VINTAGE CREATIONS)
GUNTUR : VMR (PADMAKAR CINEMAS)
NELLORE : HARI (HARI PICTURES)
CEEDED : ABHISHEK REDDY (SHILPAKALA ENTERTAINMENTS)
AZAR : USA
NARENDRA : KENYA
ANAND CHUKKA : AUSTRALIA


VYRA ENTERTAINMENTS
VARUN TEJ
Happy
DIWALI
MATKA
WRITTEN & DIRECTED BY KARUNA KUMAR
PRODUCED BY DR. VIJENDER REDDY TEEGALA
RAJANI TALLURI
G V PRAKASH KUMAR
IN CINEMAS
14.11.24



ఈ షేర్లే తారాజువ్వలు

పెట్టుబడులకు ఇదే అదును

ప్రస్తుతం స్టాక్‌మార్కెట్‌లో దిద్దుబాటు కొనసాగుతోంది. అయినా గత ఏడాది దీపావళితో పోలిస్తే నిఫ్టీ ఇప్పటి వరకు మదుపరులకు దాదాపు 25 శాతం లాభాలు పంచింది. ఈ నేపథ్యంలో శుక్రవారం జరిగే మూరత్ ట్రేడింగ్‌లో కొనేందుకు కొన్ని కంపెనీల షేర్లు మరింత ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. సంవత్, 2081 ట్రేడింగ్ రోజు పెట్టుబడి లాభాల కోసం వివిధ బ్రోకరేజి సంస్థలు రికమండ్ చేసిన కొన్ని కంపెనీల షేర్ల వివరాలు ఇలా ఉన్నాయి

ఐసీఐసీఐ బ్యాంక్

సంవత్ 2080 నుంచి ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు 45 శాతం లాభాలు పంచాయి. 2021 ఫిబ్రవరితో పోల్చినా ఈ కౌంటర్ మదుపరులకు 158 శాతం లాభాలు పంచింది. ఈ షేర్లు బుధవారం రూ.1,312 వద్ద ముగిశాయి. ప్రస్తుతం దిద్దుబాటులో ఉన్న ఈ షేర్లను రూ.1,773 టార్గెట్‌తో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.1,215-1,150.

ఐటీసీ

ఐటీసీ షేరు కూడా ప్రస్తుతం ఆకర్షణీయంగానే కనిపిస్తోంది. బుధవారం రూ.491 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌కు రూ.460-445 వద్ద గట్టి మద్దతు కనిపిస్తోంది. వచ్చే ఏడాది కాలంలో రూ.633 టార్గెట్‌తో పొజిషన్లు తీసుకోవచ్చు. రెసిస్టెన్స్ రేంజి : రూ.545, రూ.579

మాక్రోటెక్ డెవలపర్స్

గత నాలుగు నెలలుగా డౌన్‌ట్రెండ్‌లో ఉన్న ఈ షేరు బుధవారం రూ.1,182 వద్ద ముగిసింది. గత ఏడాది జూన్ తర్వాత ఈ కంపెనీ షేర్లు 20 నెలల సగటు కంటే దిగువన ట్రేడవడం ఇదే తొలిసారి. రూ.974 స్టాప్‌లాస్‌తో రూ.1,600 టార్గెట్‌తో మదుపరులు ఈ కౌంటర్‌లో పొజిషన్లు తీసుకోవచ్చు. రెసిస్టెన్స్ రేంజి : రూ.1,310, రూ.1,380.

వరుణ్ బేవరేజేస్

ఈ కంపెనీ షేర్లు బుధవారం రూ.606 వద్ద ముగిశాయి. 2018 ఏప్రిల్‌లో రూ.37 వద్ద ట్రేడైన ఈ కంపెనీ షేర్లు, ఇప్పటి వరకు మదుపరులకు 1700 శాతం లాభాలు పంచాయి. రూ.527 వద్ద గట్టి మద్దతు లభిస్తోంది. టెక్నికల్ చార్టుల ప్రకారం చూస్తే ఈ షేరు రూ.922 వరకు పెరగవచ్చు. రెసిస్టెన్స్ రేంజి : రూ.727, రూ.800.

థైరోకేర్ టెక్నాలజీస్

ఈ షేర్లు బుధవారం రూ.949 వద్ద ముగిశాయి. ఈ ఏడాది జూలై నుంచి బ్రేకౌట్ కనిపిస్తోంది. గత నాలుగు నెలల్లోనే మదుపరులకు 53 శాతం లాభాలు పంచాయి. రూ.905పైన ట్రేడైనంత వరకు ఈ కౌంటర్‌లో అప్‌ట్రెండ్ కొనసాగుతుందని భావించవచ్చు. సంవత్ 2081లో కంపెనీ షేర్లు 47.2 శాతం లాభంతో రూ.1,400 వరకు పెరిగే అవకాశం కనిపిస్తోంది. రెసిస్టెన్స్ రేంజి : రూ.1,125, రూ.1,230. ఒకవేళ రూ.905 కంటే దిగువకు వస్తే రూ.850-790 మధ్య గట్టి మద్దతు లభిస్తుందని భావించాలి.

రిలయన్స్ ఇండస్ట్రీస్

ఆర్ఐఎల్ షేర్లు ఇప్పటికీ ఆకర్షణీయంగానే కనిపిస్తున్నాయి. 1:1 బోనస్ తర్వాత బ్రోకరేజి సంస్థలు మరింతగా ఈ కౌంటర్‌పై దృష్టి పెట్టాయి. ఈ గ్రూప్‌నకు వచ్చే 3-4 సంవత్సరాల్లో జియో, రిటైల్ వ్యాపారాలు మరింత దన్నుగా నిలవబోతున్నాయి. ఇది చాలదన్నట్టు హరిత ఇంధనాల పై సైతం కంపెనీ ప్రత్యేక దృష్టి పెట్టింది. దీంతో 2024-27 మధ్య కాలంలో ఆర్ఐఎల్ నికర లాభాలు ఏటా 15 శాతం వరకు పెరిగే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం రూ.1,344 వద్ద ట్రేడవుతున్న ఆర్ఐఎల్ షేర్లు వచ్చే 6-12 నెలల్లో మదుపరులకు 28 శాతం వరకు లాభాలు పంచే అవకాశం ఉంది.

పవర్‌గ్రిడ్

పెట్టుబడులకు పెద్దగా ఢోకా లేకుండా, స్థిరమైన రాబడులు, లాభాల కోసం చూసే మదుపరులకు పవర్‌గ్రిడ్ కంపెనీ షేర్లు అత్యంత ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం కంపెనీ షేర్లు రూ.318 వద్ద ట్రేడవుతున్నాయి. వచ్చే 6-12 నెలల్లో రూ.383 టార్గెట్‌తో మదుపరులు ఈ కౌంటర్‌లో పొజిషన్లు తీసుకోవచ్చు. పీఎస్‌యూ కావడంతో ఏటా వచ్చే లాభాల నుంచి మంచి డివిడెండ్ కూడా చెల్లిస్తోంది.

బజాజ్ ఫైనాన్స్

మదుపరులకు మంచి లాభాలు పంచిన అతి కొద్ది కంపెనీల్లో బజాజ్ ఫైనాన్స్ ఒకటి. ప్రస్తుతం రూ.6,955 వద్ద ట్రేడవుతోంది. వచ్చే ఆరు నుంచి 12 నెలల్లో రూ.8,552 టార్గెట్‌తో పొజిషన్లు తీసుకోవచ్చు.

ఐసిఐసీఐ లొంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్

ప్రైవేట్ బీమా కంపెనీల్లో మోటార్ ఇన్సూరెన్స్ మార్కెట్‌లో కంపెనీదే హవా. ఫైర్, ఇంజినీరింగ్, మెరైన్, లయబిలిటీ ఇన్సూరెన్స్‌లోనూ కంపెనీకి మంచి పట్టుంది. ప్రస్తుతం ఈ షేరు రూ.1,928 వద్ద ట్రేడవుతోంది. వచ్చే 6-12 నెలల్లో రూ.2,450 టార్గెట్‌తో మదుపరులు పొజిషన్లు తీసుకోవచ్చు.

జిందాల్ స్టీల్ అండ్ పవర్

దేశంలోని ప్రముఖ స్టీల్ కంపెనీ జిందాల్ స్టీల్ అండ్ పవర్ ఉత్పత్తి సామర్థ్యం ప్రస్తుతం 96 లక్షల టన్నులు. దీన్ని 2026 మార్చి నాటికి 159 లక్షల టన్నులకు విస్తరించే పనిలో ఉంది. కంపెనీ షేర్లు ప్రస్తుతం రూ.919 వద్ద కోట్ అవుతున్నాయి. వచ్చే ఆరు నుంచి 12 నెలల్లో రూ.1,150 టార్గెట్‌తో మదుపరులు ఈ కౌంటర్‌లో పొజిషన్లు తీసుకోవచ్చు.

స్వర్ణ శోభితం!

క్యూ3లో 18% పెరిగిన డిమాండు
248.3 టన్నులుగా నమోదు: డబ్ల్యూజీసీ

ముంబై: విపణిలో బంగారం ధరలు దూసుకుపోతున్నా డిమాండు ఏ మాత్రం తగ్గడంలేదు. ఈ ఏడాది జూలై- సెప్టెంబరు త్రైమాసికంలో దేశంలో పసిడి డిమాండ్ వార్షిక ప్రాతిపదికన 18 శాతం పెరిగి 248.3 టన్నులకు చేరుకుంది. విలువపరంగా డిమాండ్ 53 శాతం పెరిగి రూ.1,65,380 కోట్లుగా నమోదైనట్టు ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) వెల్లడించింది. అయితే కేంద్రం బంగారం దిగుమతిపై సుంకం తగ్గించడంతో స్వర్ణాభరణాల ధర గణనీయంగా తగ్గడం డిమాండ్ పునరుద్ధరణకు ప్రధానంగా దోహదపడిందని డబ్ల్యూజీసీ పేర్కొంది. గత ఏడాదిలో ఇదే కాలానికి గోల్డ్ డిమాండ్ 210.2 టన్నులుగా, విలువపరంగా రూ.1,07,700 కోట్లుగా నమోదైంది.

క్యూ4 ఆశావహమే

క్యూ3లో స్వర్ణాభరణాల విక్రయాలు 10 శాతం పెరిగి 171.6 టన్నులకు చేరాయి. మూడో త్రైమాసికంలో బంగారం డిమాండ్ ఇంత బలంగా ఉండడం 2015 తర్వాత ఇదే ప్రథమమని డబ్ల్యూజీసీ రీజినల్ సీఈఓ, ఇండియా సచిన్ జైన్ అన్నారు. ధనత్రయోదశి, పెళ్లిళ్ల సీజన్ కొనుగోళ్లతో నాలుగో త్రైమాసికంలోనూ డిమాండ్ బలంగానే ఉండనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

4 ఏళ్ల కనిష్ఠానికి వార్షిక డిమాండ్

పూర్తి ఏడాదికి డిమాండ్ 700-750 టన్నులకు పరిమితం కావచ్చని డబ్ల్యూజీసీ అంచనా. 2020 తర్వాత ఇదే కనిష్ఠ స్థాయి. 2023లో గోల్డ్ డిమాండ్ 761 టన్నులుంది.

పసిడిలో పెట్టుబడులు పెరిగాయ్..

ఈ క్యూ3లో పసిడిలో పెట్టుబడులు 41 శాతం పెరిగి 76.7 టన్నులుగా నమోదైంది. 2012 తర్వాత మూడో త్రైమాసికంలో నమోదైన అత్యధిక ఇన్వెస్ట్‌మెంట్ ఇదే.



ప్రథమార్ధంలో పసిడి దిగుమతులు 21% అప్

ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో పసిడి దిగుమతులు 21.78 శాతం పెరిగి 2,700 కోట్ల డాలర్లకు (రూ.2,26,800 కోట్లు) పెరిగాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. మూడో త్రైమాసికంలో పసిడి దిగుమతి 87% పెరిగి 360.2 టన్నులకు చేరింది.

రూ.82,000 దాటిన బంగారం

దేశీయంగా బంగారం ధర సరికొత్త ఆల్‌టైం రికార్డు గరిష్ఠానికి పెరిగింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర మరో రూ.1,000 పెరిగి రూ.82,400కు చేరుకుంది. కిలో వెండి సైతం రూ.1,300 పెరుగుదలతో రూ.1.01 లక్షలకు ఎగబాకింది. ధనత్రయోదశి, దీపావళి కొనుగోళ్ల డిమాండ్‌తోపాటు అంతర్జాతీయంగా వీటి ధరలు గణనీయంగా పెరగడం ఇందుకు ప్రధాన కారణం.

2,800 డాలర్లకు ఔన్స్

ఇంటర్నేషనల్ మార్కెట్లోనూ బంగారం సరికొత్త జీవనకాల గరిష్ఠానికి ఎగబాకింది. ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం తొలిసారిగా 2,800 డాలర్లకు చేరగా.. వెండి 34.45 డాలర్ల స్థాయిలో ట్రేడయింది.

యూకే నుంచి భారత్‌కు లక్ష కిలోల బంగారం

న్యూఢిల్లీ, అక్టోబరు 30: ధనత్రయోదశి రోజు బంగారం కొంటే మంచిదని చాలామంది భావిస్తారు! తమకు ఉన్నంతలో ఎంతో కొంత వెచ్చించి పసిడి కొనుగోలు చేస్తారు! ఆర్బీఐకి అలాంటి సెంటిమెంటు ఉందో లేదో తెలియదుగానీ.. ధనత్రయోదశి తిథి ఉన్న అక్టోబరు 29న లండన్‌లోని 'బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్' నుంచి ఏకంగా 102 టన్నుల బంగారం తెప్పించింది! అంటే అక్షరాలా ఒక లక్షా రెండువేల కిలోల బంగారం!! ఆ బంగారాన్ని మన దేశంలోని అత్యంత సురక్షితమైన నిల్వ కేంద్రాల్లో భద్రపరిచింది. ఆర్బీఐ తాజా గణాంకాల ప్రకారం.. సెప్టెంబరు నెలాఖరునాటికి ఆర్బీఐ వద్ద ఉన్న బంగారం నిల్వలు 855 టన్నులు. అందులో 510.5 టన్నుల బంగారం మనదేశంలోని స్టోరేజీ కేంద్రాల్లోనే ఉంది. మరో 324 టన్నుల బంగారం ఇంకా బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్, బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్‌మెంట్స్ వద్దే ఉంచింది (ఈ రెండు బ్యాంకులూ యూకేలోనే ఉన్నాయి). ఇంకో 20 టన్నుల బంగారాన్ని గోల్డ్ డిపాజిట్ పథకాల ద్వారా నిర్వహిస్తోంది. ఒకవైపు రష్యా-ఉక్రెయిన్ యుద్ధం.. మరోవైపు ఇజ్రాయెల్-పాలస్తీనా మధ్య సంఘర్షణ.. ఇజ్రాయెల్-ఇరాన్ నడుమ పెరుగుతున్న ఘర్షణ వాతావరణం.. ఇలా అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో విదేశాల్లో ఉన్న మన బంగారాన్ని ఆర్బీఐ కొన్నాళ్లుగా భారత్‌కు తీసుకొచ్చేస్తోంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	81,160 ▲	74,400 ▲	1,09,000 ▲
ముంబై	79,580 ▲	72,900 ▲	98,040 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



31వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	555
వరంగల్	537	గోదావరి	550
చిత్తూరు	593	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ.	78

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115	విజయవాడ	115
వరంగల్	115	గుంటూరు	118
కరీంనగర్	115	ఒంగోలు	118
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	129
కర్నూలు	115	నెల్లూరు	129
విశాఖపట్నం	107	అనంతపురం	129
గోదావరి	115		

అదానీలకు సెబీ షోకాజ్ నోటీసులు

న్యూఢిల్లీ: గౌతమ్ అదానీ, ఆయన సోదరులు రాజేశ్, వసంత్ అదానీలకు సెబీ ఈ మధ్యనే షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఓ ఆంగ్ల మీడియా కథనం ఈ విషయాన్ని వెల్లడించింది. అలాగే, ప్రణవ్ అదానీ, ప్రణవ్ వోరా ఇంకా అదానీ గ్రూప్‌తో సంబంధం ఉన్న ధర్మేశ్ పరేఖ్, ఓపల్ ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్, గల్ఫ్ ఏషియా ట్రేడ్, ఎమర్జింగ్ ఇండియా ఫోకస్ ఫండ్, బెర్ముడా కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఫండ్ గ్లోబల్ మాక్రో అసెట్ మేనేజ్‌మెంట్ కూడా సెబీ నుంచి నోటీసులు అందుకున్నట్లు కథనం పేర్కొంది. మొత్తంగా అదానీ గ్రూప్‌తో సంబంధం ఉన్న 32 సంస్థలు, 4 లిస్టెడ్ కంపెనీలకు సెక్యూరిటీల చట్టంలోని సెక్షన్ 11, 11బీ ప్రకారంగా సెబీ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది.

లాభాల స్వీకారంతో కుంగిన మార్కెట్

ముంబై: బుధవారం ఈక్విటీ మార్కెట్ లాభాల స్వీకారంతో కుంగిపోయింది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగాల షేర్లలో అమ్మకాలు జోరుగా సాగాయి. కార్పొరేట్ ఫలితాలు నిరాశావహంగా ఉండడం, విదేశీ నిధులు తరలిపోవడం సెంటిమెంట్‌ను దెబ్బ తీశాయి. ఫలితంగా సెన్సెక్స్ 426.85 పాయింట్లు నష్టపోయి 79942.18 వద్ద ముగియగా నిఫ్టీ 126 పాయింట్లు నష్టపోయి 24340.85 వద్ద ముగిసింది. స్టాక్ ఎక్స్ఛేంజిల వద్ద ఉన్న గణాంకాల ప్రకారం మంగళవారం విదేశీ ఇన్వెస్టర్లు రూ.548.69 కోట్ల విలువ గల షేర్లు విక్రయించారు. అయితే ఎఫ్ఐఐల అమ్మకాల జోరు తగ్గడం ఒక సానుకూలాంశమని పరిశీలకులంటున్నారు. "భారత షేర్లు అమ్ము, చైనా షేర్లు కొను" అనే వైఖరి ముగింపు దశకు వచ్చిందనేందుకు ఇది సంకేతమన్నది వారి అభిప్రాయం. దీనికి తోడు దేశీయ సంస్థలు, రిటైల్ ఇన్వెస్టర్ల నిధులు జోడై సమీప భవిష్యత్తులో మార్కెట్ ఉత్తేజం పొందవచ్చునని వారంటున్నారు.

అదానీ షేర్లు జూమ్: అదానీ గ్రూప్ షేర్ల మార్కెట్ విలువ ఈ వారంలో రూ.39,000 కోట్లు పెరిగి రూ.15.5 లక్షల కోట్లకు చేరింది. గ్రూప్‌లోని 10 లిస్టెడ్ కంపెనీల్లో 9 కంపెనీల మార్కెట్ విలువ గత మూడు రోజుల్లో గణనీయంగా పెరిగింది. రూ.23,268 కోట్ల విలువతో అదానీ ఎంటర్‌ప్రైజెస్ అగ్రగామిగా నిలవగా అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ రూ.9,440 కోట్లతో రెండో స్థానంలో ఉంది. గ్రూప్‌లో ఒక్క అదానీ పవర్ లిమిటెడ్ మాత్రమే నష్టపోయింది.

'పారిస్' క్వార్టర్స్‌కు బోపన్న జోడీ

పారిస్: టెన్నిస్ డబుల్స్ స్టార్ రోహన్ బోపన్న పారిస్ మాస్టర్స్ ఏటీపీ 1000 ఈవెంట్‌లో టైటిల్ దిశగా దూసుకెళ్తున్నాడు. ఆస్ట్రేలియాకు చెందిన మాథ్యూ ఎబ్డెన్‌తో కలిసి డబుల్స్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు చేరాడు. ప్రీక్వార్టర్‌ఫైనల్లో మూడోసీడ్ బోపన్న-మాథ్యూ జోడీ 6-4, 7-6 (7-5)తో మార్సెలో మెలో (బ్రెజిల్)-అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) జంటపై విజయం సాధించింది.

నితీశ్, ఈశ్వరన్‌పై దృష్టి

భారత్, ఆసీస్ 'ఎ' జట్ల మ్యాచ్ నేటినుంచి



నితీశ్

మాకే (ఆస్ట్రేలియా): భారత్ 'ఎ' జట్టు ఆస్ట్రేలియా పర్యటనకు సిద్ధమైంది. ఇందులో భాగంగా ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో గురువారం నుంచి జరిగే నాలుగు రోజుల మ్యాచ్‌లో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో.. తెలుగు ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి, బ్యాటర్ అభిమన్యు ఈశ్వరన్, పేసర్ ప్రసిద్ధ్ కృష్ణపై ప్రధానం దృష్టి నిలిచింది. ఈ ముగ్గురు ఆస్ట్రేలియాతో జరిగే బోర్డర్-గవాస్కర్ టెస్ట్ సిరీస్‌కు ఎంపికైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా పిచ్‌లు, ఇక్కడి పరిస్థితుల్లో నితీశ్, ఈశ్వరన్, ప్రసిద్ధ్ ఎలా రాణిస్తారన్నది ఆసక్తికరం కానుంది. కంగారూలతో టెస్టులకు ఒకవేళ రోహిత్ దూరమైతే.. ఈశ్వరన్‌ను ఓపెనర్‌గా పంపాలని జట్టు మేనేజ్‌మెంట్ యోచిస్తోంది. ఇక, పేస్ ఆల్‌రౌండర్ నితీశ్ సెలెక్టర్లు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఉవ్విళ్లూరుతున్నాడు. ప్రసిద్ధ్ ఈ మ్యాచ్‌లో రాణిస్తే..టెస్ట్ సిరీస్‌కు బుమ్రా, సిరాజ్‌తో పాటు మూడో పేసర్‌గా అతడిని ఆడించవచ్చు. ఆంధ్రకు చెందిన రికీ భుయ్ కూడా జట్టులో చోటు దక్కించుకున్నాడు. కెప్టెన్ రుతురాజ్, టాప్, మిడిలార్డర్ బ్యాటర్లు సాయి సుదర్శన్, పడిక్కళ్, పేసర్ యశ్ దయాల్, నవ్‌దీప్ సైనీ కూడా సత్తా చాటాలనుకుంటున్నారు.

ప్రీక్వార్టర్స్‌కు ఆయుష్, సతీశ్

సార్‌బ్రకెన్ (జర్మనీ): భారత షట్లర్లు ఆయుష్ శెట్టి, సతీశ్ కుమార్ కరుణాకరన్ హైలో ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ప్రీక్వార్టర్స్ చేరారు. బుధవారం జరిగిన సింగిల్స్ తొలి రౌండ్లో ఆయుష్ 21-12, 21-17తో జోకిమ్ (ఫిన్లాండ్)పై, సతీశ్ 20-22, 24-22, 21-17తో భారత్‌కే చెందిన చిరాగ్ సేన్‌పై గెలుపొందారు.

పరువు కోసం పోరాటం

ఒత్తిడిలో రోహిత్ సేన

- న్యూజిలాండ్‌కు భలే చాన్స్
- రేపటి నుంచి మూడో టెస్ట్



జైస్వాల్‌తో కోహ్లి సరదా

ఉదయం 9.30 నుంచి జియో సినిమాలో..

ముంబై: పుష్కరం తర్వాత సొంతగడ్డపై టెస్ట్ సిరీస్ చేజార్చుకొన్న భారత్.. కనీసం పరువు దక్కించుకోవాలనుకొంటోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం నుంచి వాంఖడేలో న్యూజిలాండ్‌తో జరిగే ఆఖరి, మూడో టెస్ట్‌లో విజయమే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. మరోవైపు మూడు టెస్ట్‌ల సిరీస్‌లో 2-0 ఆధిక్యంలో నిలిచిన కివీస్ వైట్‌వాష్‌తో సరికొత్త రికార్డు నెలకొల్పాలన్న ఆరాటంతో ఉంది. బెంగళూరు, పుణె టెస్టుల్లో టీమిండియా ఓటమికి ప్రధాన కారణం బ్యాటింగ్ వైఫల్యమే. గతంలో కూడా మన బ్యాటర్లు స్పిన్‌ను ఎదుర్కోవడంలో తడబడుతున్నా.. అశ్విన్, జడేజా తమ స్పిన్ మాయాజాలంతో ఆ లోటు కనిపించకుండా చేసేవారు. కానీ, కివీస్‌పై వీరిద్దరూ పెద్దగా ప్రభావం చూపలేకపోవడంతో.. బ్యాటింగ్ ఆర్డర్ బలహీనతలు బహిర్గతమయ్యాయి. సీనియర్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆటతీరు తీవ్ర విమర్శలకు గురవుతోంది. స్పిన్‌ను ఎదుర్కోవాలంటే చక్కని ఫుట్‌వర్క్ అవసరం. కానీ, రోహిత్ క్రీజులో చురుగ్గా కదల్లేకపోతున్నాడు. ఆడిన నాలుగు ఇన్నింగ్స్‌లో 2, 52, 0, 8 పరుగులు చేసిన హిట్‌మ్యాన్.. మూడుసార్లు బౌల్డ్ అయ్యాడు. దీంతో అతడి వయసుపై చర్చ మొదలైంది. రోహిత్ కెప్టెన్సీని కూడా సీనియర్లు తప్పుబడుతున్నారు. ప్రత్యర్థిపై వ్యూహాత్మకంగా ఒత్తిడి పెంచలేదని విమర్శిస్తున్నారు. కోహ్లీ కూడా పెద్దగా రాణించలేదు. ఒక్క అర్ధ శతకం మినహా మూడుసార్లు 0, 1, 17 పరుగులు మాత్రమే చేశాడు. దీంతో వీరిద్దరూ జట్టుకు భారంగా మారారంటూ సోషల్ మీడియాలో విమర్శలు మొదలయ్యాయి. ఓపెనర్ యశస్వీ జైస్వాల్ పర్వాలేదనిపించినా.. పంత్, జడేజా, అశ్విన్ పెద్ద స్కోర్లు చేయకపోవడం జట్టును ఆందోళనకు గురి చేస్తోంది. సర్ఫరాజ్ ఒక్క ఇన్నింగ్స్‌తో మురిపించినా.. మెలికలు తిరిగే వికెట్‌పై బోల్తాపడుతున్నాడు. ఇక, బౌలింగ్‌లో జట్టు ఎంతగానో ఆధారపడిన ఆఫ్ స్పిన్నర్లు జడేజా, అశ్విన్ తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేశారు. బుమ్రా కూడా తనదైన మార్క్ వేయలేకపోయినా.. కుల్దీప్ స్థానంలో జట్టులోకి వచ్చిన వాషింగ్టన్ సుందర్ సత్తా చాటాడు. కాగా, ముంబై టెస్ట్‌కు పేసర్ ఆకాశ్‌దీప్ స్థానంలో హర్షిత్ రాణాను బరిలోకి దించే అవకాశం ఉంది.



లాథమ్

జట్లు (అంచనా)

భారత్: రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, కోహ్లి, రిషభ్ పంత్, సర్ఫరాజ్, జడేజా, అశ్విన్, వాషింగ్టన్ సుందర్, ఆకాశ్ దీప్/రాణా, బుమ్రా.

న్యూజిలాండ్: లాథమ్ (కెప్టెన్), కాన్వే, యంగ్, రచిన్, మిచెల్, బ్లండెల్ (కీపర్), ఫిలిప్స్, శాంట్నర్, సౌథీ, ఎజాజ్ పటేల్, ఓరోర్క్.

ఊడ్చేయాలని...

చరిత్ర సృష్టించిన న్యూజిలాండ్ ఆత్మవిశ్వాసంతో తొణికిసలాడుతోంది. మూడో టెస్టును కూడా గెలిచి క్లీన్‌స్వీప్ చేసి వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్ అవకాశాలను మెరుగుపర్చుకోవాలనుకొంటోంది. ఎంతో అనుభవం ఉన్న కేన్ విలియమ్సన్ సిరీస్‌కే దూరమైనా.. అలవోకగా గెలిచారు. రచిన్ రవీంద్ర, కాన్వే, యంగ్, కెప్టెన్ లాథమ్‌తో బ్యాటింగ్ బలంగా కనిపిస్తోంది. పుణె టెస్టులో శాంట్నర్ తన స్పిన్ మాయాజాలంతో మ్యాచ్‌ను శాసించాడు. అతడి నుంచి జట్టు మరోసారి అదే తరహా ప్రదర్శనను ఆశిస్తోంది. ఎజాజ్ పటేల్, ఫిలిప్స్‌తోపాటు పేసర్ ఓరోర్క్ కూడా చక్కని సహకారం అందిస్తున్నాడు. మొత్తంగా చూస్తే వరుస ఓటములతో రగిలిపోతున్న భారత్.. ఈ మ్యాచ్‌లో విరుచుకుపడే చాన్సుంది. కానీ, అదను చూసి దెబ్బతీయడానికి కివీస్ వ్యూహాలు రచిస్తోంది.

మళ్లీ స్పిన్ వికెట్

మూడో టెస్టుకు కూడా స్పిన్ వికెట్‌నే తయారు చేస్తున్నట్టు సమాచారం. టీమిండియా మేనేజ్‌మెంట్ కూడా కొన్ని సూచనలు చేసినట్టు తెలుస్తోంది. వాంఖడే ఎర్రమట్టి పిచ్ స్పిన్‌కు అనుకూలం. గత రెండు టెస్టుల్లో మెలికలు తిరిగే వికెట్‌పై తడబడినా.. మళ్లీ అదే తరహా వ్యూహాన్నే టీమిండియా అనుసరించనుందట. ఈ నేపథ్యంలో టాస్ కీలకం కానుంది.

35 మంది నెట్ బౌలర్లతో

కివీస్ స్పిన్నర్లను సమర్థంగా ఎదుర్కోవడానికి భారత జట్టు ముమ్మరంగా సాధన చేసింది. ముఖ్యంగా మూడో టెస్ట్‌కు కూడా మెలికలు తిరిగే పిచ్‌నే తయారు చేస్తారన్న వార్తలు వస్తుండడంతో.. ఆ దిశగా దృష్టి సారించింది. న్యూజిలాండ్ స్పిన్నర్ శాంట్నర్ భారత బ్యాటర్లను తీవ్రంగా ఇబ్బందిపెట్టాడు. ఈ నేపథ్యంలో మొత్తంగా 35 మంది నెట్ బౌలర్లతో మనోళ్లకు బంతులేయించారు. వీరిలో ఎక్కువ మంది స్పిన్నర్లే. బుధవారం జరిగిన నెట్ సెషన్‌లో భారత ఆటగాళ్లందరూ తీవ్రంగా శ్రమించారు. కోహ్లి పూర్తిగా షాట్లు ఆడుతూ కనిపించాడు. క్రీజు వైట్‌లైన్లను ప్రత్యేకంగా పొడిగించి.. వేర్వేరు చోట్ల బంతులేస్తూ బ్యాటర్లను పరీక్షించారు. వికెట్‌పై ఉదయం పచ్చిక కనిపించినా.. తేమను బయటకు తీసేందుకు బరువైన రోలర్‌తో చదును చేశారు. అయితే, సాయంత్రానికి పిచ్‌పై కొద్దిగా నీళ్లు చల్లి మళ్లీ తేలికైన రోలర్‌తో చదును చేశారు.

స్వదేశంలో చివరిసారి 2000లో దక్షిణాఫ్రికా చేతిలో భారత్ 0-2తో వైట్‌వాష్‌కు గురైంది.

మళ్లీ ఆర్సీబీ కెప్టెన్ విరాట్?

బెంగళూరు: వచ్చే ఐపీఎల్ సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) సారథ్య బాధ్యతలను మళ్లీ విరాట్ కోహ్లీ చేపట్టే అవకాశముంది. మొదటిసారిగా 2013లో ఆర్సీబీ జట్టు పగ్గాలు స్వీకరించిన విరాట్.. 2021లో కెప్టెన్సీ నుంచి వైదొలిగాడు. అప్పటినుంచి డుప్లెసి జట్టు సారథిగా వ్యవహరిస్తున్నాడు. అయితే, ఈసారి డుప్లెసిని వదులుకోవాలని జట్టు మేనేజ్‌మెంట్ భావిస్తోంది. కెప్టెన్సీ బాధ్యతలను కొత్త ఆటగాడికి అప్పగించాలని నిర్ణయించుకుంది. ఇందులో భాగంగానే గుజరాత్ టైటాన్స్‌కు చెందిన శుభ్‌మన్ గిల్‌ను ఆర్సీబీకి రప్పించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. కానీ, గిల్ మాత్రం తన పాత ఫ్రాంచైజీతోనే ఉండాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. దీంతో మళ్లీ కోహ్లీకే సారథ్యాన్ని అప్పగించాలని మేనేజ్‌మెంట్ నిర్ణయించుకున్నట్టు సమాచారం.

టాప్‌లో రబాడ

మూడో స్థానానికి బుమ్రా




దుబాయ్: ఐసీసీ టెస్ట్ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో భారత పేసర్ బుమ్రా మూడో స్థానానికి దిగజారాడు. బుధవారం ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో దక్షిణాఫ్రికా బౌలర్ రబాడ.. బుమ్రా నుంచి టాప్ ర్యాంక్ దక్కించుకున్నాడు. ఆసీస్ పేసర్ హాజెల్‌వుడ్ రెండో స్థానానికి ఎగబాకాడు. వెటరన్ స్పిన్నర్ అశ్విన్ రెండు ర్యాంకులు తగ్గి నాలుగో స్థానంలో నిలిచాడు. భారత్‌తో రెండో టెస్ట్‌లో 13 వికెట్లు సాధించిన కివీస్ స్పిన్నర్ శాంట్నర్ ఏకంగా 20 ర్యాంకులు మెరుగుపరచుకొని 44వ స్థానం కైవసం చేసుకున్నాడు. బ్యాటింగ్ విభాగంలో పంత్ 11, కోహ్లి 14వ ర్యాంక్‌కు దిగజారారు. ఆల్‌రౌండర్లలో అశ్విన్, జడేజా తమ తొలి రెండు స్థానాలను నిలబెట్టుకొన్నారు.

హిజాబ్ ధరిస్తే నిషేధిస్తారా?

- ఫ్రాన్స్‌ను ఆక్షేపించిన యూఎన్

పారిస్: పారిస్ ఒలింపిక్స్‌లో అథ్లెట్లు హిజాబ్ ధరించకుండా ఫ్రాన్స్ ప్రభుత్వం నిషేధం విధించడాన్ని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కౌన్సిల్ తప్పుబట్టింది. అలాగే హిజాబ్ వేసుకొనే ఆటగాళ్లను బహిష్కరించాలని ఫ్రెంచ్ ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్ సంఘాలు నిర్ణయించడాన్ని కౌన్సిల్ తీవ్రంగా ఆక్షేపించింది. 'హిజాబ్ ధరించే ముస్లిం మహిళలు, బాలికలకు క్రీడా, సాంస్కృతిక రంగాలలో సమాన హక్కులు ఉండాలి. అలాగే ఫ్రెంచ్ సమాజంలో భాగమైన వారు..ఆ దేశానికి చెందిన అన్ని రంగాలలోనూ పాల్గొనే అవకాశం కల్పించాలి' అని కౌన్సిల్ స్పష్టంజేసింది. 26 ఏళ్ల ఫ్రాన్స్ స్ప్రింటర్ సౌంకంబ సిల్లా పారిస్ ఒలింపిక్స్‌కు ఎంపికైంది. కానీ ఆమె హిజాబ్ ధరించకుంటేనే ప్రారంభ కార్యక్రమంలో పాల్గొనేందుకు అనుమతిస్తామని ఫ్రెంచ్ ఒలింపిక్ కమిటీ నిబంధన విధించింది. దాంతో సిల్లా టోపీ ధరించి కార్యక్రమంలో పాల్గొంది. ఈ విషయంపై సోషల్ మీడియా ద్వారా సౌంకంబ అసహనం వ్యక్తంజేసింది.



మల్డర్ (105 నాటౌట్)

దక్షిణాఫ్రికా భారీస్కోరు

బంగ్లాతో రెండో టెస్ట్

చటోగ్రామ్ (బంగ్లాదేశ్): బంగ్లాదేశ్‌తో రెండో టెస్ట్‌లో దక్షిణాఫ్రికా పైచేయి సాధించింది. తొలి ఇన్నింగ్స్‌ను 575/6 స్కోరుతో డిక్లేర్ చేసిన సఫారీలు..ఆపై బంగ్లాదేశ్ మొదటి ఇన్నింగ్స్‌లో రెండోరోజు ఆఖరికి నాలుగు వికెట్లు పడగొట్టారు. 38/4తో తీవ్ర ఇక్కట్లలో కూరుకుపోయిన ఆతిథ్య జట్టు..ప్రత్యర్థి స్కోరుకు ఇంకా 537 పరుగుల వెనుకంజలో ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 307/2తో బుధవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా జట్టులో మల్డర్ (105 నాటౌట్) శతకంతో చెలరేగాడు.



అగ్రస్థానానికి తలైవాస్

హైదరాబాద్: ప్రొ.కబడ్డీ లీగ్ తాజా సీజన్‌లో తమిళ్ తలైవాస్ అగ్రస్థానానికి దూసుకొచ్చింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ 44-25తో గుజరాత్ జెయింట్స్‌ను చిత్తు చేసింది. తలైవాస్ జట్టులో నరేందర్ ఖండోలా 15 పాయింట్లతో చెలరేగగా.. సచిన్, సాహిల్ చెరో ఐదు పాయింట్లు సాధించారు. గుజరాత్ జట్టులో గుమాన్ సింగ్ (7) రాణించాడు. ఈ విజయంతో తలైవాస్ 37 పాయింట్లతో టేబుల్ టాపర్‌గా నిలిచింది. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 30-28తో యూపీ యోధాస్‌పై గెలిచింది.

అవినీతిపరులను అరెస్టు చేస్తే స్వాగతిస్తాం

» కేసీఆర్‌లాగే సీఎం రేవంత్ మూసీని అమ్ముకునే ప్రయత్నం చేస్తున్నారు: ఎంపీ రఘునందన్‌రావు



హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అవినీతిపరులను అరెస్టు చేస్తే బీజేపీ స్వాగతిస్తుందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. బీఆర్ఎస్ స్థానంలోకి బీజేపీ వెళ్లే ప్రసక్తేలేదని, బీఆర్ఎస్‌కు ప్రజలు సీ స్థానం ఇచ్చారని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని, ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారని చెప్పారు. కేసీఆర్ ఇక ఫాం హౌస్‌లకే పరిమితమవుతారని, కేటీఆర్ రేవ్ పార్టీలని తిరుగుతున్నారని విమర్శించారు. గ్రామ పంచాయతీల్లో విద్యుత్తు బిల్లులు చెల్లించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. గ్రామసభలు పెట్టకుండా కాంగ్రెస్ నాయకులు చెప్పిన వారినే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో చేరుస్తున్నారని ఆరోపించారు. దీనిపై కోర్టుకు వెళ్తామని చెప్పారు. రేవంత్ కూడా ఆంధ్రా కంపెనీలకే కాంట్రాక్టులు ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి వసూళ్లు జరుగుతున్నాయని, పాలన సక్రమంగా సాగడంలేదని ఆరోపించారు.

హైడ్రాకు మేం వ్యతిరేకం కాదు: కూనంనేని

కరీంనగర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మూసీ ప్రక్షాళనకు, హైడ్రాకు తాము వ్యతిరేకం కాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. అయితే వాటితో పేదలకు ఇబ్బందులు కలిగించవద్దని ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం కరీంనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మూసీకి దగ్గరలో ఒక అపార్ట్‌మెంట్ కట్టి పేదలకు భరోసా కల్పించాలని ప్రభుత్వానికి సూచించారు. మూసీ ప్రక్షాళన కోసం వేరే దేశాలు వెళ్లి అధ్యయనం చేయడం కాదని, ముందు ఇక్కడ అధ్యయనం చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తప్పులు చేస్తే తాము సూచనలు అందిస్తామని, అవసరమైతే పోరాటాలు చేస్తామని ఆయన చెప్పారు.

కులగణనపై బీజేపీ, బీఆర్ఎస్ వైఖరేంటి?: జాజుల

పంజాగుట్ట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం నవంబరు 6 నుంచి చేపట్టనున్న కులగణనపై బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తమ వైఖరిని స్పష్టం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. లేకుంటే బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వివిధ సంఘాల నాయకులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కులగణనకు మద్దతు కూడగట్టేందుకు నవంబరు 3న హైదరాబాద్‌లో అన్ని పార్టీలు, బీసీ, కుల సంఘాలు, మేధావులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని, అలాగే నవంబరు 6 నుంచి 15 రోజుల పాటు అలంపూర్ నుంచి ఆదిలాబాద్ వరకు రాష్ట్రవ్యాప్తంగా బీసీ కుల సామాజిక గణన యాత్రను చేపడుతున్నామని తెలిపారు. అనంతరం సంఘం జాతీయ అధికార ప్రతినిధిగా తీగల ప్రదీప్ గౌడ్, వివిధ జిల్లాల నూతన అధ్యక్షులకు నియామక పత్రాలను అందజేశారు.

చంద్రబాబుతో బీసీ నేతల భేటీ

2025లో జాతీయ జనాభా గణనలో బీసీ కుల గణన కూడా జరిగేలా ప్రధాని మోదీతో మాట్లాడి ఒప్పించాలని, ఇందుకు ప్రత్యేక చొరవ చూపాలని జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర్‌రావులు ఏపీ సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. ఏపీలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 34% పెంచాలని కోరారు. బుధవారం వారు అమరావతిలోని ఉండవల్లిలో 26 బీసీ సంఘాల ప్రతినిధులతో కలిసి చంద్రబాబుతో భేటీ అయ్యారు. అనంతరం ఏపీ వరద బాధితుల సహాయార్థం రూ.10 లక్షల చెక్కును అందజేశారు.

బీఆర్ఎస్‌ను తరిమేయడం ఖాయం

» ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో జనం బీఆర్ఎస్‌ను ఛీ కొట్టారని, భవిష్యత్తులో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఓడించి ఆ పార్టీ నాయకులను రాష్ట్రం నుంచి తరిమేయడం ఖాయమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఇప్పుడు ఎన్నికలు పెడితే 100 సీట్లు వస్తాయని మాజీ మంత్రి హరీశ్‌రావు కలలు కంటున్నారని బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. కేటీఆర్, ఆయన బావమరిది వాళ్ల ఫామ్‌హౌస్‌లో చేస్తున్న పాడు పనులను జనం చూస్తూనే ఉన్నారని పేర్కొన్నారు. మళ్లీ బీఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకువస్తే తెలంగాణ డ్రగ్స్‌కు అడ్డాగా మారుతుందని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి కుర్చీని టచ్ చేసే వాళ్లు పుట్టలేదని ఆయన అన్నారు.

కూల్చడాలు తప్ప చేసిందేమీ లేదు

» చిట్టినాయుడూ.. నువ్వా కేసీఆర్‌ను తుడిచేది?

» రేవంత్‌రెడ్డి లాంటి హౌలాకు భయపడం: కేటీఆర్

హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కట్టిందేమీ లేదు.. కూల్చడాలు తప్ప.. రేవంత్‌రెడ్డి పది నెలల పాలనలో ప్రజలకు ఇచ్చిన దానికన్నా.. వాళ్ల నుంచి లాక్కున్నదే ఎక్కువని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. నమ్మి నానబోస్తే పుచ్చులు చేతికొచ్చినట్లు ఆయన పాలన ఉందని బుధవారం ఎక్స్ వేదికగా ఆయన ఎద్దేవా చేశారు. రేవంత్ పదవుల కోసం పరితపిస్తున్నారని, నాడు.. కేసీఆర్ ఉన్నపదవిని తృణప్రాయంగా వదిలేశారని, ఉద్యమానికి తన ప్రాణాన్ని పణంగా పెట్టారన్నారు. అలాంటి కేసీఆర్‌పై నోటికొచ్చినట్లు మాట్లాడతావా అంటూ మండిపడ్డారు. కాగా, ఎన్నికల హామీలు అమలు చేయాలని వాట్సాప్‌లో ప్రశ్నించిన భాస్కర్ ముదిరాజ్‌పై మహబూబ్‌నగర్ సీఐ అప్పయ్య బెల్ట్‌తో కొట్టిన ఘటనపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం బాధితునితో హైదరాబాద్ నుంచి ఫోన్లో మాట్లాడిన ఆయన.. రేవంత్‌రెడ్డి లాంటి హౌలా వ్యక్తుల బెదిరింపులకు భయపడేది లేదన్నారు.

ఎడిటర్ల తయారీ ఫ్యాక్టరీ!

ఇక్కడ పనిచేసినవారు ఎంతో మంది సంపాదకులయ్యారు.. తెలుగు నాట మరే పత్రికకూ ఈ చరిత్ర లేదు



ఎడిటర్ కె.శ్రీనివాస్ దంపతులను సత్కరిస్తున్న ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ; చిత్రంలో ఈడీ వేమూరి ఆదిత్య, కాబోయే ఎడిటర్ రాహుల్ కుమార్, తదితరులు

» ఎడిటర్‌గా శ్రీనివాస్ సేవలు ఎనలేనివి

» వీడ్కోలు సభలో 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఎండీ వేమూరి రాధాకృష్ణ

» 1 నుంచి కొత్త ఎడిటర్‌గా రాహుల్ కుమార్

» రాధాకృష్ణ అండదండలతోనే స్థిమితమైన నిర్ణయాలు: కె.శ్రీనివాస్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): "ఆంధ్రజ్యోతి.. ఎడిటర్లను తయారు చేసే ఫ్యాక్టరీ. ఇక్కడ పనిచేసిన వారెంతో మంది సంపాదకులుగా ఎదిగారు. అందుకు అవసరమైన ప్రాతిపదికను మనం మాత్రమే తయారు చేయగలిగాం. ఎడిటర్లుగా ఎదగడానికి, తద్వారా సమాజం నుంచి పూర్తిస్థాయి గౌరవ మర్యాదలు దక్కడానికి అవసరమైన అవకాశాలు కల్పించాం. అది నాకు సంతృప్తిగా అనిపించింది. ఈ విధంగా ఆంధ్రజ్యోతి మాత్రమే చేయగలదు. తెలుగు నాట మరే పత్రికకూ ఈ చరిత్ర లేదు" అని 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఎండీ వేమూరి రాధాకృష్ణ అన్నారు. జూబ్లీహిల్స్‌లోని ఆంధ్రజ్యోతి ప్రధాన కార్యాలయంలో బుధవారం ఎడిటర్ కె.శ్రీనివాస్ వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ.. కె.శ్రీనివాస్‌తో తన అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. "ఆంధ్రజ్యోతిని తిరిగి ప్రారంభించాలనుకున్నప్పుడు నాకు నేనుగా వెళ్లి సంస్థలోకి ఆహ్వానించిన ఏకైక వ్యక్తి కె.శ్రీనివాస్. ఆయన ఎంత కాలం ఉండాలనుకుంటే, అంత కాలం ఉండొచ్చని చెప్పా. శ్రీనివాస్ 22ఏళ్ల పాటు ఒక సంస్థలో ఉండడం అరుదైన విషయం. ఆయనకు అలాంటి సంతృప్తి ఇవ్వగలిగినందుకు గర్వపడదాం. ఇంతకాలం కుటుంబంలో ఒకరిగా ఉంటూ, మంచిచెడులు చెప్పే వ్యక్తి దూరమవుతుంటే బాధగాఉంది" అని రాధాకృష్ణ చెప్పారు. శ్రీనివాస్ వివాదరహితుడు, మితభాషి అని, భాషపై ఆయనకున్న సాధికారతను ప్రశంసించారు. శ్రీనివాస్ మార్గనిర్దేశకత్వం ఇకపైనా కొనసాగాలని కోరారు. 'ఆంధ్రజ్యోతి' నూతన సంపాదకుడిగా రాహుల్‌కుమార్ నవంబరు1 నుంచి బాధ్యతలు స్వీకరిస్తారని ప్రకటించారు.

స్వేచ్ఛగా పనిచేసే అవకాశం ఇచ్చారు

కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. "నా 40 ఏళ్ల పాత్రికేయ జీవితంలో పాత ఆంధ్రజ్యోతితో ఆరేళ్ల అనుబంధం కలిపి మొత్తంగా 28 ఏళ్లు ఈ సంస్థతోనే ముడిపడి ఉంది. నేను ఇక్కడ ఇంతకాలం పనిచేయడానికి ప్రధాన కారణం రాధాకృష్ణ. స్వేచ్ఛగా పనిచేయడానికి, చెప్పాలనుకున్నది చెప్పడానికి అవకాశం కల్పించారు. ఆంధ్రజ్యోతి నుంచి నేను చాలా నేర్చుకున్నా" అని చెప్పారు. సిబ్బంది పట్ల రాధాకృష్ణ వైఖరి స్నేహపూర్వకంగా ఉంటుందని శ్లాఘించారు. రాధాకృష్ణ అండదండలతోనే తాను స్థిమితంగా నిర్ణయాలు తీసుకోగలిగానని చెప్పారు. విధి నిర్వహణలో తనకు తోడ్పడిన సహోద్యోగులందరికీ ధన్యవాదాలు తెలిపారు.

భావ గాంభీర్యతతో బరువెక్కుతాయి..

"కె.శ్రీనివాస్ రచనల్లో మార్పు కావాలన్న హడావుడి ఉంటుంది. మనిషిని మంచివైపు నడిపించాలన్న ఉద్వేగం ఉంటుంది. న్యాయం కోసం మనుషులు ఆందోళన పడాలనే తత్వం ఉంటుంది. చెడును ఖండించాలనే ఆగ్రహం ఉంటుంది. ఇవన్నీ చెప్పడానికి ఆయన వాక్యాలన్నీ భావ గాంభీర్యతతో బరువెక్కుతాయి" అంటూ రాహుల్‌కుమార్ ప్రశంసించారు. అసిస్టెంట్ ఎడిటర్ వక్కలంక రమణ మాట్లాడుతూ.. శ్రీనివాస్ కలం నుంచి జాలువారిన వాక్యాలు అద్భుతమైన అనుభూతి కలిగిస్తాయన్నారు. శ్రీనివాస్ లాంటి గొప్ప సంపాదకుడితో కలిసి ప్రయాణించామని గర్వంగా చెప్పుకొనే అవకాశం తమకు దక్కిందన్నారు. ఎండీ రాధాకృష్ణ, ఈడీ ఆదిత్య తదితరులు కె.శ్రీనివాస్, సుధ దంపతులను సత్కరించారు. యాజమాన్యం, సిబ్బంది జ్ఞాపికలను బహూకరించారు. తెలంగాణ నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్, రాయలసీమ రీజనల్ ఇన్‌చార్జి ఉమామహేశ్వరరావు, జర్నలిజం కళాశాల ప్రిన్సిపాల్ రాఘవేంద్రరావు, ఎడిటోరియల్ సిబ్బంది, ఉద్యోగులు శ్రీనివాస్‌కు వీడ్కోలు పలికారు.


రాహుల్ గాంధీ కాలంచెల్లిన మందా?

3సార్లు ఓడిన కాంగ్రెస్ ఖతం అయిందా?

నన్ను డీల్ చేయడం కాదు.. సీఎం పదవిని కాపాడుకోవాలి

నాకు క్రికెటొచ్చు.. రేవంత్ వికెట్ తీయడం పక్కా

సీఎం సవాల్‌కు నేను, కేటీఆర్ సిద్ధం: హరీశ్



హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉద్యమ నేత, మాజీ సీఎం కేసీఆర్ గురించి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అనుచితమని.. బీఆర్ఎస్ పార్టీని ఖతంచేయడం ఆయన వల్ల కాదని మాజీమంత్రి టి.హరీశ్ రావు అన్నారు. దేశంలో కాంగ్రెస్ మూడుసార్లు ఓడింది.. ఖతం అయిందా? ఒక్కసారి ఓడిపోతే కేసీఆర్‌ను కాలంచెల్లిన మందు అంటున్నావ్.. మూడుసార్లు ఓటమి చూసిన రాహుల్‌గాంధీ కాలంచెల్లిన మందు కాదా? అని ప్రశ్నించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. కేసీఆర్ లేకుంటే తెలంగాణ వచ్చేదేకాదని, తెలంగాణ లేకుంటే రేవంత్‌రెడ్డి సీఎం అయ్యేవాడా అని ప్రశ్నించారు. తెలంగాణ కోసం త్యాగానికి సిద్ధమైన కేసీఆర్‌కు.. ఉద్యమాన్ని పట్టించుకోని రేవంత్‌కు నక్కకూ నాగలోకానికి ఉన్నతేడా ఉందన్నారు. మూసీ అభివృద్ధి పేరిట కాంగ్రెస్ చేస్తున్న అవినీతి, అక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లినందుకే.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై రేవంత్‌రెడ్డి కుట్రపూరితంగా కేసుల్లో ఇరికించాలని చూస్తున్నారని ఆరోపించారు. హరీశ్‌ను ఎలా డీల్‌చేయాలో తనకు తెలుసంటూ సీఎం చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని.. తనను డీల్ చేయడం కాదు ఈ నాలుగేళ్లు ఆయన తన పదవిని కాపాడుకోవాలని సూచించారు. తాను ఫుట్‌బాల్ ఆడనని, క్రికెట్ ఆడతానని, వచ్చే ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి వికెట్ తీసేది తామేనని చెప్పారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే.. తమకు 100 సీట్లు ఖాయమని, వచ్చేది బీఆర్ఎస్.. సీఎం అయ్యేది కేసీఆరే.. అని జోస్యం చెప్పారు. హైడ్రా కూల్చివేతలు, అబద్ధాలు, అవినీతికి ఊతమిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి వరస తప్పిదాల కారణంగా.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని, మూసీ నుంచి వాడపల్లి వరకు పాదయాత్ర చేద్దామని సీఎం విసిరిన సవాల్‌కు తాను కేటీఆర్ సిద్ధమని.. ఎప్పుడు రావాలో చెబితే తాము వస్తామని, అయితే రేవంత్ సెక్యూరిటీ లేకుండా రావాలని డిమాండ్ చేశారు.

కొకైన్ ఎక్కడి నుంచి వచ్చింది?

(మొదటిపేజీ తరువాయి)

విషయం తెలిసిందే. పార్టీలో విజయ్ మద్దూరికి డ్రగ్స్ టెస్టు చేయగా.. ఆయన కొకైన్ తీసుకున్నట్లు నిర్ధారణ అయిన విషయం తెలిసిందే. ఆయనపై కేసు నమోదు చేశారు. అయితే, ఫామ్‌హౌజ్‌లోనే విజయ్‌ను అదుపులోకి తీసుకోవడానికి ముందు ఆయన ఫోన్‌ను పోలీసులు తీసుకున్నారు. కానీ, ఆ సమయంలో విజయ్ పక్కనే ఆయన భార్య ఉన్నారు. ఆమె తనకు తెలిసిన ఓ మహిళ మొబైల్‌ను విజయ్ ఫోన్ అని చెప్పి పోలీసులకు అందజేశారు. అనంతరం స్టేషన్ బెయిల్ ఇచ్చి విజయ్‌ను పంపేశారు. ఆ తర్వాత సదరు మహిళ వచ్చి తన ఫోన్ ఇవ్వాలంటూ పోలీసులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలోనే, విజయ్ మద్దూరి తమకు ఫోన్ ఇవ్వని విషయాన్ని ప్రస్తావించారు. ఆయన ఎక్కడ ఉన్నారు? ఆయన ఫోన్ ఎక్కడ ఉంది? అని ప్రశ్నించారు. ఆయన ఫోన్ విషయం తనకు తెలియదంటూనే ఫాంహౌజ్‌లో ఏమైనా పడిపోయిందేమోనని రాజ్ పాకాల సమాధానమిచ్చినట్లు తెలుస్తోంది. దాంతో, ఫోన్ వెతికేందుకు పోలీసులు మధ్యాహ్నం 3:11 గంటలకు రాజ్ పాకాలను ఆయన ఫాంహౌజ్‌కు తీసుకెళ్లారు. అక్కడ 4 బెడ్ రూముల్లో లాకర్లను తెరిపించి పరిశీలించారు. డిజిటల్ లాకర్లను కూడా తెరిపించి పరిశీలించారు. సుమారు గంటపాటు తనిఖీ చేసినా ఫోన్ దొరకలేదు. ఆయనను తిరిగి పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి రాత్రి 8.16 గంటల వరకూ మరోసారి విచారించారు. అవసరమైతే మరోసారి విచారణకు రావాలని చెప్పి.. స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారు. ఈ సందర్భంగా సుమారు 200 మంది పోలీసులతో బందోబస్తులో ఏర్పాటు చేశారు.

ఇంట్లో దావత్ చేసుకుంటే ఇంత రాద్ధాంతమా!?

కొత్త ఇంటిని నిర్మించుకుని బంధువులు, స్నేహితులతో దావత్ చేసుకుంటే రాద్ధాంతం చేస్తున్నారని రాజ్ పాకాల అన్నారు. దావత్‌కు తమ కుటుంబ సభ్యులు హాజరయ్యారని, అక్కడ జరిగింది రేవ్ పార్టీ, డ్రగ్స్ పార్టీ కాదని చెప్పారు. విజయ్ మద్దూరి ఎక్కడో డ్రగ్స్ తీసుకుని ఇక్కడ పరీక్షలో తేలితే తమకేం సంబంధమని ప్రశ్నించారు. విచారణలో తాను ఆయనకు డ్రగ్స్ ఇచ్చినట్లు చెప్పలేదన్నారు.

'రియల్' డబ్బు ఎటుపోతోంది..?

» 2 నెలలుగా తగ్గిన రిజిస్ట్రేషన్లు

» ఆ పెట్టుబడులు ఏ రంగానికి మళ్లుతున్నాయని అధికారుల ఆరా

హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వరుసగా రెండు నెలల నుంచి రిజిస్ట్రేషన్లు తగ్గుముఖం పట్టాయి. హైదరాబాద్ కేంద్రంగా భూలావాదేవీలు, ప్లాట్లు, ఫ్లాట్ల కొనుగోలు తగ్గింది. ప్రభుత్వ రాబడిపై ఆ ప్రభావం పడింది. ఈ నేపథ్యంలోనే రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు తగ్గడానికి కారణమేంటి..? ఇళ్లు, భవనాలు, ప్లాట్ల కొనుగోళ్లకు సంబంధించిన డబ్బు ఏ రంగంలో పెట్టుబడి పెడుతున్నారనే అంశాలపై బుధవారం సచివాలయంలో రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు సుదీర్ఘంగా చర్చించారు. వచ్చే సోమవారం (నవంబర్ 4న) దీనిపై సర్కారుకు ఒక ప్రజెంటేషన్ ఇచ్చేందుకు సన్నద్ధమవుతున్నారు. భూములు, ఇళ్ల కొనుగోలు తగ్గినందున ఆ డబ్బును బంగారం కొనుగోలుకు వెచ్చిస్తున్నారా.. లేక షేర్ మార్కెట్లలో పెడుతున్నారా.. మరేదైనా రంగంలో పెట్టుబడులు పెడుతున్నారా అనే అంశాలపై నిపుణులతో సంప్రదింపులు జరుపుతున్నారు. బంగారం, షేర్ మార్కెట్‌కు సంబంధించిన సంస్థలు, బ్రోకరేజ్ ఏజెన్సీలను సంప్రదించి.. గత 2 నెలల్లో తెలంగాణ నుంచి ఏ స్థాయిలో పెట్టుబడులు పెట్టారనే లెక్కలు తీస్తున్నారు. అలాగే ప్రముఖ బ్యాంకుల నుంచి ఎంత మేర లోన్లు ఇచ్చారనే అంశాలపైనా వివరాలు సేకరిస్తున్నారు. క్రెడాయ్, నారెడ్కో వంటి రియల్ ఎస్టేట్ ఫోరమ్స్ ప్రతినిధులతో మాట్లాడారు. స్థిరాస్తి రంగంలో తగ్గిన పెట్టుబడులు ఏ రంగంవైపు మళ్లుతున్నాయనే అంశాలపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని కోరినట్లు తెలిసింది.

మేం దానం చేసిన భూమిని..

రియల్టర్లకు కట్టబెట్టారు!

» మాజీ సీఎస్ సోమేశ్, ఐఏఎస్ నవీన్ మిట్టల్‌పై ఈడీకి ఫిర్యాదు

» భూముల కేసుల్లో తెరపైకి సీనియర్ ఐపీఎస్ అధికారి పేరు

» వెలుగులోకి వస్తున్న సబ్‌రిజిస్ట్రార్ జ్యోతి అవినీతి లీలలు

హైదరాబాద్, జీడిమెట్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భూ ఆక్రమణల బాధితులు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కార్యాలయానికి క్యూ కడుతున్నారు. రంగారెడ్డి జిల్లా మాజీ కలెక్టర్ అమోయ్ కుమార్ బాధితులు ఒక్కొక్కరుగా వచ్చి ఫిర్యాదు చేస్తుండగా.. తాజాగా మాజీ సీఎస్ సోమేశ్ కుమార్, సీనియర్ ఐఏఎస్ నవీన్ మిట్టల్‌పైనా ఫిర్యాదు రావడం సంచలనంగా మారింది. కొండాపూర్‌కు చెందిన రాఘవయ్య, సురేష్.. వీరిపై బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయంలో బుధవారం ఫిర్యాదు చేశారు. కొండాపూర్ మజీద్‌బండలోని సర్వే నంబర్ 104 నుంచి 108 వరకు తమ కుటుంబానికి భూమి ఉందని.. అందులో 88 ఎకరాలు బాలసాయి ట్రస్ట్‌కు దానం చేశామని.. అయితే ఆ భూమికి సంబంధించి రాత్రికి రాత్రే జీవో నంబర్ 45 జారీ చేసి బడా రియల్ ఎస్టేట్ సంస్థలకు సుమారు 42 ఎకరాలు కట్టబెట్టారని బాధితులు పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో అప్పటి సీఎస్ సోమేశ్ కుమార్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన అమోయ్ కుమార్‌తో పాటు సీనియర్ ఐఏఎస్ నవీన్ మిట్టల్ ప్రమేయం ఉందని ఆరోపించారు. విచారణ జరిపి అధికారుల ప్రమేయంపై నిజాలు నిగ్గుతేల్చాల్సిందిగా ఈడీకి ఇచ్చిన ఫిర్యాదులో కోరినట్టు బాధితులు తెలిపారు. ఇదిలా ఉండగా.. కీలక కమిషనరేట్‌కు సీపీగా విధులు నిర్వహించిన ఒక సీనియర్ ఐపీఎస్ అధికారి పేరు భూ వివాదంలో బయటకు రావడం సంచలనం సృష్టించింది. ఆ ఐపీఎస్ అధికార దుర్వినియోగానికి పాల్పడి బడా రియల్ వ్యాపారులకు సహకరించినట్లు బాధితులు గత మార్చిలో ఢిల్లీ ఈడీ అధికారులకు ఫిర్యాదు చేశారు. తాజాగా హైదరాబాద్ ఈడీ కార్యాలయంలో ఐఏఎస్‌లపై వరుస ఫిర్యాదుల నేపథ్యంలో ఇప్పుడు ఆ ఐపీఎస్ పేరు బయటకు వచ్చింది.

హరీశ్‌రావు బంధువునంటూ..

ఐదేళ్లపాటు కుత్బుల్లాపూర్ సబ్‌రిజిస్ట్రార్‌గా పని చేసిన జ్యోతి అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. మల్లంపేట్, పేట్‌బషీరాబాద్, ప్రగతినగర్, గాజులరామారం, సూరారం, జీడిమెట్ల ప్రాంతాల్లో పలు సర్వేనెంబర్లలోని భూములకు సంబంధించి నకిలీ డాక్యుమెంట్లతో ఆమె చేసిన అక్రమ రిజిస్ట్రేషన్ వివరాలు బయటపడుతున్నాయి. నాటి మంత్రి హరీశ్‌రావు తన బంధువని చెబుతూ.. జ్యోతి తమను బెదిరించినట్టు పలువురు ఇప్పుడు బయటకు వచ్చి గోడు వెళ్లబోసుకుంటున్నారు. కోర్టు వివాదాల్లో ఉన్న కేసుల్లోనూ ఆమె అక్రమ రిజిస్ట్రేషన్లు చేసినట్టు కొందరు బాధితులు పేర్కొంటున్నారు. ప్రధానంగా స్థానికంగా ఉన్న కొందరు ప్రజాప్రతినిధులు ఆడించిన విధంగా ఆమె నడుచుకున్నట్టు తెలుస్తుంది. పలు ప్రభుత్వ భూములను ప్రైవేట్ భూములుగా బైనెంబర్లు వేసి రిజిస్ట్రేషన్ చేసినట్టు కొందరు డాక్యుమెంట్లు చూపిస్తున్నాయి. నగర శివార్లలోని పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కొందరు మంత్రులు చెప్పినట్టు పనిచేసి.. బతికి ఉన్న వారిని కూడా మృతిచెందినట్టు రికార్డులు సృష్టించి తప్పుడు రిజిస్ట్రేషన్‌లు చేసి కోట్లు సంపాదించినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా.. కుత్బుల్లాపూర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలంలో డాక్యుమెంట్ రైటర్లు ప్రధానంగా చక్రం తిప్పుతున్నారు. సూరారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి, మరికొందరు డాక్యుమెంట్ రైటర్లు తాము చెప్పిందే వేదంగా నడిపిస్తున్నారు. జ్యోతి సబ్‌రిజిస్ట్రార్‌గా ఉన్నప్పుడు నకిలీ డాక్యుమెంట్లు తయారుచేసి రిజిస్ట్రేషన్‌లు చేయడంలో కొందరు డాక్యుమెంట్ రైటర్లే సూత్రదారులు.

భయపెట్టారు.. బెదిరించారు!

» తప్పు చేయలేదని వేడుకున్నా నాడు పోలీసులు వదల్లేదు: జెత్వానీ



అమరావతి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): 'భయపెట్టారు.. బెదిరించారు.. నేను చేసిన తప్పేంటో వివరంగా చెప్పరు.. ఫోన్లు, ల్యాప్‌టాప్ లాక్కొని ఏకాకిని చేశారు.. లాయర్‌తో మాట్లాడుకోవడానికి అవకాశం ఇవ్వరు.. ఖాళీ పేపర్లపై సంతకాలు పెట్టమని ఒత్తిడి చేశారు.. అందరూ మగ పోలీసులు చుట్టుముట్టి వేధించారు.. ఆడ పోలీసు చెంపపై కొట్టి జుట్టు పట్టుకు లాగారు.. ఆ భూమి గురించి నాకు తెలియదని ఎంత మొత్తుకున్నా వినలేదు.. నాలుగు రోజులు నరకం చూపించారు.. నలభై రోజులు జైల్లో పెట్టారు.. ఆ బాధ ఎప్పటికీ మరిచిపోలేను..' అని ముంబై సినీ నటి కాదంబరి జెత్వానీ సీఐడీ అధికారుల ముందు కన్నీటి పర్యంతమయ్యారు. వైపీఎస్ అధికారుల బాధితురాలు జెత్వానీ కేసులో సీఐడీ బుధవారం ఆమెను, ఆమె తల్లిదండ్రులను ఏపీలోని మంగళగిరిలోని తమ కార్యాలయానికి పిలిపించింది. వారి వాంగ్మూలాలను రికార్డు చేసింది. తాడేపల్లి ప్యాలెస్‌లో కుట్ర చేసి ముంబై నుంచి బలవంతంగా తమను బెజవాడకు తీసుకొచ్చి వేధించిన ఐపీఎస్ అధికారుల కర్కశత్వాన్ని వారు వివరించారు. వైసీపీ ప్రభుత్వ పెద్దలు, వైపీఎస్ అధికారులు మాఫియాగా వ్యవహరించిన ఈ కుట్ర వ్యవహారం గత ఏడాది డిసెంబరు చివరి వారంలో తాడేపల్లి ప్యాలెస్‌లో పురుడు పోసుకుంది. జెత్వానీపై భూ ఆక్రమణ కేసు నమోదు చేసి ఆమెను ముంబై నుంచి విజయవాడకు తీసుకొచ్చి.. తమకు కావలసిన పనిని పూర్తి చేసే కుట్రకు అప్పుడే బీజం పడింది. విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్లో వైసీపీ నాయకుడు కుక్కల విద్యాసాగర్‌తో తప్పుడు ఫిర్యాదు చేయించి ఈ ఏడాది ఫిబ్రవరి 2న కేసు నమోదు చేశారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడగానే తమకు జరిగిన అన్యాయాన్ని జెత్వానీ కుటుంబం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. ఆగస్టు చివరి వారంలో విజయవాడకు వచ్చి పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబుకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో నాటి నిఘా చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు, బెజవాడ సీపీ కాంతి రాణా, డీసీపీ విశాల్ గున్నీ పేర్లు ఉండడంతో వారిని ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఆ ముగ్గురితోపాటు ఏసీపీ హనుమంతరావు, అప్పటి ఇబ్రహీంపట్నం సీఐ ముత్యా ల సత్యనారాయణపై జెత్వానీ ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నంలో సెప్టెంబరు 14న కేసు నమోదైంది.

విద్యాసాగర్ ఎందుకు టార్గెట్ చేశాడు..?

జెత్వానీ చెప్పిన అంశాలను రికార్డు చేసిన సీఐడీ అధికారులు.. ఆమెను కొన్ని వివరాలు అడిగారు. 'మీపై పోలీసులకు ఫిర్యాదు చేసిన కుక్కల విద్యాసాగర్‌తో మీకున్న వైరం ఏంటి.. ఆయన్నుంచి మీకేమైనా వేధింపులు వచ్చాయా..? ఆయనకు మీపై అంత కోపమెందుకు?' అని ప్రశ్నించి.. కీలక సమాచారాన్ని రాబట్టారు.

తండ్రిని పట్టించుకోని కొడుక్కి తగిన శాస్తి!

» బాగోగులు చూడకపోవడంతో భూమి పట్టా రద్దు చేయాలని కోరిన వృద్ధ తండ్రి

» సీనియర్ సిటిజన్ యాక్టు అమలు చేసి, పట్టా రద్దు చేసిన రెవెన్యూ అధికారులు

» తిరిగి తండ్రి పేరిట పట్టా చేసిన వైనం

» హనుమకొండ జిల్లా ముస్తఫాపూర్‌లో ఘటన



రైస్‌మిల్లులో గుమాస్తాగా పనిచేస్తున్న రాజకొంరయ్య

భీమదేవరపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కన్న తండ్రి రాసిచ్చిన భూమిని తీసుకొని అనుభవిస్తున్నాడు. కానీ, వృద్ధుడైన తండ్రిని మాత్రం పట్టించుకోవడం లేదు. బాగోగులు చూసుకోవడం సంగతి దేవుడెరుగు.. తండ్రిపై చేయి కూడా చేసుకున్నాడా కొడుకు. పొట్టకూటి కోసం 75 ఏళ్ల వయసులో ఓ రైస్‌మిల్లులో గుమస్తాగా పనిచేస్తున్న ఆ తండ్రి.. తన కుమారుడికి ఇచ్చిన భూమి పట్టాను రద్దు చేయాలని రెవెన్యూ అధికారులను ఆశ్రయించాడు. స్పందించిన అధికారులు.. ఆ ప్రబుద్ధుడికి రాసిచ్చిన వ్యవసాయ భూమి పట్టాను రద్దు చేశారు. సీనియర్ సిటిజన్ యాక్ట్‌ను అమలు చేసి.. ఆ భూమిని తిరిగి తండ్రి పేరుపైనే పట్టా చేశారు. ఈ ఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముస్తఫాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మద్దెల రాజకొంరయ్య, మల్లమ్మ దంపతులకు ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్లు. అందరికీ పెళ్లిళ్లు చేశారు. ఆరేళ్ల క్రితం మల్లమ్మ మృతి చెందింది. అనంతరం 2018లో రాజకొంరయ్య తన కుమారుడు రవికి 707/2018 గిఫ్ట్ రిజిస్ట్రేషన్ ద్వారా 4.12 ఎకరాల భూమిని పట్టా చేశాడు. భార్య మరణించినప్పటి నుంచి రాజకొంరయ్య ఒంటరిగానే ఉంటున్నాడు. రిజిస్ట్రేషన్ జరిగిన కొన్ని రోజుల తర్వాత రవి తన తండ్రి బాగోగులను చూడడం మానేశాడు. ఈ విషయంపై పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీలు జరిగినా ఫలితం లేకపోయింది. పైగా ఒకటి రెండు సార్లు రవి తండ్రిని కొట్టాడు. దీంతో మానసికంగా కుంగిపోయిన రాజకొంరయ్య, తన కుమారుడికి ఇచ్చిన భూమి పట్టాను రద్దు చేయాలని భీమదేవరపల్లి తహసీల్దార్, హనుమకొండ ఆర్డీవో, ముల్కనూర్ పోలీస్ స్టేషన్లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. మళ్లీ తన కుటుంబ సభ్యులెవరైనా తనపై దాడి చేస్తారనే భయంతో ఆయన కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం పెద్దపాపయ్యపల్లిలోని ఓ రైస్‌మిల్లులో నైట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. హనుమకొండ ఆర్డీవో, భీమదేవరపల్లి తహసీల్దార్ వ్యవసాయ భూమిపై విచారణ చేపట్టారు. సీనియర్ సిటిజన్ యాక్టు అమలు చేసి, రవికి రిజిస్ట్రేషన్ చేసిన 4.12 ఎకరాల్లో 3.20 ఎకరాలను రద్దు చేశారు. తిరిగి ఆన్‌లైన్‌లో రాజకొంరయ్య పేరిట రిజిస్ట్రేషన్ చేసినట్లు తహసీల్దారు ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

అనాథ శరణాలయానికి రాసిస్తా: రాజకొంరయ్య

నా బాగోగులు నా పిల్లలు చూసుకోకపోతే భూమిని ఏదైనా అనాథ శరణాలయానికి రాసిస్తా. వృద్ధాప్యంలో తల్లిదండ్రుల బాగోగులు చూసే బాధ్యత కన్న కొడుకులపై ఉంటుంది. కానీ, నా బాగోగులు చూడకుండా, నాపై దాడి చేస్తున్నారు. 75 ఏళ్ల వయసులో రైస్‌మిల్లులో గుమస్తా, నైట్ వాచ్‌మెన్‌గా పనిచేయాల్సిన దుస్థితి నెలకొంది. నా పరిస్థితి ఏ తండ్రికీ రాకూడదు.

సాగర్‌ను పూర్తిగా మాకు అప్పగించండి

» కృష్ణాబోర్డును కోరనున్న తెలంగాణ

హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నిర్వహణ బాధ్యతలను తమకే అప్పగించాలని తెలంగాణ కోరనుంది. నవంబరు మూడో వారంలో బోర్డు సమావేశం నిర్వహించాలని కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) నిర్ణయించడంతో ఆ సమావేశంలో చర్చించే ఎజెండాను తెలంగాణ సిద్ధం చేస్తోంది. ఇప్పటికే ఎజెండాను పంపించాలని తెలుగు రాష్ట్రాలను బోర్డు కోరింది. ఇక గత ఏడాది నవంబరు 29న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ మరికొన్ని గంటల్లో ప్రారంభమవుతుందనగా.. సాగర్‌లో ఏపీవైపు ఉన్న గేట్లను జగన్ ప్రభుత్వం బలవంతంగా స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. తెలంగాణలో శాసనసభ ఎన్నికలను ప్రభావితం చేయడానికే ఈ చర్యకు ఉపక్రమించారని విమర్శలు కూడా వచ్చాయి. కేసీఆర్‌ను గెలిపించడానికి జగన్ ఈ ఎత్తుగడను ఎంచుకున్నారని పలువురు మండిపడ్డారు. ఆ తర్వాత నుంచి ఈ డ్యామ్ రక్షణ బాధ్యతను కేంద్ర బలగాలు(సీఆర్‌పీఎఫ్) చూస్తున్నాయి. ఇక ప్రాజెక్టు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనులు తెలంగాణయే చూస్తోంది. సాగర్‌కు ఏ పనులు చేయాలన్నా చీటికిమాటికి బోర్డును కోరడం ఇబ్బందికరంగా మారడంతో పూర్తిస్థాయి నిర్వహణ, రక్షణ బాధ్యతలు తమకు అప్పగించాలని బోర్డు సమావేశంలో తెలంగాణ కోరనుంది.

పదేళ్ల విధ్వంసపాలన చీకట్లు తొలగి.. ప్రజాపాలనలో తెలంగాణ వెలుగుతోంది!

- రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి దీపావళి శుభాకాంక్షలు
- కొత్త ఆలోచనలకు స్ఫూర్తి: గవర్నర్

హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. గత పదేళ్ల విధ్వంసకరమైన పాలన తాలూకు చీకట్లు తొలగిపోయాయని.. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రజా పాలనలో తెలంగాణ వెలుగులను విరజిమ్ముతోందని పేర్కొన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకొనే ఈ పండుగను రాష్ట్రంలోని ప్రజలంతా ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని పేర్కొన్నారు. దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి పండుగ మన చుట్టూ ఉన్న ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కొత్త ఆలోచనలను ప్రోత్సహిస్తుందని గవర్నర్ జిష్ణు దేవ్ శర్మ అన్నారు. ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తితో పండుగ రోజున స్థానిక ఉత్పత్తులనే కొనుగోలు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రజలకు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్టీసీ సమస్యలు పరిష్కరించాలి

- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి శ్రీధర్‌బాబుకు ఎస్‌డబ్ల్యూయూ ప్రతినిధుల వినతి

హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : సుదీర్ఘకాలంగా ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీజీఎస్ ఆర్టీసీఎస్‌డబ్ల్యూయూ(ఐఎన్‌టీయూసీ) ప్రతినిధి బృందం బుధవారం ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతిపత్రం సమర్పించింది. అలాగే కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరించిన పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును కలిసి ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని కోరుతూ విజ్ఞాపన పత్రాన్ని అందించినట్టు టీజీఎస్‌ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూయూ(ఐఎన్‌టీయూసీ) ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, అదనపు ప్రధాన కార్యదర్శి డి.గోపాల్, కార్యదర్శులు కేటీ.రెడ్డి, టీఎ.రెడ్డి తెలియజేశారు.ఈ సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు హామీ ఇచ్చినట్టు రాజిరెడ్డి తెలిపారు.


మలేషియాలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల పర్యటన

మలేషియా తరహాలో తెలంగాణలో పామాయిల్ బోర్డు!

- స్వయం సమృద్ధి సాధించటమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి తుమ్మల

హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగు, పామాయిల్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించిన మలేషియా తరహా విధానాలను తెలంగాణలో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు మలేషియాలో విజయవంతంగా నడుస్తున్న 'పామాయిల్ బోర్డు'ను తెలంగాణలో కూడా ఏర్పాటు చేయాలని, బోర్డుతోపాటు సీడ్ గార్డెన్లు, విత్తన మొలకల తయారీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. ఇటీవల మూడు రోజులపాటు మలేషియాలో పర్యటించిన ఆయన అక్కడ పామాయిల్ సాగు, విత్తనాభివృద్ధి, ప్రాసెసింగ్ యూనిట్లు, యాంత్రీకరణను పరిశీలించారు. రాష్ట్రంలో పామాయిల్ ఉత్పత్తి, స్వయం సమృద్ధికి మలేషియా తరహా విధివిధానాలు అమలుచేస్తామని బుధవారం వెల్లడించారు. మలేషియాలో అధ్యయనం అనంతరం పలు కీలక నిర్ణయాలు తీసుకోవటంతోపాటు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. ఇందులో కీలకమైనది 'పామాయిల్ బోర్డు'. మలేషియాలో ఉన్న ఎంపీవోబీ(మలేషియా పామాయిల్ బోర్డు) తరహాలో "తెలంగాణ పామాయిల్ బోర్డు"(టీజీపీవోబీ) ఏర్పాటుచేస్తామని తుమ్మల తెలిపారు. మలేషియాలో ఉన్న 'ఎఫ్‌జీవీ'(ఫెల్డా గ్లోబల్ వెంచర్స్) తరహాలో రాష్ట్రంలో కూడా సీడ్ గార్డెన్, విత్తన మొలకల తయారీ యూనిట్లను ఏర్పాటు చేసి... రాష్ట్రానికి పామాయిల్ విత్తన మొలకలను తక్కువ ఖర్చు, ఎక్కువ నాణ్యతతో ఇక్కడే తయారుచేసి, రైతులకు సరఫరా చేస్తామని తుమ్మల వెల్లడించారు. ఈమేరకు ఎఫ్‌జీవి అధికారులు కూడా రాష్ట్రంలో నాణ్యమైన మొలకల ఉత్పత్తి, ఆయిల్‌పామ్ విత్తన తోటల స్థాపనకు సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు తుమ్మల స్పష్టంచేశారు. ఉత్పత్తి యూనిట్లు ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో ఉన్న కర్మాగారాల సామర్థ్యం పెంచి, ముడి పామాయిల్ ఉత్పత్తి, రిఫైనరీ, మార్కెటింగ్ చేసి... రైతులకు టన్నుకు రూ. 20 వేలు ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సచివాలయం సర్క్యులేటింగ్ అధికారుల బదిలీ

హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): డా.బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో పనిచేస్తున్న సర్క్యులేటింగ్ అధికారులను బదిలీ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సచివాలయ అధికారుల బదిలీలు జరగడం ఇదే తొలిసారి. ఒకే శాఖలో నాలుగేళ్ల సర్వీసు పూర్తయిన వారిని బదిలీ చేశారు. ఏడుగురు అదనపు కార్యదర్శులు, ఏడుగురు సంయుక్త కార్యదర్శులు, 12 మంది డిప్యూటీ సెక్రటరీలను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులిచ్చారు.

వ్యవసాయ వర్సిటీలో కొత్తగా విత్తన విభాగం

రాజేంద్రనగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీలో కొత్తగా విత్తన విభాగాన్ని ఏర్పాటు చేసి, దానికి ఒక సంచాలక స్థాయి అధికారిని నియమించి, రాష్ట్రంలో విత్తన నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయాలని వర్సిటీ పాలకమండలి తీర్మానం చేసింది. బుధవారం వర్సిటీ పరిపాలన భవనంలో వీసీ జానయ్య అధ్యక్షతన పాలక మండలి భేటీ జరిగింది. రాష్ట్రంలో ఉన్న ప్రతి రెవెన్యూ గ్రామంలో కనీసం 5-10మంది అభ్యుదయ రైతులకు వ్యవసాయ వర్సిటీ అభివృద్ధి చేసే నాణ్యమైన విత్తనాలను ప్రతీ ఏడాది సరఫరా చేయాలని నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు, వర్సిటీలో వివిధ విభాగాధిపతుల(హెచ్‌వోడీ) పదవీ కాలాన్ని మూడేళ్లుగా నిర్ణయించారు. ప్రతి మూడేళ్లకొకసారి రొటేషన్ విధానంలో సీనియారిటీ ఆధారంగా విభాగాధిపతులను నియమించాలని పాలకమండలి నిర్ణయం తీసుకుంది. కాగా, వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని స్థాపించి 60 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా డిసెంబరులో వర్సిటీ వజ్రోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం, రైతుల భాగస్వామ్యంతో నిర్వహించాలని పాలక మండలి నిర్ణయించింది.

ఈఆర్సీ ఛైర్మన్‌గా జస్టిస్ దేవరాజు ప్రమాణ స్వీకారం

హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి(టీజీఈఆర్సీ) ఛైర్మన్‌గా డాక్టర్ జస్టిస్ దేవరాజు నాగార్జున్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈఆర్సీ కార్యాలయంలో ఆయన చేత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ప్రమాణస్వీకారం చేయించారు. ఆ బాధ్యతను అడ్మినిస్ట్రేటర్ ఆఫ్ ఓత్‌గా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి కట్టబెడుతూ మంగళవారం సాయంత్రం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నిర్ణయం తీసుకున్న విషయం విదితమే. ఈఆర్సీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం జస్టిస్ దేవరాజు నాగార్జున్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారుల ప్రయోజనాలను కాపాడటానికి ప్రయత్నిస్తానని చెప్పారు.

న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో.. కాన్‌స్టిట్యూషన్ క్లబ్ నిర్మాణం

హైదరాబాద్ ఆదర్శనగర్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో శాసనసభ, శాసనమండలి సభ్యుల సౌకర్యార్థం కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌ను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై స్పీకర్ ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన ఆయన చాంబర్లో బుధవారం సమావేశం జరిగింది. ఇందులో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, మండలి డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్, రోడ్లు, భవనాలశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ క్లబ్ నిర్మాణానికి సంబంధించిన డిజైన్‌లు త్వరితగతిన రూపొందించాలని భట్టివిక్రమార్క, ప్రసాద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. అలాగే రాజస్థాన్, ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌ల పనితీరును పరిశీలించి రిపోర్టు తయారు చేయాలని అసెంబ్లీ కార్యదర్శికి సూచించారు.

బీసీల లెక్కలు తీసేందుకు డెడికేటెడ్ కమిషన్‌ను నియమించండి

- స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల అమలుకు ప్రత్యేక కమిషన్ తప్పనిసరి: హైకోర్టు



హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీసీల జనాభా లెక్కలు తీసేందుకు శాస్త్రీయమైన పద్ధతిలో విచారణ చేపట్టడానికి ప్రత్యేకంగా డెడికేటెడ్ కమిషన్‌ను రెండు వారాల్లో నియమించాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు వీలుగా లెక్కలు తేల్చేందుకు ప్రత్యేక కమిషన్ తప్పనిసరి అని పేర్కొంది. బీసీల జనాభాను లెక్కించే పనిని బీసీ కమిషన్‌కు అప్పగించడం చెల్లదని.. ఇందుకు రాజ్యాంగంలోని నిబంధనలు అంగీకరించవని పేర్కొంటూ మాజీ ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూరేపల్లి నంద ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది, మాజీ అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. బీసీ కమిషన్‌ను డెడికేటెడ్ కమిషన్‌గా గుర్తిస్తూ సెప్టెంబరు 6న రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 199 చెల్లదని పేర్కొన్నారు. బీసీ కమిషన్‌ను డెడికేటెడ్ కమిషన్‌గా గుర్తించడం ఆర్టికల్ 243(డీ), 243(టీ)కి విరుద్ధమని పేర్కొన్నారు. అలాగే 'డాక్టర్ కే కృష్ణమూర్తి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా', 'వికాస్ కిషన్‌రావు గవాలి వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర'పై సుప్రీం కోర్టు తీర్పులను ఉదహరించారు. ప్రభుత్వం జారీ చేసిన జీవోను కొట్టేసి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించడానికి ఏకకాలంలో కచ్చితమైన, శాస్త్రీయమైన లెక్కలు తీయడానికి ప్రత్యేకంగా డెడికేటెడ్ కమిషన్‌ను నియమించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. బీసీ కమిషన్ బీసీల లెక్కలు తీసే పనిని ప్రారంభించిన నేపథ్యంలో దానిని అడ్డుకోవాల్సిన అవసరం ఉందని, ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఏకకాలంలో శాస్త్రీయ పద్ధతిలో కచ్చితమైన బీసీల లెక్కలు తీసేందుకు సుప్రీంకోర్టు చెప్పిన విధంగా డెడికేటెడ్ కమిషన్‌ను రెండు వారాల్లో ఏర్పాటు చేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తూ కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

తెలంగాణ నుంచే మోదీపై యుద్ధం!

(మొదటిపేజీ తరువాయి)


డిప్యూటీ సీఎం భట్టితో ముచ్చటిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

వెళ్లామని, పార్టీ విధానాన్ని అమలు చేయడమే ప్రభుత్వ విధానమని సీఎం రేవంత్ అన్నారు. అందుకే కాంగ్రెస్ భావజాలంతో సంబంధం ఉన్న గోపిశెట్టి నిరంజన్‌ను బీసీ కమిషన్ ఛైర్మన్‌గా నియమించుకున్నామని తెలిపారు. పని చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నా.. ప్రతి క్షణం సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలపై ఉందన్నారు. కులగణన ఎక్స్‌రే మాత్రమే కాదని, ఇది మెగా హెల్త్ చెకప్ లాంటిదని అభివర్ణించారు. కులగణనపై సమన్వయం చేసుకునేందుకు అన్ని జిల్లాలకు పరిశీలకులను నియమించాలని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌కు సీఎం సూచించారు. ఈ విషయంలో నేతలు, కార్యకర్తలు బాధ్యతగా పనిచేయాలని, కష్టానికి ఫలితం ఉంటుందని చెప్పారు. రాహుల్‌గాంధీ ఇచ్చిన మాటను అమలు చేసే క్రమంలో ఎవరు అభ్యంతరకరంగా వ్యవహరించినా వారిని పార్టీ క్షమించబోదని స్పష్టం చేశారు. ఇక ప్రతిపక్షాలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా డీఎస్సీ పూర్తి చేసి ఉద్యోగ నియామక పత్రాలు అందించామని గుర్తు చేశారు. ఈ పది నెలల్లో 50 వేల ఉద్యోగ నియామక పత్రాలు అందజేశామన్నారు. గ్రూప్-1 విషయంలోనూ విపక్షాలు రకరకాల అపోహలు సృష్టించి అడ్డుకోవాలని చూశాయని సీఎం ఆరోపించారు. జీవో, నోటిఫికేషన్ ఇచ్చినప్పుడు, ప్రిలిమ్స్ ఫలితాలు వచ్చినప్పుడు కాకుండా.. మెయిన్స్ నిర్వహించే సందర్భంలో జారీ చేసిన జీవో 29పై కోర్టుకు వెళ్లారని, వారి పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిందని గుర్తు చేశారు.

పార్టీకి నష్టం కలిగిస్తే సహించం..

అగ్రవర్ణాల కోసమే గ్రూప్-1 నిర్వహిస్తూ.. బలహీన వర్గాలకు అన్యాయం చేస్తున్నారనే వాదనను కొంత మంది తీసుకువచ్చారని రేవంత్ తెలిపారు. అయితే మెయిన్స్‌కు ఎంపికైన 31,383 మంది అభ్యర్థుల్లో అగ్రవర్ణాల వాళ్లు పది శాతం లోపు మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. బీసీలు 57.11 శాతం ఉంటే.. ఎస్సీలు 15.38 శాతం, ఎస్టీలు 8.87 శాతం, ఈడబ్ల్యూఎస్ కోటాలో 8.84 శాతం ఎంపికయ్యారని వివరించారు. పార్టీకి నష్టం చేకూర్చేలా ఎవరైనా ఇష్టానుసారంగా మాట్లాడితే పార్టీ సహించబోదని స్పష్టం చేశారు. "రేవంత్‌రెడ్డి చట్టాన్ని అమలు చేస్తాడు తప్ప.. వ్యక్తిగత ఎజెండాతో పనిచేయడు. ప్రతిపక్షాల కుట్రలను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలి" అని సీఎం అన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక, కుల సర్వేతో ఆర్థికంగా వెనుకబడిన వారికి చేయూత, సమాజంలో అందరికీ సమాన హక్కులు కల్పించే అవకాశం లభిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కులగణనపై చర్చ జరగకుండా ప్రతిపక్షాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. కాగా, కులగణన కార్యక్రమాన్ని పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సూచించారు. ఈ సర్వేకు సంబంధించి ఎటువంటి సందేహాలున్నా.. నివృత్తి చేసేందుకు గాంధీభవన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

2న జిల్లాల వారీగా సమావేశాలు

కులగణనపై నవంబరు 2న రాష్ట్రంలోని 33 జిల్లాల్లో డీసీసీ అధ్యక్షుల ఆధ్వర్యంలో అవగాహనా సమావేశాలు నిర్వహించాలని మహేశ్‌కుమార్ గౌడ్ సూచించారు. కుల సంఘాలు, సివిల్ సొసైటీలు తదితరులను ఆ సమావేశాలకు ఆహ్వానించాలన్నారు. కులగణనపై సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. డిసెంబరు 7 కల్లా రాష్ట్ర వ్యాప్తంగా కులగణన కార్యక్రమాన్ని పూర్తి చేసుకుని హైకోర్టుకు వివరాలు సమర్పించనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న జనగణనలో ఓబీసీ గణనా చేపట్టాలంటూ సమావేశం తీర్మానాన్ని ఆమోదించిందన్నారు. కాగా.. గత ప్రభుత్వం చేసిన ఆరాచకాలకు సంబంధించి చర్యల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని ఓ ప్రశ్నకు సమాధానంగా మహేశ్‌కుమార్ చెప్పారు. కులగణనపై రాష్ట్ర స్థాయిలో నవంబరు 5 లేదా 6న భారీ బహిరంగ సభను నిర్వహించాలని టీపీసీసీ నిర్ణయించింది. ఈ సభకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీని ఆహ్వానిస్తామని డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. ఆయన ఇచ్చే సమయాన్ని బట్టి సభ తేదీ ఖరారు అవుతుందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

ఇందిరమ్మ పాలనే మా ప్రభుత్వానికి ఆదర్శం
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని తెలిసినప్పటికీ దేశ సమగ్రత, సమైకత్య, పటిష్ఠత కోసం కఠిన నిర్ణయాలు తీసుకొని ముందుకు సాగిన ధీర వనిత ఇందిరాగాంధీ అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇందిరాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని సీఎం ఆమెను స్మరించుకున్నారు. రాజాభరణాల రద్దు, బ్యాంకుల జాతీయీకరణ వంటి విప్లవాత్మక నిర్ణయాలతో దేశ ప్రగతికి, పేదల అభ్యున్నతికి ఇందిరాగాంధీ ఎంతగానో కృషి చేశారని చెప్పారు. ఆమె స్ఫూర్తితో పేదల అభ్యున్నతే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని చేపడుతున్నామని రేవంత్ తెలిపారు. అలాగే సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని సీఎం ఆయనకు నివాళులు అర్పించారు. సంస్థానాల విలీనం ద్వారా భారతదేశ సార్వభౌమత్వానికి నిండుదనాన్ని చేకూర్చిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కొనియాడారు.

గిరిజన విద్యార్థినికి సీఎం రేవంత్ ఆర్థికసాయం

ఎంబీబీఎస్‌లో సీటు సంపాదించినా.. కళాశాల ఫీజు కట్టేందుకు ఆర్థిక స్థోమత లేక ఇబ్బంది పడుతున్న గిరిజన విద్యార్థిని సాయి శ్రద్ధకు సీఎం రేవంత్‌రెడ్డి ఆర్థిక సాయం చేశారు. కొమురం భీమ్ జిల్లా జైనూరు మండలం జెండాగూడ గ్రామానికి చెందిన సాయి శ్రద్ధ పరిస్థితి తన దృష్టికి రావడంతో.. ఆమె డాక్టర్ కావాలన్న కలను నెరవేర్చే బాధ్యతను ప్రజా ప్రభుత్వం తీసుకుంటుందని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి ఆర్థిక సాయాన్ని అందించారు.

'కులగణన'లో భాగస్వాములు కండి

- ఉపాధ్యాయులకు డిప్యూటీ సీఎం పిలుపు
- సచివాలయంలో సంఘాల నేతలతో భేటీ

హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న కుల గణనలో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క పిలుపునిచ్చారు. ఈ చరిత్రాత్మక కార్యక్రమంలో పాల్గొనాలని చెప్పారు. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. కుల గణన కార్యక్రమంలో పాలుపంచుకోవడంపై సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలను తీసుకున్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. ఎన్నికల హామీల అమలులో భాగంగా కుల గణన చేపట్టాలని నిర్ణయించామన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో ఉపాధ్యాయులను భాగస్వాములను చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రివర్గం నిర్ణయించిందని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు కోరినట్లు ఉదయం వేళల్లో సర్వే నిర్వహించడం, నవంబరు 9 నుంచి 15 వరకు వరుస సెలవుల మధ్య సర్వే చేపట్టడం, సెలవు రోజుల్లో సర్వేలో పాల్గొనే టీచర్లకు పరిహారంతో కూడిన సెలవులు(సీసీఎల్) మంజూరు చేయడం, సర్వేపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలన్న సూచనలన్నింటినీ ఆచరణలో పెడతామని భట్టి తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం కోరుకున్న విధంగా సర్వే చేయడానికి ఉపాధ్యాయ లోకం సిద్ధంగా ఉందని ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షౌకత్ అలీ తెలిపారు. ఉపాధ్యాయులైతేనే సర్వే బాగా చేస్తారన్న నమ్మకం ఉంచినందుకు పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. సర్వేలో పాల్గొనే ఉపాధ్యాయులకు పరిహారంతో కూడిన సెలవును మంజూరు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య కోరారు. సర్వేలో పాల్గొనే ఉపాధ్యాయులకు స్పెషల్ లీవ్‌తో పాటు ఇన్సెంటివ్‌లు ఇవ్వాలని డీటీఎఫ్ అధ్యక్షుడు లింగారెడ్డి కోరారు. ఆదివాసీ ఉపాధ్యాయ సంఘాన్ని కూడా ఆహ్వానించడం పట్ల ఆ సంఘం అధ్యక్షుడు రవి ధన్యవాదాలు తెలిపారు. , కుల గణన సర్వేలో సంపూర్ణంగా సహకరిస్తామని యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చావా రవి తెలిపారు. గత ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేసేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి సందర్భంలోనూ తమను పిలిపించుకొని మాట్లాడుతోందని మోడల్ స్కూల్స్ టీచర్స్ రాష్ట్ర అధ్యక్షుడు కొండయ్య పేర్కొన్నారు.



'మేడిగడ్డ'కు టెయిల్ పాండ్!

- గేట్ల నుంచి దూకే నీటికి అధిక పీడన శక్తి
- టెయిల్ పాండ్ లేనందునే బ్యారేజీకి నష్టం
- ఎల్ అండ్ టీ నమూనా అధ్యయనంలో స్పష్టీకరణ
- అందుకే టెయిల్ పాండ్ నిర్మాణానికి నిర్ణయం
- ఐఐటీ రూర్కీతో డిజైన్ల రూపకల్పన

మేడిగడ్డలో ఎనర్జీ డిసిపేషన్ ఏర్పాట్లు చేశారా?

కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణలో భాగంగా పలువురు ఉన్నతాధికారులను పలు దఫాలుగా జస్టిస్ ఘోష్ కమిషన్ అడిగిన ప్రశ్న ఇది! జలాశయాల గేట్లు ఎత్తినప్పుడు విడుదలయ్యే వరదలో తీవ్రమైన పీడన శక్తి ఉంటుంది. దాంతో, వరద దిగువన తాకే సమయంలో నేల కోతకు గురై గుంతలు ఏర్పడే ప్రమాదం ఉంటుంది. దీనిని నివారించేందుకు వరద నేలను తాకే చోట తగిన పరిమాణంలో నీటి నిల్వలతో టెయిల్ పాండ్ ఉండేలా ఏర్పాట్లు చేయాలి. అప్పుడు గేట్ల నుంచి వరద ఉరికినా.. దానిలోని పీడన శక్తి నిర్వీర్యమై దిగువ ప్రాంతంలో ఎలాంటి నష్టాన్ని కలిగించదు. మేడిగడ్డ బ్యారేజీ దిగువన టెయిల్‌పాండ్ నిర్మించకపోవడంతో అక్కడ నేల కోతకు గురై భారీ గుంతలు ఏర్పడ్డాయని, క్రమ క్రమంగా అవి పెద్దవై బ్యారేజీ పునాదుల (రాఫ్ట్) కింద ఇసుక జారిపోవడానికి కారణమైందని ఎల్ అండ్ టీ నిర్వహించిన నమూనా అధ్యయనంలో తేలింది. ఈ నేపథ్యంలో అక్కడ టెయిల్ పాండ్ నిర్మించాలని నీటిపారుదల శాఖ నిర్ణయించింది. తాత్కాలిక రక్షణ చర్యల్లో భాగంగా ఏర్పాట్లు చేసేందుకు జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) నుంచి అనుమతులను ఇప్పించాలని కాళేశ్వరం ప్రాజెక్టులోని రామగుండం చీఫ్ ఇంజనీర్ కె.సుధాకర్ రెడ్డి తాజాగా నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ (జనరల్) జి.అనిల్‌కుమార్‌కు లేఖ రాశారు. వర్షాకాలం రావడానికి ముందే ఈ పనులు చేయాల్సి ఉందని తెలియజేశారు.

ఐఐటీ రూర్కీకి డిజైన్ల తయారీ బాధ్యత

టెయిల్‌పాండ్ పనులకు సంబంధించిన మోడల్ స్టడీస్‌ను నీటిపారుదల శాఖ ఐఐటీ రూర్కీతో చేయించింది. ఈ పనులకు డిజైన్లు, డ్రాయింగ్స్‌ను సైతం అదే సంస్థ ఇవ్వనుంది. వీటికి సీడీవో సీఈ ఆమోదం తీసుకుని పనులు ప్రారంభించేందుకు ఎన్‌డీఎస్‌ఏ నుంచి అనుమతి పొందాలని రామగుండం చీఫ్ ఇంజనీర్ విజ్ఞప్తి చేశారు. మేడిగడ్డ బ్యారేజీ శాశ్వత పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలపై ఎన్డీఎస్‌ఏ తుది నివేదిక సమర్పించే వరకు వేచిచూడకుండా ఈ మేరకు పనులు చేసేందుకు ఆయన అనుమతి కోరారు

- ఆంధ్రజ్యోతి, హైదరాబాద్

టీటీడీ ఛైర్మన్‌గా బీఆర్‌నాయుడు

23 మంది సభ్యులతో బోర్డు ఏర్పాటు .. ముగ్గురు టీడీపీ ఎమ్మెల్యేలకు స్థానం



అమరావతి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొత్తం 24 మందితో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డును రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మీడియా రంగానికి చెందిన బొల్లినేని రాజగోపాల నాయుడును బోర్డు ఛైర్మన్‌గా, వివిధ రంగాలకు చెందిన 23 మందిని సభ్యులుగా నియమించింది. బోర్డులో ఆంధ్రప్రదేశ్ తర్వాత తెలంగాణకు ఎక్కువ ప్రాధాన్యం దక్కింది. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వారికి బోర్డులో స్థానం లభించింది. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా పని చేసిన వ్యక్తిని తొలిసారి టీటీడీ బోర్డులో నియమించారు. మాజీ సీజేఐ జస్టిస్ హెచ్ఎల్ దత్తును బోర్డు సభ్యుడిగా నియమించారు.

టీడీపీ నుంచి...

ముగ్గురు టీడీపీ ఎమ్మెల్యేలకు బోర్డు సభ్యులుగా అవకాశం కల్పించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్‌రాజును నియమించారు. కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మికి బోర్డులో స్థానం దక్కింది. తొలి నుంచి తెలుగుదేశం పార్టీని నమ్ముకుని ఉన్న తెలంగాణకు చెందిన నన్నూరి నర్సిరెడ్డిని టీటీడీ బోర్డు సభ్యుడిగా నియమించారు. రాజమండ్రికి చెందిన సాధారణ వ్యక్తి కోటేశ్వరరావుకు అవకాశం దక్కింది. నంద్యాల జిల్లా టీడీపీ ప్రెసిడెంట్ రాజశేఖర్ గౌడ్, పల్నాడు జిల్లాకు చెందిన టీడీపీ నేత జంగా క్రిష్ణమూర్తికి బోర్డులో అవకాశం దక్కింది. ఎన్నికల్లో జంగా క్రిష్ణమూర్తి గురజాల ఎమ్మెల్యే టికెట్ ఆశించినా దక్కలేదు. ఇప్పుడు టీటీడీ బోర్డు సభ్యుడిగా అవకాశం కల్పించారు. మంగళగిరికి చెందిన టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవిని సభ్యురాలిగా నియమించారు.

జనసేన కోటాలో...

జనసేన పార్టీ కోటాలో ముగ్గురు సభ్యులకు టీటీడీ బోర్డులో అవకాశం లభించింది. జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు బి.మహేంద్రరెడ్డిని సభ్యుడిగా నియమించారు. 2009 నుంచి జనసేనాని పవన్ కల్యాణ్ వెంటే ఉన్నారు. ఎలాంటి పదవులు ఆశించకుండా పార్టీ కోసం పని చేశారు. జనసేన పార్టీ వ్యవస్థాపక సభ్యురాలు అనుగోలు రంగశ్రీకి టీటీడీలో చోటు కల్పించారు. ఆమె భర్త ఎం.సి. దాస్ జనసేన పార్టీ ట్రెజరర్‌గా ఉన్నారు. ఇక జనసేన పార్టీ కోటాలో డిప్యూటీ సీఎం పవన్ సన్నిహితుడు, ప్రముఖ కళా దర్శకుడు ఆనంద్‌సాయికి అవకాశం దక్కింది. తెలంగాణలోని యాదాద్రి ఆలయం పునర్నిర్మాణంలో ఆయన కీలకంగా వ్యవహరించారు.

వివిధ రంగాల నుంచి...

ఎన్‌ఆర్‌ఐ విభాగం నుంచి జాస్తి సాంబశివరావు, ఫార్మా రంగం నుంచి నన్నపనేని సదాశివరావు, సుచిత్ర ఎల్లాకు బోర్డు సభ్యులుగా అవకాశం కల్పించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు అత్యంత సన్నిహితుడు, తమిళనాడుకు చెందిన కృష్ణమూర్తికి నాలుగోసారి అవకాశం దక్కింది. అమిత్‌షా సతీమణి, కృష్ణమూర్తి సతీమణి చిన్ననాటి స్నేహితులని సమాచారం. కృష్ణమూర్తి మద్రాస్ హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయవాది. కాఫీ వ్యాపారి ఆర్ఎన్ దర్శన్, కుప్పం పారిశ్రామిక వేత్త శాంతరామ్, చెన్నైకి చెందిన పి.రామ్మూర్తిని సభ్యులుగా నియమించారు. పి.రామ్మూర్తి తమిళనాడులో పెద్ద టెక్స్‌టైల్స్ వ్యాపారవేత్త. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరున్న తిరుప్పూరు బాలుకు స్వయానా సోదరుడు. అంతేగాక మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు అతి సమీప బంధువు అని తెలిసింది. తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ సిఫార్సుతో అవకాశం దక్కించుకున్నారు. కర్ణాటక రాష్ట్రం నుంచి నరేష్‌కుమార్‌కు చోటు కల్పించారు. ఆర్థిక నిపుణుడు, నిధుల సమీకరణలో అనుభవం ఉన్న సౌరబ్ హెచ్.బోరాకు బోర్డు సభ్యుడిగా స్థానం దక్కింది. గతంలో ఎంసీఐ ఛైర్మన్‌గా విధులు నిర్వహించిన కేతన్ దేశాయ్ కుమారుడు డాక్టర్ అదిత్ దేశాయ్‌కు బోర్డులో స్థానం లభించింది. కేతన్ దేశాయ్‌పై ఆరోపణలు ఉండడంతో ఆయనకు బదులుగా అదిత్ దేశాయ్‌కు అవకాశం కల్పించారు.

మళ్లీ అవకాశం

టీటీడీ పాలకమండలి సభ్యులుగా నియమితులైన వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, జంగా కృష్ణమూర్తి గత వైసీపీ హయాంలోనూ బోర్డులో ఉన్నారు. వారిద్దరూ ఇప్పుడు తెలుగుదేశం పార్టీలో ఉన్న సంగతి తెలిసిందే. వైసీపీ హయాంలోనూ బోర్డులో స్థానం దక్కించుకున్న సౌరబ్ బోరా.. ఇప్పుడు మరోసారి టీటీడీ సభ్యుడయ్యారు. ఇక ప్రస్తుతం టీటీడీ సభ్యుడిగా నియమితులైన రామ్మూర్తి సోదరుడు తిరుప్పూర్ బాలు గతంలో బోర్డు సభ్యుడిగా పని చేశారు. కేతన్ దేశాయ్ వైసీపీ హయాంలో టీటీడీ బోర్డు సభ్యుడిగా ఉండగా... ఇప్పుడు ఆయన కుమారుడు అదిత్ దేశాయ్‌కి అవకాశం లభించింది.

టీటీడీ బోర్డు

ఛైర్మన్: బొల్లినేని రాజగోపాలనాయుడు

సభ్యులు

జ్యోతుల నెహ్రూ	జగ్గంపేట ఎమ్మెల్యే
వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి	కోవూరు ఎమ్మెల్యే
ఎంఎస్‌రాజు	మడకశిర ఎమ్మెల్యే
పనబాక లక్ష్మి	కేంద్ర మాజీమంత్రి
నన్నూరి నర్సిరెడ్డి	తెలంగాణ
సాంబశివరావు (జాస్తి శివ)	ఎన్‌ఆర్‌ఐ
నన్నపనేని సదాశివరావు	ఫార్మా
సుచిత్రా ఎల్లా	ఫార్మా
కృష్ణమూర్తి	తమిళనాడు
కోటేశ్వరరావు	రాజమండ్రి
మల్లెల రాజశేఖర్ గౌడ్	టీడీపీ
జంగా కృష్ణమూర్తి	టీడీపీ
దర్శన్ ఆర్ఎన్	కాఫీ వ్యాపారి
జస్టిస్ హెచ్‌ఎల్‌దత్తు	మాజీ సీజేఐ
పి.రామ్మూర్తి	తమిళనాడు
తమ్మిశెట్టి జానకీదేవి	టీడీపీ
బి.మహేంద్రరెడ్డి	జనసేన
అనుగొల్లు రంగశ్రీ	జనసేన
బి.ఆనంద్‌సాయి	జనసేన కోటా
నరేష్ కుమార్	కర్ణాటక
శాంతరామ్	కుప్పం పారిశ్రామికవేత్త
డా.అదిత్ దేశాయ్	
సౌరబ్ హెచ్ బోరా	ఆర్థిక నిపుణుడు

మిల్లర్ల పూచీకత్తుకు పక్షం గడువు..!

హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ధాన్యం సేకరణకు కొత్త పాలసీని అమలులోకి తీసుకొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం.. బ్యాంకు గ్యారెంటీలు.. లేదా.. సెక్యూరిటీ డిపాజిట్లను తీసుకోవటానికి రైస్‌మిల్లర్లకు పక్షం రోజుల గడువిచ్చింది. ధాన్యం సేకరణ పాలసీ ప్రకటనలో జాప్యం జరిగిన నేపథ్యంలో.. రైస్ మిల్లర్లు ఆస్తులను తనఖా పెట్టడానికి, ఆర్థిక వనరులు సమకూర్చుకోవటానికి 15 రోజుల సమయం ఇస్తూ వెసులుబాటు కల్పించింది. వచ్చేనెల 15 నాటికి రైస్‌మిల్లర్లు ఖరీఫ్ ధాన్యం సేకరణలో భాగస్వాములు కావాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి, పౌర సరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ ఆదేశాలు జారీచేశారు. రైస్‌మిల్లర్లతో సమన్వయానికి పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్లు(డీఎం), జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులకు బాధ్యతలను అప్పగించారు. రైస్‌మిల్లర్లకు ధాన్యం అప్పగించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మూడు స్లాబులను ప్రకటించిన విషయం తెలిసిందే..! బకాయిలు లేని మిల్లర్లు... 10%, బకాయిలను జరిమానాతో సహా తీర్చిన మిల్లర్లు 20%, బకాయిలు తీర్చినా.. జరిమానా కట్టని మిల్లర్లు 25% బ్యాంకు గ్యారెంటీ ఇవ్వాల్సి ఉంది. లేని పక్షంలో.. ఈ మూడు కేటగిరీల్లో ఉన్న రైస్ మిల్లర్లు 25% సెక్యూరిటీ డిపాజిట్ సమర్పించాలి. కాగా, గతంలో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటా వేయగానే నేరుగా మిల్లులకు తరలించే విధానం అమల్లో ఉండేది. కొత్త పాలసీలో పాత పద్ధతికి స్వస్తి పలికారు. బ్యాంకు గ్యారెంటీ/సెక్యూరిటీ డిపాజిట్ పత్రాలు తయారై.. పౌరసరఫరాల సంస్థకు సమర్పించే వరకు మిల్లుల్లోకి ధాన్యం తరలించరు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు, గిడ్డంగుల సంస్థ గోదాముల్లో ధాన్యాన్ని నిల్వ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ధాన్యాన్ని నేరుగా గోదాములకు తరలిస్తున్నారు. .

నవంబరు 17 నుంచి గ్రూపు-3 పరీక్షలు

» 10 నుంచి అభ్యర్థులకు హాల్‌టికెట్లు

హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : గ్రూపు-3 పోస్టుల భర్తీకి సంబంధించిన పరీక్షలను నవంబరు 17వ తేదీ నుంచి నిర్వహించనున్నారు. రెండు రోజుల పాటు జరుగనున్న ఈ పరీక్షల ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు. అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను నవంబరు 10వ తేదీ నుంచి వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పబ్లిక్ సర్వీసు కమిషన్ అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో సుమారు 1365 గ్రూపు-3 పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. నవంబరు 17, 18వ తేదీల్లో అభ్యర్థులకు ఈ పరీక్షలను నిర్వహించనున్నారు. మొత్తం మూడు పేపర్లకు సంబంధించిన పరీక్షలను అభ్యర్థులు రాయాల్సి ఉంటుంది. 17వ తేదీన మొదటి సెషన్‌లో భాగంగా పేపర్-1 పరీక్షను ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు, రెండవ సెషన్‌లో పేపర్-2 పరీక్షను మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించనున్నారు. తర్వాత 18వ తేదీన పేపర్-3 పరీక్షను ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు నిర్వహిస్తారు. పరీక్ష మొదలయ్యే సమయానికి 30 నిమిషాల ముందుగానే గేట్లను మూసివేస్తారు. అంటే.. ఉదయం సెషన్ పరీక్షలకు 9.30 గంటల లోపు, మధ్యాహ్నం సెషన్ పరీక్షకు 2.30 గంటల లోపు అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. అభ్యర్థులు తమ హాల్‌టికెట్‌ను ఒకసారి డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత దాన్నే అన్ని పరీక్షలకు ఉపయోగించుకోవాల్సి ఉంటుంది. ఈ పరీక్షలపై అభ్యర్థులకు ఏమైనా అనుమానాలు ఉన్నా, సమాచారం కావాలన్నా... 040-23542185, 040-23542187 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని అధికారులు సూచించారు.

దరఖాస్తులో చిన్న తప్పిదం.. ఉద్యోగానికి దూరం

» దరఖాస్తులో డీఈడీ బదులు స్పెషల్ డీఈడీ ఆప్షన్ ఎంపిక

» సంగారెడ్డి జిల్లాలో 10 మంది ఎస్జీటీ పోస్టులకు దూరం

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఆన్‌లైన్ దరఖాస్తులో చేసిన చిన్న తప్పు కారణంగా పలువురు అభ్యర్థులు ఎస్జీటీ ఉద్యోగాలకు దూరమయ్యారు. ఆ పొరపాటు గురించి అధికారులు ధ్రువపత్రాల పరిశీలన సమయంలో గుర్తించారు. కొందరు అభ్యర్థులు ఎస్జీటీ పోస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేటప్పుడు పొరపాటుగా డీఈడీ ఆప్షన్ బదులు స్పెషల్ ఎడ్యుకేషన్ డీఈడీ ఆప్షన్ ఎంచుకున్నారు. వారు డీఎస్సీ పరీక్ష కూడా రాశారు. పరీక్ష సమయంలో తాము చదివిన దానికి కొంత విరుద్ధంగా ప్రశ్నలు ఉండడంతో ఆందోళనకు కూడా గురయ్యారు. ఇటీవల ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టుల భర్తీకి 1:3 నిష్పత్తిలో అధికారులు విడుదల చేసిన మెరిట్ జాబితాలో ఇలా తప్పుగా దరఖాస్తు చేసుకున్న వారు కొందరు ఉన్నారు. ఈనెల 29, 30 తేదీల్లో నిర్వహించిన ధ్రువపత్రాల పరిశీలనలో వారు స్పెషల్ ఎడ్యుకేషన్ డీఈడీ చేయలేదని, పొరపాటున ఆ ఆప్షన్ ఎంచుకున్నారని తెలిసింది. సంగారెడ్డి జిల్లాలో ధ్రువపత్రాల పరిశీలనకు వచ్చిన 52 మంది ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ అభ్యర్థుల్లో 10 మంది ఇలా తప్పుగా దరఖాస్తు చేసుకొని ఉద్యోగాలు కోల్పోయారు.

సచివాలయం భద్రత తిరిగి ఎస్పీఎఫ్ చేతికి

హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సచివాలయం భద్రత విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు సచివాలయ భద్రతను పర్యవేక్షిస్తున్న తెలంగాణ రాష్ట్ర స్పెషల్ పోలీస్ (టీజీఎస్పీ) సిబ్బందిని ఆ బాధ్యతల నుంచి తప్పించింది. ఈ బాధ్యతను తిరిగి తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (టీజీఎస్పీఎఫ్)కు అప్పగించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఉన్నప్పుడు, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత కూడా కొంతకాలంపాటు సచివాలయం భద్రత ఎస్పీఎఫ్ చేతుల్లోనే ఉంది. అయితే సచివాలయ నూతన భవనం నిర్మాణం తర్వాత గత ప్రభుత్వం.. భద్రత విధుల నుంచి ఎస్పీఎఫ్‌ను తప్పించి టీజీఎస్పీకి ఆ బాధ్యతలు అప్పగించింది. అయితే వివిధ కారణాల వల్ల.. సచివాలయ భద్రత బాధ్యతలను తిరిగి ఎస్పీఎఫ్‌కు అప్పగించాలంటూ కొత్త ప్రభుత్వానికి డీజీపీ నివేదిక అందజేశారు. ఈ మేరకే ప్రభుత్వం తిరిగి ఎస్పీఎఫ్‌కు అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. తక్షణమే సచివాలయ భద్రతను అధీనంలోకి తీసుకోవాలంటూ ఎస్పీఎఫ్‌ను ఆదేశించింది. ప్రభుత్వ నిర్ణయం మేరకు సీఎస్ శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

శంషాబాద్‌లో 9 విమానాలకు బెదిరింపులు

» బాంబ్ స్క్వాడ్లతో తనిఖీలు.. ఏమీ లేవని తేల్చిన సిబ్బంది

శంషాబాద్ రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో మరోసారి పలు విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. మంగళ, బుధవారాల్లో మొత్తం 9 విమానాలకు ఫోన్, ఈమెయిల్, ఎక్స్ ద్వారా గుర్తుతెలియని దుండగుల నుంచి బెదిరింపులు వచ్చాయి. వీటిలో చెన్నై, అయోధ్య, ఢిల్లీ, యూకేల నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ఇండిగో, ఎయిరిండియా సంస్థలకు చెందిన విమానాలున్నాయి. అప్రమత్తమైన సీఐఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్ బలగాలు డాగ్, బాంబ్‌స్క్వాడ్ తనిఖీలు నిర్వహించి ఎలాంటి బాంబులు లేవని తేల్చారు. గుర్తుతెలియని వ్యక్తులు విదేశాలు, వివిధ రాష్ట్రాల నుంచి బెదిరింపు మెయిల్స్, కాల్స్ చేస్తున్నారని పోలీసులు తెలిపారు. కొందరు దుండగులు ఎక్స్ ద్వారా నకిలీ హెచ్చరికలు పంపుతున్నారన్నారు.

మంత్రి సురేఖపై నాగార్జున, కేటీఆర్ దావాల విచారణ వాయిదా



హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మంత్రి కొండా సురేఖపై వేసిన క్రిమినల్ పరువు నష్టం దావాలపై తదుపరి విచారణను వచ్చే నెల 13వ తేదీకి నాంపల్లి కోర్టు వాయిదా వేసింది. అక్కినేని కుటుంబ సభ్యులపై చేసిన వ్యాఖ్యలకుగాను హీరో నాగార్జున, వ్యక్తిగతంగా తనపై చేసిన విమర్శలకుగాను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. కొండా సురేఖపై నాంపల్లిలోని ప్రత్యేక జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఎక్సైజ్ కోర్టులో క్రిమినల్ పరువు నష్టం దావాలు వేసిన విషయం తెలిసిందే. ఈ రెండు దావాలపై మంగళవారం విచారణ జరగాల్సి ఉండగా న్యాయమూర్తి సెలవులో ఉండడంతో వచ్చే నెల 13వ తేదీకి ఇన్‌చార్జ్ జడ్జి వాయిదా వేశారు. నాగార్జున వేసిన దావాపై వాదనలు వినిపించేందుకు మంత్రి కొండా సురేఖ తరఫు న్యాయవాది గుర్మీత్ సింగ్ న్యాయస్థానానికి వచ్చారు. అయితే ఈ కేసు విచారణను పరిశీలిస్తున్న జడ్జి అందుబాటులోలేకపోవడంతో వాదనలు జరగలేదు. కేటీఆర్ వేసిన దావాలో ఆయనతోపాటు దాసోజు శ్రవణ్ గత వారమే వాంగ్మూలం ఇవ్వగా మిగిలిన సాక్షుల వాంగ్మూలాలను న్యాయస్థానం నమోదు చేయాల్సి ఉంది.

17 వాయిదాల్లో డీఏ చెల్లింపు.. పద్ధతి కాదు


పెరిగిన ఉద్యోగుల డీఏను 17 వాయిదాల్లో చెల్లిస్తామని ప్రభుత్వం ఉత్తర్వులివ్వడం సరైన పద్ధతి కాదని సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం అధ్యక్షుడు కమలాకర్ అన్నారు. నిబంధనల ప్రకారం ఉద్యోగులకు పెరిగిన డీఏలో 10 శాతం సేవింగ్ ఖాతాలో జమ చేసి, మిగిలిన 90 శాతం ఉద్యోగుల ప్రాన్(పర్మనెంట్ రిటైర్‌మెంట్ అకౌంట్ నంబర్) ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు.

వైద్యవిద్య పీజీ ప్రవేశాలకు నోటిఫికేషన్

» నేటి నుంచి నవంబరు 7 దాకా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్

హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్య పోస్టు గ్రాడ్యుయేట్ (పీజీ) కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభమైంది. 2024-25కి గానూ ఎండీ, ఎంఎస్, డిప్లమో కోర్సుల్లో కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్‌ను కాళోజీ నారాయణ రావు ఆరోగ్య విశ్వవిద్యాలయం జారీ చేసింది. నీట్ పీజీ-2024లో నిర్దేశిత అర్హత సాధించిన అభ్యర్థులు ఆయా కోర్సుల్లో ప్రవేశానికి అర్హులు. అర్హులైన అభ్యర్థులు గురువారం ఉదయం ఆరు గంటల నుంచి నవంబరు ఏడో తేదీ సాయంత్రం ఆరు గంటల్లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అలాగే, ఎండీ ఆయుర్వేద, హోమియో, యునాని కోర్సుల్లో ప్రవేశాలకు బుధవారం సాయంత్రం 4 గంటల నుంచే దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ కోర్సులకు సంబంధించి నవంబరు ఐదో తేదీ సాయంత్రం ఆరు గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు.

ఫాస్ట్ ఫుడ్స్‌తో పిల్లలకు ప్రమాదం



పదేళ్ల వయసులోనే ఫ్యాటీ లివర్ సమస్య.. 5 నుంచి 35 శాతానికి గ్యాస్ట్రిక్ కేసులు

పల్లెల్లోనూ మారిన ఆహారపుటలవాట్లు.. ఇష్టారాజ్యంగా యాంటాసిడ్స్ వాడొద్దు

మితిమీరిన మద్యపానంతో కాలేయం.. భారీగా పెరిగిన కేసులు

'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో ఏఐజీ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి):

చిప్స్, ఫ్రెంచ్ ఫ్రైస్, పిజ్జా, బర్గర్ వంటి ఫాస్ట్‌ఫుడ్స్, అల్ట్రా ప్రాసెస్డ్, జంక్ ఫుడ్స్‌తో పిల్లల ఆరోగ్యానికి పెనుప్రమాదం ఉందని.. ఏఐజీ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. బడి ఈడు పిల్లల్లోనూ ఫ్యాటీ లివర్, గ్యాస్ట్రిక్ సమస్యలు నమోదవుతున్నాయని.. పదేళ్ల క్రితం జనాభాలో ఐదు శాతం మేర ఉన్న ఫ్యాటీ లివర్ కేసుల సంఖ్య 35 శాతానికి పెరిగిందని ఆవేదన వెలిబుచ్చారు. ఈ అంశంపై 'ఆంధ్రజ్యోతి'కి డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ముఖ్యాంశాలు..

ఫాస్ట్ ఫుడ్స్, జంక్ ఫుడ్స్‌తో ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం పడుతుంది?

ప్రస్తుతం అంతా వయసుతో సంబంధం లేకుండా ఫాస్ట్‌ఫుడ్, జంక్ ఫుడ్‌ను ఎక్కువగా తీసుకుంటున్నారు. వాటిలో ఉండే అధిక కెలోరీల వల్ల కొవ్వు పెరిగి అనారోగ్యానికి దారితీస్తుంది. అంతేకాదు.. వాటిని నిల్వ చేయడానికి వాడే ప్రిజర్వేటివ్స్, అడిటివ్స్, కృత్రిమ రంగుల వల్ల క్రమేపీ మన కడుపులో మంచి బ్యాక్టీరియా పోయి చెడు బ్యాక్టీరియా ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. ఈ చెడ్డ బ్యాక్టీరియా ఉత్పత్తి చేసే కొన్ని హానికర ఉత్పత్తులు శరీరమంతా వ్యాపించి గుండె, మెదడు సంబంధిత సమస్యలు కూడా వస్తాయి. కాలేయంపై ప్రభావం పడి ఫ్యాటీ లివర్ సమస్య వస్తుంది. ఇటీవలికాలంలో పాఠశాల విద్యార్థుల్లో కూడా ఫ్యాటీ లివర్ సమస్య ఎక్కువగా కనపడడానికి కారణం ఇదే. చాలామంది పిల్లలు.. ఎక్కువగా అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్‌ను తిసుకుంటున్నారు. బర్గర్లు, పిజ్జాలు, చిప్స్ ఎక్కువగా తినేస్తున్నారు. దీంతో పదేళ్ల పిల్లల్లోనూ ఫ్యాటీ లివర్స్ కేసులు వస్తున్నాయి. వారు గ్యాస్ట్రిక్ సమస్యలతో బాధపడుతున్నారు. అలాగే.. మన దగ్గర మద్యం సంబంధిత కాలేయ వ్యాధుల సంఖ్య గత పదేళ్లలో బాగా పెరిగింది. ఆస్పత్రుల్లో 50% కాలేయ సమస్యల కేసులు ఆల్కహాల్ సంబంధించినవే ఉంటున్నాయి. మద్యపానం వల్ల కాలేయం, గుండె, నాడులు, ఉదర భాగాలు దెబ్బతింటాయి. ఇలాంటి కేసుల్లో కాలేయ మార్పిడి శస్త్రచికిత్సతో సమస్య తీరదు. మద్యం మానాల్సిందే.

పల్లెల్లోనూ జంక్‌ఫుడ్ సంస్కృతి పెరిగింది కదా.. అక్కడి పరిస్థితులు ఎలా ఉన్నాయి?

మా ఆస్పత్రి ఆధ్వర్యంలో పల్లెల్లో కూడా సర్వేలు చేశాం. పల్లె ప్రజల్లో ఎక్కువగా అల్సర్స్, ఇరిటబుల్ బొవెల్ సిండ్రోమ్ (ఐబీఎస్), అజీర్తి వంటి సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించాం. అక్కడ కూడా ప్రజలు సహజంగా లభించే ఆహారాన్ని సరిగ్గా తీసుకోవడం లేదు. కూరగాయలు, అన్నం మానేసి ఈ ఫాస్ట్‌ఫుడ్స్ ఎక్కువగా తింటున్నారు. చిన్నచిన్న ఊళ్లల్లో కూడా.. చిప్స్, రెండు నిమిషాల్లో రెడీ అయ్యే నూడుల్స్ లాంటివి విరివిగా కనిపిస్తున్నాయి. దీనికితోడు.. పల్లెల్లో కలుషిత నీటి సమస్య ఎక్కువగా ఉంటుంది. అది కూడా గ్యాస్ట్రిక్ సమస్యలకు దారితీస్తోంది. అలాగే. పల్లెల్లో గతంలోలాగా పొలాలకు వెళ్లడం, శారీరక శ్రమ చేయడం బాగా తగ్గిపోయింది. సరైన శారీరక శ్రమ లేకపోయినా గ్యాస్ట్రిక్ సమస్యలు వస్తాయి.



ఫాస్ట్ ఫుడ్స్, స్వీట్స్ తయారీలో వాడే పదార్థాల్లో ఏవి అనారోగ్యకరం?

ఫాస్ట్‌ఫుడ్స్, జంక్ ఫుడ్ తయారీలో రకరకాల పదార్థాలు వాడుతున్నారు. మిఠాయిల తయారీలో కృత్రిమ రంగులు వేస్తున్నారు. చక్కెరకు బదులు కృత్రిమ తీపిపదార్థాలు వేసి.. అవి ఆరోగ్యానికి మంచివని చెబుతున్నారు. కానీ అది తప్పు. వాటి వల్ల కూడా దుష్ప్రభావాలు కలుగుతాయి. ఇక నూనెల విషయానికి వస్తే.. అన్‌శాచురేటెడ్ ఫ్యాట్స్ మంచివి. ఆలివ్ ఆయిల్ వంటి వాటిలో ఉంటాయి. శాచురేటెడ్ ఫ్యాట్స్ అంత మంచివి కావు (కొబ్బరినూనె). ట్రాన్స్‌ఫ్యాట్స్ అస్సలు మంచివి కావు (వనస్పతి లాంటివి). కానీ మన బేకరీల్లో ఎక్కువగా ట్రాన్స్‌ఫ్యాట్స్‌నే వాడుతున్నారు. కాబట్టి బేకరీ ఉత్పత్తుల అధిక వినియోగం వల్ల కూడా మన ఆరోగ్యానికి చాలా హాని కలుగుతుంది. అలాగే. కొన్ని టూత్‌పేస్టుల్లో టైటానియమ్ ఆక్సైడ్ ఉంటుంది. దీనివల్ల శరీరంలోని బ్యాక్టీరియా మార్పులు చెంది దుష్ప్రభావాలు కలుగుతున్నాయి. టూత్‌పేస్ట్‌లో ఈ టైటానియమ్ ఆక్సైడ్ ఉండకూడదు. ప్రభుత్వం దీనిపై దృష్టిసారించాలి.

గ్యాస్ట్రిక్ సమస్యల బారిన పడకుండా ఉండాలంటే ఏం చేయాలి?

ప్రజలు తమ ఆహారపుటలవాట్లలో మార్పులు చేసుకోవాలి. నిత్యం వ్యాయమం చేయాలి. కంటి నిండా నిద్రపోవాలి. ఇలాంటి మార్పులతో జీవనశైలి జబ్బులను అదుపులో పెట్టుకోవచ్చు. మద్యపానానికి దూరంగా ఉండాలి. అన్నింటికంటే పెద్ద చెడ్డ అలవాటు.. పొగ తాగడం. దీనివల్ల చాలా దుష్ప్రభావాలు ఉంటాయి. ఇక ఆహారం విషయానికి వస్తే.. మన దక్షిణాది ఆహారం చాలా మంచిది. ఈ ఆహారాన్ని రోజూ తీసుకోవాలి. దాంతోపాటు చిరుధాన్యాలనూ ఆహారంలో భాగం చేసుకోవాలి. ఫాస్ట్‌ఫుడ్స్‌కు దూరంగా ఉండాలి. ప్రతి ఒక్కరూ 50 సంవత్సరాలు నిండిన తర్వాత కొన్ని ప్రాథమిక వైద్య పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరి. అంటే గుండె, మెదడు, లివర్ పనితీరుతో పాటు బీపీ, షుగర్ స్థాయిలు ఎలా ఉన్నాయో పరీక్షించుకోవాలి. వాటి ఆధారంగా జీవనశైలిలో ఆరోగ్యకరమైన మార్పులు చేసుకోవాలి.

గ్యాస్ట్రిక్ సమస్యను ముందుగా గుర్తించి, నివారించదగిన ఔషధాలు అందుబాటులో ఉన్నాయా?

చాలా ఔషధాలు అందుబాటులోకి వచ్చాయి. ఉదాహరణకు ఎసిడిటీ సమస్యకు పీపీఐ (ప్రొటాన్ పంప్ ఇన్హిబిటర్స్) వాడేవాళ్లం. ఇప్పుడు కొత్తగా పీక్యాప్ వచ్చింది. దీనివల్ల దుష్ప్రభావాలు చాలావరకూ తగ్గిపోయాయి. మన ఫార్మా రంగం చాలా బలమైనది. పీక్యాప్‌ను ఇక్కడే ఎక్కువగా ఉత్పత్తి చేస్తోంది. విదేశాల్లో రూ.100కు దొరికే ట్యాబ్లెట్స్ ఇక్కడ మనకు పది రూపాయలకే దొరుకుతున్నాయి. అలాగే లివర్ సమస్యలకు కూడా చాలా కొత్త మందులు మనదగ్గరే ముందుగా అందుబాటులోకి వచ్చాయి.

ప్రభుత్వ పరంగా ఎటువంటి చర్యలు తీసుకోవాలి?

మనం సహజంగా తినే ఆహారమే మంచిది.. ఫాస్ట్ ఫుడ్స్ మంచివి కావనే విషయంపై ప్రజల్లో అవగాహన పెంచాలి. అలాగే, కొన్ని కఠిన చర్యలు తీసుకోవాలి. ఉదాహరణకు పాఠశాలలు, కళాశాలల సమీపంలో బార్లు, మద్యం దుకాణాలు ఉండకూడదని నిబంధనలు చెబుతున్నాయి. ఇటువంటి కఠిన నిర్ణయమే ఫాస్ట్ ఫుడ్ సెంటర్స్ విషయంలోనూ ప్రభుత్వం తీసుకుంటే మంచిది. స్కూల్స్, కాలేజీల్లో, వాటి సమీపంలో ఫాస్ట్‌ఫుడ్ విక్రయాలు జరపకుండా చర్యలు తీసుకోవాలి. విదేశాల్లో ఇటువంటి వాటిపై కఠినంగా ఉన్నారు. ఉదాహరణకు.. న్యూయార్క్‌లో ట్రాన్స్‌ఫ్యాట్స్ ఉండే ఆహారాన్ని బ్యాన్ చేశారు. ఈ ట్రాన్స్‌ఫ్యాట్స్ అనేవి బేకింగ్ ఫుడ్‌లో వాడకూడదు. బిస్కట్స్, కేకుల్లో కూడా ఈ ట్రాన్స్‌ఫ్యాట్ ఎక్కువగా ఉంటుంది. మనదగ్గర ఇంకా అటువంటి కఠిన నిబంధనలను అమలు చేయడం లేదు. ఫుడ్స్‌లో ఏం ఉపయోగించాలనే దానిపై కొన్ని నిబంధనలు తీసుకురావాలి.

యాంటాసిడ్స్ వాడకం మంచిదేనా?

ఈ మధ్యనే ఏది పడితే అది తినేసి.. ఎసిడిటీ వస్తోందని ఎక్కువగా యాంటాసిడ్స్ తీసుకుంటున్నారు. ఇది ఏ మాత్రం మంచిది కాదు. యాంటాసిడ్స్ అధిక వినియోగం వల్ల ఆమ్లత్వం తగ్గి శరీరంలో చెడ్డ బ్యాక్టీరియా పెరిగిపోతుంది. అల్సర్స్ ఉన్నవారు, ఇతరత్రా సమస్యలున్నవారు వైద్యులు సిఫారసు చేస్తే మాత్రమే యాంటాసిడ్స్ వాడాలి. అంతే తప్ప ఎలా పడితే అలా మందుల దుకాణాల్లో కొని వాడడం మంచిది కాదు. యాసిడ్ కూడా శరీరానికి అవసరమనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి.

ఉద్యోగులకు ప్రభుత్వ ఈ-మెయిల్

» ఇకనుంచి అధికారిక కార్యకలాపాలన్నీ gov.in ద్వారానే

» 'ఈ-మెయిల్' పాలసీ ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

హైదరాబాద్, అక్టోబర్ 30 (ఆంధ్రజ్యోతి): ఇక నుంచి ప్రభుత్వ శాఖల్లో పనిచేసేవారంతా తమ అధికార ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ ప్రభుత్వ ఆధ్వర్యంలోని నేషనల్ ఇన్ఫర్మెటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) ఈ-మెయిల్ ద్వారానే చేయాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఈ-మెయిల్ పాలసీ విడుదల చేసింది. దీని ప్రకారం కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు, న్యాయస్థానాలు, ఇతర ప్రభుత్వ అనుబంధ శాఖలు, రంగాల్లో పనిచేసే అధికారులు, ఉద్యోగులంతా ఎన్ఐసీ ఈ-మెయిల్‌నే వాడాల్సి ఉంటుంది. ఎన్ఐసీ ఆధ్వర్యంలోని ప్రభుత్వ ఈ-మెయిల్ ఎప్పటినుంచో అందుబాటులో ఉంది. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతోపాటు ఇతర జిల్లా స్థాయి అధికారులకు జొరి.జీ తో ముగిసే ఈ-మెయిల్ గతంలోనే కేటాయించినా ఎవరూ ఉపయోగించడం లేదు. అధికారిక ఈ-మెయిళ్లకు కూడా జీ-మెయిల్ లాంటి ప్రైవేటు వాటినే వినియోగిస్తున్నారు. జాతీయ భద్రత, సైబర్ సెక్యూరిటీ అంశాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ-మెయిల్ పాలసీ ప్రకటించింది. దీని ప్రకారం ప్రభుత్వ ఈ-మెయిల్ వినియోగం తప్పనిసరి కానుంది. కొత్త పాలసీలో ప్రభుత్వ శాఖల వారీగా మెయిల్ కేటాయిస్తారు. ఉదాహరణకు.. ఐపీఎస్ అధికారులకు హోదా పేరుతో ips.gov.in కేటాయిస్తారు. పదవీవిరమణ పొందాక పెన్షన్ ఇతర ప్రభుత్వ ప్రయోజనాల నిమిత్తం అధికార మెయిళ్ల కోసం retiredips.gov.in కేటాయిస్తారు. పంచాయతి సిబ్బందికి panchayat.gov.in ప్రభుత్వ రంగాల్లో పనిచేసే కాంట్రాక్టు సిబ్బందికి contracter.gov.in, లాంటి శాఖల వారీగా వేర్వేరు ఈ-మెయిళ్లు కేటాయిస్తారు. తమ శాఖ ఆధ్వర్యంలో అధికారిక ఈ-మెయిల్ కేటాయించే అధికారాన్ని జాయింట్ సెక్రటరీ స్థాయి, అంతకంటే పైస్థాయి అధికారికి కేటాయించారు. జొరి.జీ మెయిళ్లన్నీ ఎన్ఐసీ పర్యవేక్షిస్తుంది. భద్రతకు సంబంధించిన అనుమానాస్పద ఈ-మెయిళ్లను గుర్తించి తొలగిస్తుంది. ప్రభుత్వం ఒకసారి ఈ-మెయిల్ కేటాయించాక అధికారిక మెయిళ్లకు వాటినే వినియోగించాల్సి ఉంటుంది. గరిష్ఠంగా 90 రోజులు వినియోగించకుంటే ఈ-మెయిల్ రద్దవుతుంది. ఆ తర్వాత పునరుద్ధరణకు సహేతుక కారణాలు చూపించి దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటికే gov.in,nic.in అధికారిక మెయిల్ వినియోగించే ప్రభుత్వ ప్రతినిధులు.. కొత్త విధానంలోకి అనుసంధానిస్తారు.

బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కౌన్సిల్ ఎన్నిక

బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కౌన్సిల్‌ను బుధవారం ఎన్నుకున్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా టి.వెంకట్రాములును, ప్రధాన కార్యదర్శిగా ధనుంజయనాయుడును, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా టి.వెంకటేశ్వరరావు, ఉప ప్రధాన కార్యదర్శిగా ఎన్.రాజమౌళి, ఉపాధ్యక్షులుగా ఆర్.కృష్ణమూర్తి, పి.యాదయ్య, కె.కృష్ణ, బాలయ్య యాదవ్, దశరథ్, బుచ్చన్న తదితరులను ఎన్నుకున్నారు. 55 మందితో రాష్ట్ర కౌన్సిల్ ఎన్నికైనట్లు అధ్యక్షుడు వెంకట్రాములు తెలిపారు.

పచ్చిగుడ్లతో చేసే మయోనైజ్‌పై నిషేధం

» తయారీ, నిల్వ, వినియోగంపై బ్యాన్

» తక్షణ అమలుకు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు

» ఏడాది పాటు కొనసాగనున్న ఆంక్షలు

హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పిజ్జా, బర్గర్, కేఎఫ్‌సీ, మోమోస్, షవర్మా తదితర ఆహార పదార్థాలతో కలిపి తినేందుకు దుకాణదారులు ఇచ్చే మయోనైజ్ (ఓ రకమైన సాస్)పై తెలంగాణ ప్రభుత్వం నిషేధం విధించింది. పచ్చి గుడ్లతో తయారు చేసే మయోనైజ్ వినియోగం, నిల్వపై నిషేధం విధిస్తున్నట్టు ప్రకటించింది. బుధవారం నుంచి ఏడాది పాటు ఈ నిషేధం అమలులో ఉండనుంది. ఈ మేరకు ఆహార భద్రత కమిషనర్ ఆర్వీ కర్ణన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల హైదరాబాద్, బంజారాహిల్స్‌లో చికెన్ మోమోస్ తిని ఒకరు చనిపోవడమే కాక 50 మంది ఆస్పత్రి పాలైన ఘటన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, పాశ్చరైజ్డ్ గుడ్లతో తయారు చేసి విక్రయించే బ్రాండెడ్ మయోనైజ్, శాకాహార పదార్థాలతో తయారు చేసే మయోనైజ్ వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. నిజానికి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆహార భద్రత విభాగం అధికారులతో బుధవారం ఓ సమీక్ష నిర్వహించారు. ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లతో నియమించిన టాస్క్ ఫోర్స్ కమిటీల పనితీరుపై ఆరా తీశారు. అయితే, పాడైపోయిన, ఉడకబెట్టిన గుడ్లతో తయారు చేసిన మయోనైజ్ వినియోగం ప్రజారోగ్యంపై ప్రభావం చూపిస్తుందని అధికారులు మంత్రికి వివరించారు. మోమోస్‌ను మయోనైజ్‌తో కలిపి తినడం వల్లే బంజారాహిల్స్ ఘటనలో ప్రజలు అస్వస్థతకు గురైనట్లు తెలిపారు. మయోనైజ్ నాణ్యత, అది తిన్న తర్వాత జరిగిన దుష్పరిణామాలపై పదుల సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో గుడ్లతో తయారు చేసే మయోనైజ్‌పై నిషేధం విధించాలని కోరారు. దీనిపై ఫుడ్ సేఫ్టీ ఉన్నతాధికారులు, వైద్యులతో చర్చించిన మంత్రి దామోదర రాజనర్సింహ.. మయోనైజ్ నిషేధానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.



ఫుడ్ సేఫ్టీ విభాగంలో కొత్త పోస్టుల భర్తీ!

రాష్ట్రంలోని హోటళ్లు, స్ట్రీట్ ఫుడ్ స్టాల్‌లు, హాస్టళ్ల సంఖ్య గత పదేళ్లలో భారీగా పెరిగిందని, దానికి అనుగుణంగా ఫుడ్ సేఫ్టీ విభాగాన్ని బలోపేతం చేయాలని, కొత్త పోస్టులు మంజూరు చెయ్యాలని అధికారులు ఈ సందర్భంగా మంత్రిని కోరారు. ఇందుకు స్పందించిన మంత్రి.. ఆహార భద్రత, ప్రజారోగ్యం అంశాల్లో రాజీపడే ప్రసక్తే లేదని అన్నారు. ఫుడ్ సేఫ్టీ అంశంలో ముందున్న రాష్ట్రాలు, దేశాల్లో పాటిస్తున్న విధానాలపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని సూచించారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు, ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌ల సంఖ్య పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. అవసరమైన కొత్త పోస్టులను మంజూరు చేసి, భర్తీ చేస్తామన్నారు. కొత్తగా మూడు ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తామని, ఐదు మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లను అందుబాటులోకి తెస్తామని మంత్రి తెలిపారు. ఏడాదికి సుమారు 24వేల శాంపిళ్లను పరీక్షించేలా ల్యాబ్‌లను బలోపేతం చేయాలని ఆదేశించారు. ఆహారం, మందులకు సంబంధించి ప్రజలు ఎవరికి, ఎక్కడ ఫిర్యాదు చేయాలనే అంశాలపై ప్రచారం చేయాలని మంత్రి సూచించారు.

'విద్యుత్తు' నిర్ణయాలన్నీ కేసీఆర్‌వే!

ప్రభుత్వానికి జ్యుడీషియల్ కమిషన్ నివేదిక

కేసీఆర్‌ను విచారణకు పిలవకుండా ఆయన లేఖలోని అంశాలనే అభిప్రాయాలుగా తీసుకున్న కమిషన్

గడువులోపే నివేదిక సమర్పణ!

హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు, విద్యుత్కేంద్రాలను నామినేషన్ ప్రాతిపదికన అప్పగించడం వంటి నిర్ణయాలన్నీ మాజీ సీఎం కేసీఆరే తీసుకున్నారని జ్యుడీషియల్ కమిషన్ నిర్ధారించింది. 'విద్యుత్తు' అవకతవకలపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ మదన్ భీంరావు లోకూర్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన కమిషన్ ఈ మేరకు నివేదికను సమర్పించినట్లు తెలిసింది. కమిషన్ నివేదికలో కేసీఆర్ పాత్రను ప్రధానంగా ప్రస్తావించినట్లు సమాచారం. ఈ నెల 29తో జస్టిస్ లోకూర్ కమిషన్ గడువు ముగిసింది. గడువులోపే ప్రభుత్వానికి నివేదికను అందించినట్లు తెలిసింది. జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి కమిషన్ చైర్మన్‌గా ఉన్న సమయంలో కేసీఆర్ రాసిన లేఖతోనే విచారణపై ఏకాభిప్రాయానికి వచ్చి నివేదికను సిద్ధం చేసినట్లు సమాచారం. కేసీఆర్ న్యాయపోరాటం.. సుప్రీంకోర్టు ఆదేశాలతో జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి తప్పుకొన్న సంగతి తెలిసిందే. అనంతరం కమిషన్ బాధ్యతలు చేపట్టిన జస్టిస్ లోకూర్.. విచారణ పత్రాలన్నింటినీ పరిశీలించారు. మరోవైపు విచారణ ప్రక్రియ నుంచి తప్పుకోవడానికి ముందే ఈ మొత్తం వ్యవహారంలో కేసీఆర్‌దే కీలక పాత్ర అని, ఆయన నిర్ణయాల వల్లే విద్యుత్తు రంగం దెబ్బతిన్నదని జస్టిస్ నర్సింహారెడ్డి నిర్ధారణకు వచ్చారు. కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వగా.. ఆయన లిఖితపూర్వకంగా తన అభిప్రాయాన్ని తెలియజేశారు. ఈ నేపథ్యంలో ఆయన్ను క్రాస్ ఎగ్జామినేషన్‌కు పిలవరాదని జస్టిస్ లోకూర్ అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. దాంతో కేసీఆర్ రాసిన లేఖలోని అంశాలనే అభిప్రాయాలుగా తీసుకొని, నివేదికను రూపొందించినట్లు తెలిసింది.



మలుపులు తిరుగుతూ..

తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పడగానే విద్యుత్తు రంగంపై శ్వేతపత్రం విడుదల చేసింది. ఛత్తీస్‌గఢ్‌తో జరిగిన విద్యుత్తు ఒప్పందంలో తప్పిదాలేంటి? 2000 మెగావాట్ల కోసం కారిడార్‌ను బుక్ చేసుకొని, ఆ మేరకు కరెంట్ తీసుకోకుండా పవర్ గ్రిడ్‌కు జరిమానాల రూపంలో కట్టినదెంత? పిట్‌హెడ్ విధానంలో కాకుండా సుదూరంలో యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణానికి నిర్ణయం తీసుకున్న కారణంగా దీర్ఘకాలంగా తెలంగాణ ప్రజలపై ఏ మేరకు భారం పడనుంది? కాలం చెల్లిన టెక్నాలజీతో భద్రాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణం వల్ల కలిగిన నష్టమేంటి? ఈ ఒప్పందంలో ఏ మేరకు తప్పిదాలు జరిగాయి? నామినేషన్ ప్రాతిపదికన యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్లను బీహెచ్ఈఎల్‌కు అప్పగించడం వల్ల జరిగిన నష్టాలేంటి? వంటి అంశాలపై విచారణ కోసం గత మార్చి 14న జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి నేతృత్వంలో కమిషన్ ఏర్పాటు చేసింది. విచారణ ప్రక్రియ పలు కీలక దశలు దాటి.. నివేదిక ఇస్తారనే క్రమంలో సుప్రీంకోర్టు తీర్పుతో జస్టిస్ నర్సింహారెడ్డి విచారణ ప్రక్రియ నుంచి తప్పుకొన్నారు. ఆ తర్వాత గత జూలై 29న జస్టిస్ లోకూర్ నేతృత్వంలో కమిషన్ వేసి.. 3 నెలల్లో (అక్టోబరు 29కల్లా) నివేదికను ఇవ్వాలని ఉత్తర్వులు ఇచ్చింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

వెలుగుల పండుగకు వేళాయే..

దీపావళికి ఉమ్మడి వరంగల్ జిల్లా ముస్తాబు

- ఉదయం మంగళహారతులు
- సాయంత్రం ధనలక్ష్మి పూజలు
- రేపు శ్రీగౌరీ కేదారీశ్వర వ్రతాలు
- పూజా సామానులు, పూల అమ్మకాలతో సందడే సందడి





హనుమకొండలో పూలను కొనుగోలు చేస్తున్న మహిళలు

హనుమకొండ కల్చరల్/వరంగల్ కల్చరల్/జనగామ కల్చరల్, మహబూబాబాద్/ములుగు/భూపాలపల్లి టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) :చీకటి వెలుగుల రంగేళి.. జీవితమే ఒక దీపావళి.. అన్నట్టుగా.. నరకాసురుడిని వధించి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన సత్యభామ శౌర్యం.. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా ప్రతీ ఏటా ఆశ్వయుజ మాసంలో అమావాస్య రోజున జరుపుకునే దీపావళి పర్వాన్ని గురువారం జరుపుకునేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలంతా సమయాత్తమయ్యారు. తెల్లవారుజామునే లేసి అభ్యంగన స్నానాలు ఆచరించి ప్రతీ ఇంటా గురువారం తెల్లవారుజామునే మంగళహారతులను అందుకొని ఇష్టదైవాన్ని పూజించుకోవడం ఆచారంగా వస్తోంది. ప్రతీ ఇంటా మామిడి తోరణాలతో, బంతిపూల దండలతో సర్వాంగ సుందరంగా అలంకరింప చేసుకున్నారు. రాత్రివేళల్లో బాణా సంచా కాల్చేందుకు ఆబాల గోపాలం ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు. దీపావళి పండుగ సందర్భంగా శుక్రవారం ఉదయం 3 గంటల నుంచి 6 గంటల వరకు మంగళహారతులు నిర్వహిస్తారు. ఆడబిడ్డలతో హారతులు తీసుకుంటారు. సాయంత్రం శ్రీధనలక్ష్మీ అమ్మవారి పూజలను నిర్వహిస్తారు. దీపావళి సందర్భంగా పూలు, పండ్లు, మిఠాయిల అమ్మకాలు ప్రారంభమయ్యాయి. పండుగ పర్వదినం సందర్భంగా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశారు. ఈసారి గురువారమే మంగళహారతులతోపాటు అమావాస్య స్వాతినక్షత్రం ఉన్నందున రాత్రి మహాలక్ష్మి వ్రతాలను ఆచరించుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.

చెడుపై మంచి సాధించిన విజయం

శ్రీకృష్ణుడు సత్యభామ సమేతంగా వెళ్లి నరకాసురుడిని సంహరించిన నేపథ్యంలో చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పర్వం ఆనందోత్సవాలతో జరుపుకోవడం ఒక ఆచారం, కాగా, శ్రీరామచంద్రుడు రావణుడిని సంహరించాక సీతాసమేతుడై రాజ్యాభిశక్తుడై అయోధ్య నగరానికి తరలివచ్చిన వేళ ఇదే స్వాతినక్షత్రం దీపావళి రోజు కావడంతో ప్రతీ ఇంటా ఆ రఘురాముడిని ప్రార్థిస్తూ ఉల్లాసంగా ఈపర్వాన్ని జరుపుకోవడం సంప్రదాయం. కుటుంబ సమేతంగా ప్రతీ ఒక్కరు ఐక్యమై ఆచరించుకునే హిందూ సంస్కృతిలోని ముఖ్యమైన పర్వాల్లో ఈ పర్వానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ముఖ్యంగా భక్తి శ్రద్ధలతో శ్రీకేదారేశ్వర వ్రతాలను ఆచరించుకోవడం ఈ పర్వానికే చెల్లింది. ఈ సందర్భంగా బుధవారం రాత్రి హనుమకొండ చౌరస్తాతో పాటు ఇతర ముఖ్య కూడళ్లల్లో దీపావళి పర్వ సామాగ్రి కొనుగోలు చేసేందుకు వచ్చిన వినియోగదారులతో కిటకిటలాడుతూ కనిపించింది. అమావాస్య రోజు చీకట్లను పారదోలి ఇంటింటా లక్ష్మీ దీపాలను నువ్వుల నూనెతో వెలిగించి పౌర్ణమి వెలుగులను సృష్టింప చేయడమే ఈ పర్వం ప్రత్యేకత.



రేపు వ్రతాలు

స్వాతినక్షత్రం అమావాస్య సందర్భంగా శ్రీగౌరీ కేదారీశ్వరస్వామి వ్రతాలను శుక్రవారం ఇంటింటా లక్ష్మీ నోములను ఆచరించుకోవడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. పడిపోయిన నోములు, కొత్త నోములు, ప్రతీ ఏడాది ఆచరించుకునే నోములను ఈ సంవత్సరం నిర్వహించుకోవచ్చని పండితులు చెప్పారు. దీపావళి నోముల సందర్భంగా తమ గృహాలకు సున్నాలు, కలర్లు వేసుకొని దీపావళి నోములను ఆచరించడానికి సిద్ధం చేస్తున్నారు.

పూజా సామగ్రి

శ్రీకేదారీశ్వర వ్రతానికి మామిడాకులు, బంతి పూల మాలలు, మర్రి కట్టెలు, మర్రి ఆకులు, మర్రి ఊడలు, వాగు ఇసుక, వరి గొలుసులు, మర్రి పండ్లు, కొత్త చాట, కొత్తకుండ కలశం కోసం, పసుపు, కుంకుమ, అక్షింతలు, ఊదులోబాన్, జామపండ్లు, సీతాఫలాలు, కొత్తకుడుకలు, కర్జూరపండ్లు, పోకలు, బెల్లం బూరెలు, అరిశలు, కొబ్బరి కాయలు, అగర్‌వొత్తులు, కర్పూరం బిల్లలు, నువ్వుల నూనె, అత్తిపత్తిదారం, మంగళ తోరణాలు, బెల్లం పాయసం పూజలకు అవసరమవుతాయి. నోముల సందర్భంగా వ్రత కల్పాన్ని చదువుతారు. మరునాడు నోములను ఎత్తుకొని నైవేద్యాలను స్వీకరించి అత్తిపత్తిదారాన్ని రక్షగా కట్టుకుంటారు.

నేడు దత్త క్షేత్రంలో మహాలక్ష్మికి ధనలక్ష్మి పూజ

దీపావళి పర్వదినం సందర్భంగా ములుగురోడ్‌లోని శ్రీగణపతి సచ్చిదానంద వర దత్తక్షేత్రంలో గురువారం సాయంత్రం శ్రీమహాలక్ష్మి అమ్మవారికి ధనలక్ష్మి పూజ, కొత్త నాణెములతో ధనార్చన, విశేష కుంకుమ పూజ, పారాయణాలు, భజనలు, మహా మంగళహారతులు, కాగడ హారతులు నిర్వహిస్తారు. అనంతరం భక్తులకు మహా ప్రసాదం అందిస్తారని శ్రీదత్తక్షేత్రం ట్రస్టు సభ్యులు వైవీ వామన్‌రావు తెలిపారు.





వరంగల్ ఉర్సు గుట్ట మైదానంలో దహనమవుతున్న నరకాసుర ప్రతిమ

కళ్లు చెదిరేలా..

ఘనంగా నరకాసురుడి ప్రతిమ దహనం

- ఉర్సు గుట్ట వద్ద ఉత్సాహంగా వేడుకలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- అలరించిన ప్రత్యేక బాణసంచా విన్యాసాలు



కరీమాబాద్, అక్టోబరు30, (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని ఉర్సు గుట్ట కుడా మైదానంలో బుధవారం నరకాసుర వధ కన్నుల పండువగా సాగింది. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలు ఆద్యంతం వైభవంగా కొనసాగాయి. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, భద్రకాళి దేవాలయ ప్రధాన అర్చకుడు భద్రకాళి శేష ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందించాలని, పండుగల విశిష్టతను తెలిపే కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. సనాతన ధర్మం అనేది విశ్వమానవ సౌభ్రాతృత్వానికి బాటలు వేస్తుందని, భగవంతుడు ధర్మాన్ని రక్షించేందుకు అవతరిస్తాడని అన్నారు. మనలోని దుర్గుణాలను త్యజించినప్పుడే మన జీవితంలో నిజమైన వెలుగు వస్తుందని, ఆనాడు నరకాసురుడు సృష్టించిన అల్లకల్లోలాన్ని శ్రీకృష్ణుడు సత్యభామతో కలసి రాక్షస సంహారం చేయడంతో ప్రజలు సంతోషంతో దీపావళి పర్వదినాన్ని జరుపుకున్నారని గుర్తు చేశారు. సనాతన ధర్మాన్ని కాపాడటంలో ఎన్ని అవరోధాలు అడ్డు వచ్చినా తుదకు ధర్మానిదే విజయమని అన్నారు. సనాతన ధర్మాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత అన్నారు. స్వాతంత్రోద్యమంలో నాయకత్వం వహించిన గాంధీ ధర్మబద్ధమైన మార్గాన్ని ఎంచుకున్నాడని అన్నారు. ప్రజలకు సంతోషాలు కలగాలన్నా, సర్వమానవ సౌభ్రాతృత్వం లభించాలన్నా ధర్మమార్గాన్ని అనుసరించాలని అన్నారు. ప్రతీ వ్యక్తి అష్టాంగ యోగాన్ని అచరించాలని, అందులో ఉన్నటువంటి యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, .

మిగతా 6లో..

అకాల వర్షానికి తడిసిన పత్తి



ఏనుమాముల మార్కెట్లో అకాల వర్షానికి తడిసిన పత్తి బస్తాలు

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో బుధవారం కురిసిన అకాల వర్షానికి పత్తి బస్తాలు తడిసిపోయాయి. వెంటనే స్పందించిన మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల యార్డు ఇన్‌చార్జితో మాట్లాడి పత్తి బస్తాలు తడువకుండా తాటిపత్రులను కప్పించారు. అప్పటికే కొన్ని పత్తి బస్తాలు తడిసిపోయాయి. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ఖరీదుదారులు తడిసిన బస్తాల కొనుగోలు సమయంలో బస్తాకు కిలో చొప్పున తరుగు తీసివేసి కొనుగోలు చేశారు. పత్తి మార్కెట్లో గరిష్ట ధర క్వింటాకు రూ. 6960లు పలుకగా కనిష్ట ధర రూ.5000 పలికింది.

పిడుగుపాటుతో యువ రైతు మృతి

- తల్లికి తీవ్ర గాయాలు
- కాల్‌నాయక్‌తండాలో విషాదం





నాగరాజు మృత దేహంపై పడి రోదిస్తున్న బంధువులు

చెన్నారావుపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పత్తి చేనులో పత్తి ఏరేందుకు కూలీకి వెళ్లిన ఓ యువ రైతు పిడుగుపాటుకు మృతిచెందాడు. ఆమె పక్కన నడుస్తున్న తల్లికి తీవ్రగాయాలయ్యాయి. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం కాల్‌నాయక్ తండాలో బుధవారం మధ్యాహ్నం ఈ విషాదం చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. కాల్‌నాయక్ తండాకు చెందిన రైతు కొర్ర నాగరాజు (28) తనకున్న ఎకరంన్నర చెలుకతో పాటు కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. బుధవారం తన చెలుక వద్ద పనిలేకపోవటంతో బానోతు నర్సింహ అనే రైతుకు పత్తి చేనులో పత్తి తీయడానికి కూ లీ పనులకు వెళ్లాడు. 20మంది కూలీలు పత్తి తీసే పనులు చేస్తుండగా మధ్యాహ్నా సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం వచ్చింది. ఈ క్రమంలో కూలీలందరూ వర్షంలో ఇంటికి వస్తున్న క్రమంలో కొర్ర నాగరాజు వద్ద పిడుగు పడడంతో కిందపడిపోయాడు. పక్కనే వస్తున్న నాగరాజు తల్లి షాంకీ చేయికి తీవ్ర గాయాలయ్యాయి. కొంచెం దూరంలో ఉన్న కూలీలు వారి వద్దకు చేరుకొని నాగరాజును నర్సంపేట ఆస్పత్రికి తరలించగా, పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కాగా, మృతుడికి భార్య విజయ, ఇద్దరు కుమారులు ఉన్నారు. యువ రైతు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మూగజీవాలపై పిడుగు

కురవి(ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కురవి మండలం మోద్గులగూడెం శివారు జుజుర్‌తండాలో పిడుగుపాటుకు రెండు దుక్కిటెద్దులు మృతి చెందాయి. బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షంలో పిడుగు పడడంతో పత్తిచేనులో ఉన్న హేమసుందర్‌కు చెందిన దుక్కిటెద్దులు అక్కడికక్కడే మృతి చెందాయి. పొద్దంతా ఏరిన పత్తిని రైతు దంపతులు ఇంటికి తీసుకువెళ్లేందుకు సిద్ధమవుతుండగా భారీ శబ్దంతో పిడుగుపడి ఎద్దులు మృతి చెందాయి. కొద్దిదూరంలోనే ఉన్న రైతు దంపతులు ప్రాణాలతో బయటపడ్డారు. అదే విధంగా కురవి మండలం మొగిలిచర్లలో పిడుగు పడడంతో చేనులో మేత మేస్తున్న ఇరుకులపాటి నర్సయ్యకు చెందిన పాడిగేదే అక్కడికక్కడే మృతి చెందింది.



వర్ధన్నపేటలో ప్రెస్ క్లబ్‌ను ప్రారంభిస్తున్న ఈగ మల్లేశం

జర్నలిస్టులు వారధులుగా నిలవాలి

కేంద్ర ఖాదీ చిన్న పరిశ్రమల బోర్డు పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం

వర్ధన్నపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులు ప్రభుత్వానికి, ప్రజలకు జవాబుదారితనంగా, వారధులుగా నిలిచి ప్రజాక్షేత్రంలో సమస్యలను వెలికితీయాలని కేంద్ర ఖాదీ చిన్న పరిశ్రమల బోర్డు పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం అన్నారు. బుధవారం వర్ధన్నపేట ప్రెస్‌క్లబ్ (ప్రింట్ మీడియా) కార్యాలయ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజాన్ని ముందుకు తీసుకెళ్లడంలో, ప్రజలను చైతన్యపర్చడంలో జర్నలిస్టులదే కీలక పాత్ర అన్నారు. కార్యక్రమంలో వర్ధన్నపేట మునిసిపల్ చైర్‌పర్సన్ అంగోతు అరుణ, వివిధ పార్టీ నేతలు రాయపురం సాంబయ్య, తుమ్మల రవీందర్, మంచాల రామకృష్ణ, ఎద్దు సత్యనారాయణ, రాయపురం కుమారస్వామి, పెద్దూరి రాజ్‌కుమార్, కొండేటి సత్యం, సిలువేరు కుమారస్వామి, తుమ్మల యాకయ్య, కరిమిల్ల సంపత్ రావు, ఎండి రహీం, కర్ర మాలతి శ్రీనివాస్‌రెడ్డి, ఇల్లందుల ఎలిషా, తీగల సునీత, గుజ్జ రవీందర్‌రెడ్డి, పోశాల వెంకన్నగౌడ్, అరెల్లి రవితోపాటు ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు ఐత ప్రవీణ్‌కుమార్, మల్లెపాక కుమార్, ఎం దేవేందర్, బుర్ర వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తులు

వరంగల్ మెడికల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కాకతీయ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పారా మెడికల్ బోర్డు ఉత్తర్వుల ప్రకారం నవంబరు 11వ తేదీలోపు కాకతీయ మెడికల్ కాలేజీలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తుతోపాటు అన్ని సర్టిఫికెట్స్ జిరాక్స్ ప్రతులను సమర్పించాలని సూచించారు.

ఎన్ఎంఏ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

వరంగల్ మెడికల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మెడికల్ అసోసియేషన్ వరంగల్ యూనిట్ ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం హనుమకొండ లష్కర్‌బజారులోని ఓ ఫంక్షన్ హాలులో ఘనంగా జరిగింది. విశ్వ ఆయుర్వేద పరిషత్, నేషనల్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ డీఎంహెచ్ఓలు వెంకటరమణ, కె.లలితాదేవి హాజరై మాట్లాడారు. నూతన అధ్యక్షుడు డాక్టర్ గుండా రవీందర్ మాట్లాడుతూ.. నేషనల్ మెడికల్ అసోసియేషన్‌లో గల ఆయుర్వేద డాక్టర్ల సంక్షేమానికి, కాంట్రాక్టు మెడికల్ ఆఫీసర్లను పర్మినెంట్ చేయడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ డాక్టర్ ఎం.సుధీర్ కుమార్, డాక్టర్లు చంద్రశేఖర్ ఆర్య, పులి సురేశ్, పులి అనిల్, వి.మోహన్‌రావు, జగదీశ్వర్ ప్రసాద్, హరి రమాదేవి, సమ్మిరెడ్డి, భాస్కర్, విశ్వ ఆయుర్వేద పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ జి.రాము, డాకర్లు మహేశ్, పాములపర్తి రామారావు, శ్రీనివాస్, కూరపాటి రమేశ్, రాధిక, జనరల్ సెక్రటరీ డాక్టర్ మైదం రాజు, కోశాధికారి డాక్టర్ సత్యం తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

బీసీలకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వాలు

- జీవో 29ని రద్దు చేయాలి
- ఆల్‌ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ నరేందర్
- ఏకశిలాపార్కు ఎదుట నిరసన దీక్ష



ఏకశిలాపార్కు వద్ద దీక్షలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

బాలసముద్రం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు అన్యాయం చేస్తున్నాయని, ఈడబ్ల్యూఎస్ జీవో 29ని రద్దు చేసి, కుల, జనగణనపై స్పష్టత ఇవ్వాలని ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిలాపార్కు ధర్నా చౌక్ వద్ద ఆల్ ఇండియా ఓబీసీ జాక్, తెలంగాణ యువజన సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ఒక్క రోజు నిరసన దీక్ష చేశారు. ఈ కార్యక్రమానికి బీసీ పొలిటికల్ జాక్ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ హాజరై మాట్లాడారు. జీవో 29 రద్దు చేసి బహుజన సమాజానికి న్యాయం చేయకుంటే రానున్న రోజుల్లో దేశ వ్యాప్తంగా బీసీ ఉద్యమం చేపట్టి రాజ్యాధికారం చేపడుతామని అన్నారు. బీసీల హక్కుల సాధన ఉద్యమానికి, బీసీల ఐక్యత కోసం ముందుంటానని తెలిపారు. తాడిశెట్టి క్రాంతికుమార్ మాట్లాడుతూ.. జోడో యాత్రలో సామాజికన్యాయం కోసం రాహుల్‌గాంధీ చెప్పిన మాటలను నమ్మి బహుజన సమాజం కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచిందని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కామారెడ్డి డిక్లరేషన్ మరిచిపోయిందని అన్నారు. జీవో 29తో బహుజన ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని అన్నారు.

ఆల్ ఇండియా ఓబీసీ జాక్ వైస్ చైర్మన్ పటేల్ వనజా మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చి బీసీలకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. ఈ నిరసన దీక్షలో గొల్లపల్లి వీరస్వామి, నలుబాల రవికుమార్, నారాయణగిరి, అమర్, తాటికొండ సద్గుణ, దేవిక, రాదక్క, పద్మాజ దేవి, సరోజన, అశ్విని, తెలంగాణ కొమురయ్య, కర్రె చంద్రశేఖర్, అనిశెట్టి సాయితేజ మామిడి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘంలో చేరిన తీగల ప్రదీప్‌గౌడ్

జాతీయ అధికార ప్రతినిధిగా నియామకం



ప్రదీప్‌గౌడ్‌కు కండువా కప్పి సంఘంలోకి ఆహ్వానిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

కాళోజీ జంక్షన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సామాజిక ఉద్యమ నాయకుడు, మహా సోషలిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన తీగల ప్రదీప్‌గౌడ్ బుధవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘంలో చేరారు. సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆయనకు కండువా కప్పి సంఘంలోకి ఆహ్వానించి ఆయనను సంఘం జాతీయ అధికార ప్రతినిధిగా ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రదీప్‌గౌడ్ మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లో బీసీల సమస్యలను పట్టించుకునే నాయకత్వం కరువైందన్నారు. తెలంగాణలో బీసీ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ముందుకు తీసుకెళ్తామని బీసీల రిజర్వేషన్లతో పాటు బహుజనుల రాజ్యాధికారం దాకా ప్రయాణం కొనసాగిస్తామన్నారు.

ఫొటోగ్రఫీలో శరత్ బాబుకు జాతీయ అవార్డు



శంభునిపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక సంస్కృతి సమితి సౌజన్యంతో ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి ఫొటోగ్రఫీ పోటీలలో వరంగల్ శంభునిపేటకు చెందిన వనం శరత్‌బాబు జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ఫొటో జర్నలిజం, ఫెస్టివల్ విభాగాలలో పోటీలను నిర్వహించారు. ఫెస్టివల్ విభాగంలో భాగంగా రంగలీలా మైదానంలోని దసరా వేడుకల దృశ్యానికి ద్వితీయ బహుమతి వరించినట్లు శరత్‌బాబు తెలిపారు. ప్రపంచ ఫొటో జర్నలిజం దినోత్సవం అయిన నవంబరు 1న విజయవాడలో ఆయన ఈ అవార్డు అందుకోనున్నారు. ఫొటోగ్రఫీలో ఎన్నో అవార్డులు అందుకున్న శరత్‌బాబుకు జాతీయ స్థాయి అవార్డు రావటం పట్ల జిల్లా ఫొటోగ్రాఫర్‌లు, నాయకులు, పలువురు ప్రముఖులు అభినందించారు. దసరా వేడుకల సందర్భంగా ఉర్సు గుట్ట రంగలీలా మైదానంలో తన కెమెరాలో బంధించిన రావణవధ చిత్రానికి తనకు అవార్డు రావటం గర్వంగా ఉందని శరత్‌బాబు అన్నారు.



అవార్డుకు ఎంపికైన రావణ వధ దృశ్యం

మాజీ మంత్రి ఎర్రబెల్లి ఇంట్లో విషాదం



చిన్నమ్మ అంతిమ యాత్రలో పాడె మోస్తున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రదీప్‌రావు

శంభునిపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రదీప్‌రావు చిన్నమ్మ ఎర్రబెల్లి సుజాత (80) బుధవారం మృతి చెందారు. ఎర్రబెల్లి దయాకర్‌రావు తండ్రి జగన్మోహన్‌రావు సోదరుడు డాక్టర్ సంపత్‌రావు భార్య సుజాత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. బుధవారం తెల్లవారుజామున హనుమకొండ రాంనగర్‌లో గల వారి నివాసంలో తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రదీప్‌రావు రాంనగర్‌కు చేరుకొని చిన్నమ్మ సుజాతకు నివాళులు అర్పించారు.

చిన్నాన్న సంపత్‌రావును, చిన్న సోదరి జ్యోతితో పాటు బావలు తక్కళ్ళ పల్లి భాస్కర్‌రావు, దయాకర్‌లను ఓదార్చారు అనంతరం స్వయంగా పాడె మోసి కన్నీటి పర్యంతమయ్యారు. హనుమకొండలోని పద్మాక్షి ఆలయం వద్ద గల హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియల్లో చిన్నకూతురు కుమారుడైన అనిష్ అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కాగా పెద్ద కూతురు తక్కళ్ళపల్లి జయశ్రీ ఇటీవల అమెరికాలో స్థిరపడ్డ తన కూతురు వద్దకు వెళ్లారు. తల్లి ఆఖరిచూపునకు నోచుకోలేక వీడియో కాల్ ద్వారా తల్లి అంతిమ యాత్రను చూసి బోరున విలపించారు.

కాగా, ఎమ్మెల్సీ తక్కళ్ళపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, బీజేపీ నాయకుడు కర్నె రవీందర్‌లతో పాటు పలువురు ప్రముఖులు మృతురాలు సుజాతకు నివాళులు అర్పించి ఎర్రబెల్లి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఎంజేపీ గురుకులాల్లో రెగ్యులర్ ప్రిన్సిపాళ్లను నియమించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో స్పెషల్ ఆఫీసర్లను తొలగించి వారి స్థానాల్లో రెగ్యులర్ ప్రిన్సిపాళ్లను నియమించాలని ఏబీఎస్ఎఫ్, స్వేరోస్ నాయకులు బొట్ల నరేష్, రాజేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం హైదరాబాద్‌లోని ఎంజేపీ గురుకులాల కార్యదర్శి డాక్టర్ సైదులును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... ఉమ్మడి వరంగల్ జిల్లాలోని స్పెషల్ ఆఫీసర్లను తొలగించి వారి స్థానాల్లో రెగ్యులర్ ప్రిన్సిపాళ్లను నియమించాలన్నారు. చాలామంది ప్రిన్సిపాళ్లు విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. వరంగల్‌లోని ఉర్సుగుట్ట, కొత్తగూడ, సంగెంలోని ఎంజేపీ గురుకులాల్లోని స్పెషల్ ఆఫీసర్లను సత్వరమే తొలగించి వారి స్థానంలో రెగ్యులర్ వారిని నియమించాలన్నారు.



ఎంజేపీ కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న ఏబీఎస్ఎఫ్, స్వేరోస్ నాయకులు

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్యాయత్నం

తండాలోని నీటి ట్యాంకు ఎక్కి హల్‌చల్

వర్ధన్నపేట రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రావడం లేదంటూ భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని రామోజీ కుమ్మరిగూడెం తండాలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... తండాకు చెందిన ధరావత్ గణేష్ తన భార్య రేణుక కాపురానికి రావడం లేదంటూ తండాలో ఉన్న మిషన్ భగీరథ నీటిట్యాంకు ఎక్కి దూకి ఆత్మహత్య చేసుకుంటానని హల్‌చల్ చేశాడు. దీంతో తండావాసులు భయాందోళనకు గురయ్యారు. దూకి చనిపోతానని బెదిరిస్తుండడంతో తండావాసులు ట్యాంకు ఎక్కి బలవంతంగా కిందకు దించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేశారు.



గణేష్‌ను కిందికి దించి తీసుకెళ్తున్న కుటుంబసభ్యులు

గంటపాటు హల్‌చల్

మద్యం మత్తులో నీటిట్యాంకుపైకి ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని ధరావత్ గణేష్ గంటపాటు తండావాసులను భయాందోళనకు గురి చేశాడు. గణేష్ డీసీ తండాకు చెందిన రేణుక అనే యువతిని కొన్నేళ్ల కిందట వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. ఇటీవల కుటుంబంలో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. వారం కిందట ఇద్దరి మధ్య గొడవ జరగడంతో భర్తను రేణుక వదిలివెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురై గణేష్ నీటిట్యాంకు ఎక్కాడు. మూడు రోజుల కిందట కూడా ఇంట్లో ఉరి వేసుకోవడానికి ప్రయత్నించగా కుటుంబ సభ్యులు అడ్డుకున్నట్లు తండావాసులు చెబుతున్నారు.

గంజాయి పట్టివేత

పాలకుర్తి, అక్టోబరు 30 ఆంధ్రజ్యోతి): భద్రాచలం నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్న ఒడిషా రాష్ట్రానికి చెందిన ఓ యువకుడిని పాలకుర్తి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం పాలకుర్తి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై పవన్‌కుమార్‌తో కలిసి సీఐ మహేందర్‌రెడ్డి మీడియాకు వివరాలను వెల్లడించారు. ఒడిషా రాష్ట్రానికి చెందిన సురేష్ పైడా జల్సాలకు అలవాటుపడి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంకు చెందిన సోడా రవి వద్ద 22 కిలోల గంజాయిని కొనుగోలు చేశాడు. పాలిథిన్ కవర్‌లో వేసుకొని హైదరాబాద్‌కు పాలకుర్తి మీదుగా మోటార్ సైకిల్‌పై వెళుతున్నాడు. కస్తూర్బా గాంధీ పాఠశాల సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డాడు. అతడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

ఏఎన్ఎం శిక్షణకు దరఖాస్తు గడువు పెంపు

మడికొండ, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): మడికొండలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం(మహిళా ప్రాంగణం)లో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (ఫిమేల్) ఏఎన్ఎం రెండేళ్ల కోర్సులో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవడానికి గడువును నవంబర్ 18 వరకు పెంచినట్లు బుధవారం ప్రాంగణం మేనేజర్ పి.జయశ్రీ తెలిపారు. ఆసక్తి గల ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మహిళలు కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, తెలంగాణ, హైదరాబాద్ పేరు మీద రూ. 200 డీడీ తీసి www.chfw.telangana.gov.in వెబ్‌సైట్‌లో దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం, MPHW(F)Training institute warangal కాలేజీ పేరు మీద సెలెక్ట్ చేసి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకోవడానికి ఎస్ఎస్‌సీ మెమో, ఇంటర్ మెమో, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, తెల్లరేషన్ కార్డు, నివాస ధృవీకరణ పత్రం, 6 పాస్ ఫొటోలు, ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికేట్(గవర్నమెంట్), 4 నుంచి 12 వ తరగతి వరకు స్టడీ సర్టిఫికేట్స్, టీసీ అవసరమవుతాయన్నారు. సమాచారం కోసం 7660022525, 7660022526 నెంబర్లలో సంప్రదించాలని డీఎం జయశ్రీ తెలిపారు.

కార్తీక మాసంలో శైవ క్షేత్రాలకు బస్సులు

బాలసముద్రం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో శైవక్షేత్రాలను సందర్శించే భక్తుల కోసం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 10, 17, 24, డిసెంబరు 1న కార్తీక సోమవారాలను పురస్కరించుకొని హనుమకొండ బస్‌స్టేషన్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రసిద్ధ పంచారామక్షేత్రాలైన అమరావతి అమరలింగేశ్వరస్వామి, భీమవరం శ్రీ సోమేశ్వర స్వామి ఆలయం, పాలకొల్లు క్షీర లింగేశ్వరస్వామి, ద్రాక్షారామం భీమేశ్వరస్వామి, సామర్లకోట భీమేశ్వరస్వామి ఆలయాలను దర్శించుకునే భక్తులు ఆర్టీసీ బస్సులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. తమిళనాడులోని అరుణాచలంలోని ప్రసిద్ధ క్షేత్రానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును నవంబర్ 13న వరంగల్-1 డిపో హనుమకొండ బస్‌స్టేషన్ నుంచి బస్సు సర్వీసును నడుపుతున్నట్లు ఆయన తెలిపారు. 73828 55492, 9959226056, 9959226047 నెంబర్లలో సంప్రదించాలని ఆర్ఎం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్ఏ మృతి

దేవరుప్పుల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జనగామ-సూర్యాపేట రహదారి లోని చింతబావితండా వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు గాయాలపాలయ్యారు. దేవరుప్పుల ఎస్సై సృజన్ కుమార్ తెలిపిన ప్రకారం... మండలంలోని మాదాపురం గ్రామానికి చెందిన వీఆర్ఏలు పందిననమైన మల్లేష్(45), పేరపు రామకృష్ణ, కామారెడ్డిగూడెంకు చెందిన టీసేవ నిర్వాహకుడు దౌపాటి అనిల్ కలిసి ద్విచక్ర వాహనంపై జనగామకు డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌కుమార్‌రెడ్డి అంత్య క్రియలకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో దేవరుప్పులకు వస్తుండగా చింతబావితండా వద్దకు చేరుకోగానే సూర్యాపేట వైపు నుంచి ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీఆర్ఏ మల్లేష్ అక్కడికక్కడే మృతి చెందగా, మరో వీఆర్ఏ రామకృష్ణ, టీసేవ నిర్వాహకుడు అనిల్‌కు గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి వచ్చి గాయపడిన ఇద్దరితో పాటు మల్లేష్ మృతదేహాన్ని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సృజన్‌కుమార్ వెల్లడించారు.

అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా..

దేవరుప్పుల డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌కుమార్‌రెడ్డి అనారోగ్యానికి గురై హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఆయన అంత్యక్రియల కోసం జనగామకు వెళ్లిన మాదాపురం గ్రామ వీఆర్ఏ మల్లేష్(45) రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. విషయం తెలియగానే మల్లేష్, రామకృష్ణ కుటుంబీకులు, గ్రామస్థులు జనగామ ఏరియా ఆస్పత్రికి తరలివెళ్లారు. మల్లేష్ మృతదేహాన్ని చూసి బోరున విలపించారు.

బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ అరెస్టు



బీఎస్ఎఫ్ పీసీ పూర్ణచందర్‌ను జైలుకు తరలిస్తున్న పోలీసులు

మడికొండ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారుల పేరు చెప్పి ల్యాండ్ సెటిల్‌మెంట్లకు పాల్పడిన బీఎస్ఎఫ్ కానిస్టేబుల్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట మండలం కొత్తపల్లికి చెందిన భూపతి హరీష్, అతడి బాబాయి భూపతి సురేష్, రమేష్, శ్రీనివాస్‌ల మధ్య భూమి తగాదా ఉంది. భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం నవాబుపేట గ్రామానికి చెందిన బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ కొక్కుల పూర్ణచందర్ ప్రస్తుతం పశ్చిమ బెంగాల్‌లో 115బీఎన్ బీఎస్ఎఫ్ జవాన్‌గా పని చేస్తున్నాడు. ఈ మధ్యనే సెలవుపై వచ్చి కొత్తపల్లిలో అద్దెకుంటున్నాడు. భూపతి హరీష్, సురేష్, రమేష్, శ్రీనివాస్‌ల మధ్య భూమి తగాదా నడుస్తోందని తెలుసుకున్నాడు. వారి భూ తగాదాను ఆసరాగా చేసుకొని తనకు తానుగా వారికి డీఎస్పీగా పరిచయం చేసుకున్నాడు. తనకు ఉన్నతాధికారులు తెలుసునని భూ సమస్యను సెటిల్ చేస్తానని వారికి తెలిపాడు. ఈనెల 22న పోలీస్ యూనిఫామ్ వేసుకొని భూపతి సురేష్, అతడి మిత్రుడు మారినేని రోహిత్‌కు డీఎస్పీ పేరు చెప్పి ల్యాండ్ సమస్య సెటిల్మెంట్ చేసుకోవాలని, లేకుంటే చంపుతానని బెదిరించాడు. ఈ విషయమై హరీష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు (క్రైం నెం. 258/2024 యు/ఎస్) 319,308(5),292, 351(2) బీఎన్ఎస్ సెక్షన్ల ప్రకారం పూర్ణచందర్‌పై కేసు నమోదు చేశారు. ఈమేరకు బుధవారం అతడిని పోలీసులు అరెస్టు చేసి జనగాం సబ్ జైలుకు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

కాజీపేట ఎస్ఎంగా రవీందర్

కాజీపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కాజీపేట స్టేషన్ మేనేజర్‌గా అగ్గి రవీందర్ నియమిస్తూ రైల్వే ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న సత్యనారాయణ రెడ్డి గురువారం ఉద్యోగ విరమణ పొందనున్నాడు. ఈమేరకు బుధవారం సత్యనారాయణ రెడ్డి నుంచి రవీందర్ బాధ్యతలు తీసుకున్నారు. రవీందర్ గతంలో కాజీపేట డిప్యూటీ మేనేజర్‌గా 2010 నుంచి 2022 వరకు పనిచేశారు. అనంతరం 2022 నుంచి 24 వరకు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి ప్రస్తుతం కాజీపేట స్టేషన్ మేనేజర్‌గా బదిలీపై వచ్చారు. నవంబర్ 1 నుంచి రైల్వే స్టేషన్ మేనేజర్‌గా పూర్తి స్థాయి విధులు చేపట్టనున్నారు.



బాధ్యతలు స్వీకరించిన అగ్గి రవీందర్

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీ రకం)	2467	2080
పల్లికాయ (సూక)	4610	4000
పల్లికాయ (పచ్చిది)	---	---
కందులు	8212	6900
పెసళ్లు	6352	4052
పత్తి	6960	5500
కొత్తపత్తి	---	---
పసుపు (కాడి)	---	---
పసుపు (గోల)	---	---
తేజ మిర్చి	12000	9000
తేజ ఏసీ	17000	12000
వండర్‌హాట్ ఏసీ	13600	11000
యూఎస్341ఏసీ	14000	11000
దేశీ ఏసీ	---	---
సింగిల్‌పట్టి ఏసీ	---	---
తాలు మిర్చి	8000	3000

- వరంగల్ వ్యవసాయం